www.visalaandhra.com

విశాలాంధ్ర

స్థాపితం : 1952

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

సంపుటి : 68
సంచిక : 220

శనివారం 02-02-2019

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

వెల: రూ.4.00

పేజీలు: 12+ టాబ్లాయిడ్

విజయవాడ ప్రచురణ

మిథాలీ 'రికార్డు'

కెరీర్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన తొలి మహిళా క్రికెటర్



క్రికెటర్‌గా ఆమె ప్రస్థానం.. మహిళా క్రికెట్ పురోగమనం గురించి చెప్పాల్సి వస్తే రెండూ సమాంతరంగా నడుస్తాయి. ఆమె ఎవరో కాదు.. టీమిండియా మహిళా జట్టు కెప్టెన్ మిథాలీరాజ్. న్యూజిలాండ్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌తో ఆమె కెరీర్‌లో 200 మ్యాచ్‌లు ఆడింది. ఈ ఘనత సాధించిన మొదటి మహిళగా రికార్డుకెక్కింది.

12లో

బంద్ సక్సెస్



విజయవాడ బస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న రామకృష్ణ, జల్లి విల్సన్, ఓబులేసు, దోనేపూడి, దుర్గాభవానీ, జయలక్ష్మి తదితరులు



విజయవాడలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను అడ్డుకున్న దుర్గాభవాని, జయలక్ష్మి, సుంకర పద్మశ్రీ తదితర మహిళా నేతలు



బంద్ సందర్భంగా తిరుపతిలో ర్యాలీ నిర్వహిస్తున్న నారాయణ, వామపక్ష నాయకులు, కార్యకర్తలు

సాధనసమితి బంద్‌కు మద్దతిచ్చిన సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, ప్రజాసంఘాలు

- నిలిచిన బస్సు సర్వీసులు
- విజయవాడలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను అడ్డుకున్న మహిళా నేతలు
- మూతబడిన దుకాణాలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు
- హోదా ఇవ్వకపోతే బీజేపీ శ్మశానానికే: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఐదుకోట్ల మంది ఆకాంక్ష ప్రత్యేకహోదా: సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ

ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రాష్ట్రబంద్ విజయవంతం అయింది. ఈ బంద్‌కి సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, తెలుగుదేశం, ఆమ్‌ఆద్మీపార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు పలికాయి. ఆందోళనకారులు బస్టాండ్‌లలో బస్సులను అడ్డుకోవడంతో రాష్ట్రంలో బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంపై ఉన్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్రవాప్తంగా వ్యాపార సంస్థలు, దుకాణాలు, కళాశాలను స్వచ్ఛందంగా మూసివేశారు. దీంతో జనజీవనం స్తంభించిపోయింది.

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
విజయవాడలో జవహర్‌లాల్ నెహ్రూ బస్టాండ్ ఎదుట సీపీఐ, ప్రత్యేకహోదా సాధన సమితి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆందోళన నిర్వహించారు. బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ పాలన రాజ్యాంగ విరుద్ధంగా సాగుతోందని ధ్వజమెత్తారు. న్యాయం చేయాలని అడిగితే అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఐదుకోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష ప్రత్యేకహోదా అన్నారు. ప్రత్యేకహోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇద్దరు ఎంపీలతో తెలంగాణ సాధించుకున్నారని, ఇదే తరహాలో ఐదుకోట్లమంది కలిసి పోరాటం సాగిస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా వచ్చి తీరుతుందన్నారు. పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సీఎంకి నాలుగేళ్లుగా లేఖలు రాసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఆయన ఢిల్లీలో దీక్షలు చేస్తామంటున్నారని విమర్శించారు. లెనిన్ సెంటర్‌లో సీపీఎం రాష్ట్రకార్యదర్శి మధు ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు, ఉపప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గాభవానీ, సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరుజిల్లాలో

గుంటూరు బస్టాండ్ ఎదుట సీపీఐ రాష్ట్రసహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బస్సుల రాకపోకలకు అడ్డుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుకోట్ల ఆంధ్రుల అభివృద్ధి కోసం జరిగే బంద్‌లో రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్న అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రత్యేకహోదా కోసమే పుట్టామని చెప్పిన చాలా పార్టీలు బంద్‌కు దూరంగా ఉన్నాయంటే వారు మోడీకి భయపడుతున్నారా అని ప్రశ్నించారు. ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్‌ప్లాంట్, రామాయపట్నం పోర్టు ఇవ్వకుండా బీజేపీ గాలిమాటలు చెబుతున్నదని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఈశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరిజిల్లాలో

కాకినాడలో సీపీఐ జిల్లాకార్యదర్శి తాటిపాక మధు నాయకత్వంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద బైఠాయించి బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. సీపీఐ, సీపీఎం

- మిగతా 2 లో

తెలుగు రాష్ట్రాలకు మళ్లీ

మొండిచెయ్యి

చివరి బడ్జెట్‌లోనూ కనికరించని కేంద్రం




- విభజన అంశాల ఊసేలేదు
- ప్రస్తావనే లేని కీలక ప్రాజెక్టులు పోలవరం, అమరావతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలకు మరోమారు మొండిచేయి చూపింది. కనీసం చివరి బడ్జెట్‌లోనైనా కనికరిస్తుందని ఆశించిన తెలుగురాష్ట్రాల ప్రజలకు నిరాశే మిగిలింది. విభజన గాయాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఏపీపై కేంద్రం ఏమాత్రం కనికరం చూపలేదు. బడ్జెట్‌లో అసలు విభజన అంశాల ఊసేలేదు. చివరకు జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు గాని, కీలకమైన అమరావతి రాజధాని ప్రస్తావనగాని, రెవెన్యూలోటు అంశం గాని బడ్జెట్‌లో చోటుచేసుకోకపోవడం గమనార్హం. విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం రెవెన్యూలోటు భర్తీ చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. నాలుగున్నరేళ్లుగా దీనిగురించి పట్టించుకోని కేంద్రం చివరి బడ్జెట్‌లోనూ రిక్త హస్తాన్నే చూపింది. అలాగే ఏపీ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు నిధులిచ్చే విషయాన్ని మాటమాత్రంగానైనా గోయల్ ప్రస్తావించలేదు. ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు మూడున్నర వేల కోట్లు అదనంగా ఖర్చు పెట్టింది. వీటి గురించి కాని, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధుల అంశం గాని బడ్జెట్‌లో ప్రస్తావనకు కూడా నోచుకోకపోవడం రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇటీవల వెనుకబడిన ప్రాంతాలకు విడుదల చేసిన రూ.350 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఎకౌంట్‌లో పడిన తర్వాత కూడా వెనక్కి తీసుకుంది. ఇది పెద్ద వివాదస్పదమైంది. కనీసం ఆఖరి బడ్జెట్‌లోనైనా కేటాయింపులు జరుగుతాయని ఆశించారు. కేంద్రప్రభుత్వ విద్యా, వైద్య సంస్థలకు సైతం అవసరమైన నిధుల కేటాయింపులు చేయలేదు. రాష్ట్రాన్ని మరోసారి మోసగించిన కేంద్ర బడ్జెట్‌పై వివిధ

- మిగతా 2 లో

బ్యాలెట్ బడ్జెట్

2019-20 బడ్జెట్
రూ.27,84,200 కోట్లు



పియూష్ మధ్యంతర విన్యాసం - లోక్‌సభకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమర్పణ

- ఆదాయపన్ను పరిమితి రూ.5 లక్షలకు పెంపు
- అసంఘటిత రంగ కార్మికులకు రూ.3 వేల పింఛను
- ప్రతి నెలా రూ.100 ప్రీమియం చెల్లించాలని షరతు
- ఆద్యంతం జనాకర్షక పథకాలకే పెద్దపీట
- రూ.75 వేల కోట్లతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి
- ఐదెకరాలలోపుంటే 3 విడతల్లో రూ.6 వేలు
- 2018 డిసెంబరు నుంచి అమలుకు రూ.20 వేల కోట్లు
- 2022 నాటికి అందరికీ ఇళ్లు
- గ్రాట్యుటీ పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు



అంతా ఊహించినట్టే ఎన్నికల వేళ మోడీ సర్కార్ ఓట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. రూ.27,85,200 కోట్లతో 2019-20 మధ్యంతర బడ్జెట్‌ను ప్రతిపాదించింది. సీట్ల కోసం ఓట్లే ప్రధాన అజెండాగా కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఎన్‌డీఏ కూటమికి లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా తగ్గనున్నట్లు ఇటీవల అనేక సర్వేలు వెల్లడించాయి. అసలే అధికార దాహంతో ఉన్న ప్రధాని మోడీ ఏ విధంగానైనా తిరిగి గద్దెనెక్కాలన్న కాంక్షతో ఓట్ల కోసం జనాకర్షక పథకాలతో బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించారు. మరో రెండు, మూడు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనుండగా, అన్నివర్గాలను ఆకట్టుకుని ఓట్లు దండుకునేలా బడ్జెట్‌ను రూపొందించారు. ఇది నూటికి నూరుపాళ్లు ఎన్నికల బడ్జెట్ అని, నాలుగేళ్లు ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేయని బీజేపీ సర్కార్...ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ విధంగా తాయిలాలు ప్రకటించిందని, ఇది ఎన్నికల జిమ్మిక్కు అని విపక్షాలు విమర్శించారు.

3లో

సినీ నిర్మాణాలకు సింగిల్ విండో అనుమతులు

11లో



అందరికీ మేలు

మధ్యంతర బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి ఈ బడ్జెట్ ఓ ట్రైలరు మాత్రమే..

\- నరేంద్ర మోడీ



సన్నాయి నొక్కులు

రైతులకు సాయం పేరుతో ఏడాదికి రూ.6వేలు చొప్పున ఇస్తానంటూ కేంద్రం సన్నాయి నొక్కులు నొక్కుతోంది. ఏడాదికి ఆరువేలంటే రైతుకు వచ్చేది రోజుకు రూ.17 మాత్రమే...

\- రాహుల్



తాయిలాలతో మోసం

నాలుగేళ్లుగా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికలే లక్ష్యంగా హామీల వర్షం కురిపించింది తాయిలాలతో ప్రజలను మోసం చేయాలని చూస్తోంది... - సురవరం

కేంద్రంపై సుప్రీం అసహనం

సీబీఐ చీఫ్‌ను నియమించక పోవడంపై ఆగ్రహం

11లో

రక్తం ఉడుకుతోంది


ఎవరికి ఊడిగం చేస్తారు...!

- రాష్ట్రానికి అన్యాయం చేస్తారా..?
- హక్కుల కోసం రాజీలేని పోరాటం
- 11న ఢిల్లీలో నిరాహారదీక్ష చేస్తా
- అసెంబ్లీలో బీజేపీపై నిప్పులు చెరిగిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
రాష్ట్రం విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయనందుకు నిరసనగా సీఎం సహా ఎమ్మెల్యేలంతా నల్ల చొక్కా ధరించి శుక్రవారం సభకు హాజరయ్యారు. చంద్రబాబు సభలోకి ప్రవేశించే సమయానికి బీజేపీ ఫ్లోర్ లీడర్ వెనుకబడిన జిల్లాలకు కేంద్రం కేటాయించిన నిధులను వెనక్కి తీసుకోవటంపై మాట్లాడుతున్నారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు'పై లఘు

- మిగతా 2 లో

"కొత్త రాష్ట్రానికి సహకరించాల్సింది పోయి.. అన్యాయం చేస్తారా..?, తమిళనాడు, గుజరాత్‌కు ఇచ్చిన నిధులతో ఏపీకి ఎంత ఇచ్చారో పోల్చి చూడండి. నిధులు ఎవరి కోసం ఇస్తారు, మేము పన్నులు చెల్లించడంలేదా?, రక్తం ఉడుకుతోంది.. ఎవరికి ఊడిగం చేస్తారు.. అడిగేవారు లేరనుకుంటున్నారు.. అంటూ బీజేపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు."



ఇరాన్‌తో బ్రిటన్, ఫ్రాన్స్ వాణిజ్యం

బ్రస్సెల్స్ : ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందంనుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైదొలగడం, ఆదేశంపైన తిరిగి బ్యాంకులకు సంబంధించిన లావాదేవీలపై ఆంక్షలు విధించడంవల్ల యూరోపియన్ యూనియన్ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌తో సహా తక్కిన ప్రపంచ దేశాలతో నిర్వహిస్తున్న వాణిజ్యాన్ని కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ద్రవ్య చెల్లింపుల వ్యవస్థను రూపొందించుకోవాలని అప్పుడే నిర్ణయించారు. అయితే ఈ వ్యవస్థ రూపొందడంలో జాప్యం కావడంతో ట్రంప్ ప్రభుత్వం తమ ప్రయత్నాన్ని అవహాస్యం చేసింది. దీంతో మూడు ప్రధానమైన యూరోపియన్ యూనియన్ స్నేహదేశాలు ఇరాన్‌తో వాణిజ్యాన్ని కొనసాగించాలని నిర్ణయించాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనా దేశాలు కూడా 2015లో ఇరాన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై అమెరికాతోపాటు సంతకాలు చేశాయి. పరస్పర వాణిజ్యానికి ప్రధాన సాధనంగా ఇన్‌స్టెక్స్ పేరుతో కొత్త కంపెనీని ఈ దేశాలు స్థాపించాయి. ఇరాన్ కంపెనీలు, ఈ దేశాల కంపెనీల మధ్య వస్తుమార్పిడి చేసుకోవాలని నిర్ణయించాయి. డాలర్‌ను లేదా ఇతర ఆర్థిక వ్యవహారాల జోలికి వెళ్లకుండా వస్తుమార్పిడి విధానంలో వాణిజ్యాన్ని కొనసాగించాలని ఈ దేశాలు నిర్ణయించాయి. అణు ఒప్పందం నుండి తాము వైదొలగబోమని, ట్రంప్ ఆరోపించినట్టుగా ఇరాన్‌లో అణ్వాయుధాలను తయారు చేయడంలేదని ఈ దేశాలు పేర్కొన్నాయి. అణు ఒప్పందానికి కట్టుబడి ఇరాన్ అనుసరిస్తున్నట్టు అమెరికా కాంగ్రెస్‌కి ఆదేశ ఇంటిలిజెన్స్ ఏజెన్సీలు తెలియజేశాయి. కేవలం అణు కార్యకలాపాలను మాత్రమే నిర్వహిస్తున్నదని మిస్సైలీలను తయారుచేయడం, టెర్రరిస్టులకు తోడ్పాటునివ్వడం లాంటి వాటికి ఇరాన్ పూనుకోలేదని ఇంటిలిజెన్స్ వర్గాలు కాంగ్రెస్‌కి తెలియజేశాయి. ఈ అంశంపైన ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బహుశ ఇంటిలిజెన్స్ అధికారులు తిరిగి స్కూలుకి వెళ్లి చదువుకోవాలేమో అని వారిని ఎగతాళి చేశారు. ఇన్‌స్టెక్స్ సంస్థను ఫ్రాన్స్‌లో రిజిష్టర్ చేశారు.



విశాలాంధ్ర ప్రపంచం

జిన్‌పింగ్‌ను కలిశాక వాణిజ్య ఒప్పందం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్ : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో త్వరలో భేటీ అవుతానని, ఆ తరువాత గొప్ప వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలియజేశారు. సుంకాల విధింపునకు సంబంధించి తలెత్తిన సంఘర్షణను పరిష్కరించుకునేందుకు రెండు దేశాల ప్రతినిధులు బుధ, గురువారాలలో సమావేశమై చర్చించారు. అయితే ఇంతవరకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదరలేదు. చైనా వస్తువులపై ట్రంప్ 25 శాతం అదనంగా సుంకాలను విధించడంవల్ల ఘర్షణ తలెత్తింది. చైనా కూడా అమెరికా వస్తువులపైన సుంకాలను పెంచింది. ఇది ప్రపంచ మార్కెట్లు, ఆర్థికరంగంపైన తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. చర్చలలో పురోగతి ఉన్నదని ఇంకా చేయవలసింది చాలా వుందని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలియజేసింది. మార్చి 2వ తేదీలోపు ఒప్పందం కుదుర్చుకుందామని ట్రంప్, జిన్‌పింగ్‌లు అర్జెంటైనాలో భేటీ అయినపుడు నిర్ణయించుకున్నారు. అందుకు అనుగుణంగానే చర్చలు సాగుతున్నాయి.

నిఘా విభాగంతో సర్దుబాటు : అమెరికా నిఘా ఏజెన్సీ అధికారులపైన తరచుగా విరుచుకుపడుతున్న ట్రంప్ తాజాగా వారితో సర్దుకుపోయేందుకు నిర్ణయించుకుని తన పంథాను మార్చుకున్నాడు. ప్రపంచంలో వివిధ దేశాలనుండి ఎదురవుతున్న ముప్పులపై నిఘా ఏజెన్సీ అధిపతులు వేసిన అంచనాను ఆమోదించేందుకు కూడా ట్రంప్ సిద్ధమయ్యారు. తామంతా ఒకే అభిప్రాయంతో ఉన్నామని ట్రంప్ చెప్పారు. జాతీయ ఇంటిలిజెన్స్ డైరెక్టర్‌తోను, ఇతర ఉన్నతస్థాయి



భద్రతా అధికారులతోను ట్రంప్ ఒవల్ ఆఫీసులో గురువారం సమావేశమయ్యారు. సెనేట్‌లో తనను విచారించడానికి సంబంధించిన అంశాలు మీడియా తప్పుగా చిత్రీకరించిందని ఇంటిలిజెన్స్ అధికారులు తనకు చెప్పినట్టు ట్రంప్ వెల్లడించారు. ఉత్తరకొరియా పూర్తిగా అణ్వాయుధాలను ధ్వంసం చేయకపోవచ్చునని ఇంటిలిజెన్స్ అధికారులు ట్రంప్‌కి చెప్పారు. ప్రపంచంలోని వివిధ మార్గాలలో ఎదురయ్యే ముప్పుకు సంబంధించిన అంశాలపై తమ అంచనాలను అధికారులు ఆయనకు వివరించారు. పశ్చిమ దేశాలలో ప్రజాస్వామ్యం క్షీణిస్తుందన్న ప్రచారం జరుగుతోందని వారు తెలియజేశారు. ఇరాన్, ఐఎస్ ఉగ్రవాదులు, ఉత్తరకొరియా మొదలైన అంశాలపై తాను తీసుకున్న నిర్ణయాన్ని ఇంటిలిజెన్స్ అధికారులు అంగీకరించారని చెప్పారు.

ఈనెలలోనే కిమ్‌తో భేటీ : ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌తో ఈనెల చివరిలో భేటీ కానున్నట్టు ట్రంప్ తెలియజేశారు. అయితే ఎక్కడ, ఎప్పుడు సమావేశమయ్యేది వచ్చేవారం ప్రకటిస్తానని ట్రంప్ చెప్పారు. ఈ భేటీ జరగటం ఎంతైనా అవసరమని ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. తాను అధికారాన్ని చేపట్టేనాటికి ఉత్తరకొరియాతో యుద్ధం తప్పదేమోనని భావించినట్టు ట్రంప్ వెల్లడించారు. ఇప్పుడు మిస్సైలీల పరీక్షలు అక్కడలేవు, రాకెట్ అలాగే అణుపరీక్షలు లేవు. ఖైదీలు, శరణార్థులు తదితర అంశాలపై చర్చించాము. గత ఏడాది జూన్‌లో సింగపూర్‌లో కిమ్‌తో భేటీ అయినతరువాత రెండు దేశాలు శాంతిబాటపట్టాయని ఆయన తెలిపారు. ఆ సమావేశం తరువాత నిర్దిష్టమైన విజయాల జాబితా పెరిగిందని చెప్పుకున్నారు. కిమ్‌తో జరగనున్న భేటీకి సంబంధించిన ఏర్పాట్లను చూసేందుకు ఒక బృందాన్ని ఆసియాకు పంపుతున్నట్టు అమెరికా విదేశాంగమంత్రి మైక్‌పాంపియో తెలియజేశారు. వియత్నాం, థాయ్‌లాండ్, హవాయ్, సింగపూర్ దేశాలను రెండవసారి భేటీకి పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. పాంపియో ప్రతినిధి స్టీఫెన్‌బియ్‌గన్ త్వరలో ఉత్తరకొరియా, దక్షిణకొరియాలలో పర్యటించి వివిధ అంశాలను చర్చించనున్నారు.

బ్రిటన్‌ను వీడనున్న పలు వాణిజ్య సంస్థలు

లండన్ : బ్రెగ్జిట్ ఒప్పందం కుదిరి బ్రిటన్ ఈయూ నుండి వైదొలగితే తమ పరిస్థితి దెబ్బతినవచ్చునని భావిస్తూ ఇక్కడ వాణిజ్యం చేస్తున్న పలు సంస్థలు తమ కార్యకలాపాలను ఇతర దేశాలకు తరలించాలని యోచిస్తున్నాయి. మూడు సంస్థలలో ఒకటి తమ వ్యాపార కేంద్రాలను మార్చుకోవాలని యోచిస్తున్నట్టు ప్రముఖ లాబీగ్రూపు తెలియజేసింది. 1200ల సంస్థలనుండి అభిప్రాయాలను సేకరించగా 29 శాతం వాణిజ్యవేత్తలు తాము ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాలని భావిస్తున్నట్టు చెప్పారని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఒడి) వెల్లడించింది. బ్రిటన్‌లో తమ కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయని, అందువల్లే తాము ఇతర దేశాలకు తరలివెళ్లిపోవాలని యోచిస్తున్నట్టు ఆ సంస్థలు తెలిపాయి. 10 సంస్థలలో ఒకటికంటే ఎక్కువగా ఇప్పటికే బ్రిటన్ నుండి వెళ్లిపోయి ఇతర ప్రాంతాలలో తమ సంస్థలను నెలకొల్పుకున్నాయి. యూరోపియన్ యూనియన్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఎక్కువ సంస్థలు యోచిస్తున్నట్టు ఐఒడి తెలిపింది. ఐఒడి 30వేల వాణిజ్యసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఐఒడి తాత్కాలిక డైరెక్టర్ జనరల్ ఎడ్విన్‌మోర్గాన్ మాట్లాడుతూ బ్రెగ్జిట్ జాప్యం, గందరగోళం తదితర అంశాలను, వాటి పర్యవసానాలను పరిగణలోకి తీసుకోకుండా ఉండలేమని అన్నారు. తమ కంపెనీలను రక్షించుకోవడమే తనకు ముఖ్యమని ఆయన చెప్పారు. నివారించలేని ఆటంకాలు, పెరగనున్న వాణిజ్య అడ్డంకులు, తద్వారా ఒప్పందం కుదరకపోవడంలాంటివి ఎదురౌతున్నందున మార్పు తప్పనిసరి అని అన్నారు. అయితే కొన్ని సందర్భాలలో ఇక్కడే వ్యాపారం చేయడం సానుకూలంగా ఉండవచ్చునని ఆయన తెలిపారు. కొన్ని సంస్థలు పాక్షికంగానైనా తమ కార్యకలాపాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని కూడా భావిస్తున్నాయి. పత్రికల్లో ఆయా కంపెనీల కార్యకలాపాలపైన ప్రధానంగా వార్తలు వస్తున్నాయి. 11 శాతం కంపెనీల డైరెక్టర్లు ఇప్పటికే ఇతర ప్రాంతాలకు తమ కార్యకలాపాలను మార్చుకునేందుకు ప్రణాళిక వేసుకున్నారని, బ్రెగ్జిట్ విషయం తేలాక తమ ప్రణాళికను అమలు చేయాలని మరో 5 శాతం మంది నిర్ణయించుకున్నారని, 13 శాతంమంది తప్పనిసరిగా దేశాన్ని విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారని తెలియజేశారు. బ్రెగ్జిట్ ఒప్పందంపై అనిశ్చితి కారణంగా వ్యాపారవేత్తలు రోజురోజుకి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. వేలాది సంస్థలు తమ కార్యకలాపాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించినట్టు బ్రిటన్ వాణిజ్యమండలి తెలిపింది.

వాణిజ్య ఒప్పందంపై ట్రంప్‌కి జిన్‌పింగ్ లేఖ

వాషింగ్టన్ : త్వరగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా తమ దేశాల ప్రజలకు సానుకూల సంకేతాన్ని పంపినట్లవుతుందని సూచిస్తూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి లేఖను పంపారు. ఒప్పందం కుదిరినట్లయితే విస్తృతమైన అంతర్జాతీయ సమాజానికి కూడా సానుకూల సంకేతం అందుతుందని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలు అత్యంత కీలకము, ముఖ్యం అని పేర్కొన్నారు. మార్చి 2వ తేదీలోపు చర్చలు పూర్తిచేసి ఒప్పందం కుదుర్చుకోవాలని ఇద్దరు నేతలు ఇదివరకే అంగీకరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన చర్చల్లో పాల్గొన్న చైనా ప్రతినిధి ఒకరు ఈ లేఖను చదివి వినిపించారు. బ్యూనస్‌ఎయిర్స్‌లో ట్రంప్, జిన్‌పింగ్ భేటీ అయినప్పుడు వాణిజ్యయుద్ధాన్ని ముగించి 90 రోజులలోపల చర్చల అనంతరం ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. బ్యూనస్‌ఎయిర్స్‌లో జరిగిన సమావేశం విజయవంతమయ్యిందన్న అంశాన్ని జిన్‌పింగ్ తన లేఖలో పేర్కొన్నారు. సమన్వయం, సహకారం, సుస్థిరత ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని తాము అంగీకరించిన అంశాన్ని జిన్‌పింగ్ ప్రస్తావించారు. సమావేశం అనంతరం ఫోన్‌ద్వారా జరిగిన సంభాషణ కూడా చెక్కగా సాగిందని ఆయన గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలు ఏర్పడి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఒకరినొకరు అభినందించుకున్నారు. రెండు దేశాల ఆర్థిక బృందాలు జరిపిన చర్చలు మంచి పురోగతిని సాధించినట్టు కూడా జిన్‌పింగ్ పేర్కొన్నారు. పరస్పర గౌరవం, ఇచ్చిపుచ్చుకునే స్ఫూర్తి, త్వరలో ఒప్పందం కోసం ఇరుదేశాల ప్రతినిధులు సంప్రదింపులు జరపడంవల్ల ఇరుపక్షాలకు ప్రయోజనం కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య మంచి సంబంధాలు ఉన్నట్లయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధిచెందుతుందని తన లేఖలో జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. లేఖను అందుకున్న ట్రంప్ స్పందిస్తూ ఇది గొప్ప లేఖ అని ప్రశంసించారు. చర్చలకు వచ్చిన చైనా ప్రతినిధి బృందంతో ఆయన ఈ లేఖను ప్రస్తావిస్తూ జిన్‌పింగ్‌ను అభినందించారు.

జర్నలిస్టుకు ఆస్ట్రేలియా సాహిత్య అవార్డు



కాన్‌బెరా: జర్నలిస్టు, చలనచిత్రకారుడు, శరణార్థి అయిన బెహ్రౌజ్‌బూఛనికి ఆస్ట్రేలియా సాహిత్య అవార్డు లభించింది. ఈ అవార్డుకింద ఆయనకు 72,600 అమెరికన్ డాలర్లు బహుమతిగా లభిస్తాయి. ఇరాన్‌లో ఆశ్రయం కోరిన ఈ శరణార్థిని పపూన్యూగునియాలో నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆస్ట్రేలియాలో అత్యంత విలువైన సాహిత్య అవార్డు ఇది. తన ఫోన్‌లో పేరాలుపేరాలు రాసి వాట్సప్‌ద్వారా ఒమిడ్‌టొఫిఘియన్‌కు పంపగా ఆయన దాన్ని అనువాదం చేసి పుస్తకాన్ని ప్రచురించారు. "నోఫ్రెండ్ బట్‌దిమౌంటైన్స్ : రైటింగ్ ఫ్రం మనూస్‌ప్రిజన్" పేరుతో పుస్తకాన్ని ప్రచురించారు. కల్పనాయేతర సాహిత్య కేటగిరీకింద మరో 25000 ఆస్ట్రేలియా డాలర్లు కూడా ఆయనకు బహుమతిగా లభిస్తాయి. అనువాద రచయిత టొఫిఘియన్ కూడా ఈ అవార్డును అంగీకరించారు. ఫోన్ ద్వారా పంపిన సమాచారాన్ని తీసుకుని అనువాదం చేసి పుస్తకరూపంలో తీసుకురావడానికి ఐదేళ్ల సమయం పట్టింది. రచయిత తన జీవితాన్నే కథలుగా మలచి రచన చేశారు. సాహిత్య అవార్డు పోటీకి 27 రచనలురాగా బూచని రచనకే అవార్డు లభించింది.

మొండిచెయ్యి

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయపార్టీలు నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీయేతర రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నారు-యనమల :

కేంద్రం విచక్షణ మేరకు ఇచ్చే నిధులను బీజేపీ ఏతర రాష్ట్రాలకు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. రాష్ట్రానికి రాజ్యాంగబద్ధంగా వచ్చే నిధులపై బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారు తప్ప ప్రత్యేకంగా ఇచ్చిన నిధుల గురించి, విభజన చట్టంలో చెప్పినవి ఏమి నెరవేర్చారో చెప్పడం లేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామన్నారు కానీ, ఎలా ఇస్తారో చూడాల్సి ఉందన్నారు. వ్యవసాయవృద్ధి రేటు మన రాష్ట్రంలో బాగుంది. దేశంలో వ్యవసాయ వృద్ధి రేటు చాలా తక్కువగా ఉంది. దీన్ని బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టింది ఎన్నికల బడ్జెట్టు అని, దిగువ, మధ్యతరగతి ప్రజలను కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

ఇది ఎన్నికల బడ్జెట్ : సీపీఐ నేత రామకృష్ణ :

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్ తెలుగువారిని పూర్తిగా నిరాశపర్చిందన్నారు. విభజన చట్టంలోని హామీల అమలు గురించి కానీ, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజక్టుకు సవరించిన అంచనాల ప్రకారం నిధుల ఊసుగానీ; తెలంగాణకు ఉక్కు పరిశ్రమ, రైల్వే ఫ్యాక్టరీ వంటి ఊసేమీ లేకపోవడం బాధకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో బడ్జెట్ రోజునే ప్రజలు నిరసన వ్యక్తం చేస్తూ బంద్ పాటించినా కేంద్ర పాలకుల్లో కించిత్ కనికరమే లేకుండా పోయిందని అన్నారు. ఇది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లా లేదని, అకౌంట్ ఫర్ ఓట్స్‌గా ఉందని అభివర్ణించారు.బడ్జెట్‌లో మధ్యతరగతి వర్గాలకు, ఉద్యోగులకు పెద్ద ఊరట కల్పించినట్లు చెప్పడం మోడీ ఎన్నికల జిమ్మిక్‌గా రామకృష్ణ పేర్కొన్నారు. ఆదాయం పన్ను మినహాయింపు పరిధి రూ. 2.50 లక్షల నుంచి రూ. 5లక్షలకు పెరిగినా అమలయ్యేది వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20లో అన్నారు. అంటే దీని అమలు భారం మాత్రం రాబోయే ప్రభుత్వం మీద పడనుందన్నారు. రైతులకు రూ.75వేల కోట్లు కేటాయించడం, ఐదు ఎకరాలలోపు వారికి రూ. ఆరువేల సాయం మూడు విడతలుగా అందడం కూడా కంటి తుడుపు చర్యలేనని పేర్కొన్నారు. కౌలు రైతుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. నిజంగా రైతులను ఆదుకునే చిత్తశుద్ధి ఉంటే స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని ఆయన కోరారు.

ఏపీకి ద్రోహం చేసిన మోడీ బడ్జెట్- సీపీఎం మధు :

కేంద్రం మరోసారి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. విభజన హామీల అమలుకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. కేవలం ఎన్నికల రాజకీయ అవసరార్థం కన్నీటి తుడుపుగా కొన్ని పథకాలు ప్రకటించి చేతులు దులుపుకుంది. దీన్ని సీపీఎం తీవ్రంగా నిరసిస్తుందన్నారు. ధరల నియంత్రణ చేశామని, అవినీతిని అరికట్టామని ప్రకటించడం హాస్యాస్పదంగా వుందన్నారు. అసంఘటిత కార్మికులకు పెన్షన్ ఇస్తామంటూనే వారిపైనే బీమా భారాన్ని మోపిందన్నారు. దేశవ్యాప్తంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నా పట్టించుకోలేదన్నారు.

కంటి తుడుపు బడ్జెట్ -పీసీసీ చీఫ్ రఘువీరా :

తాత్కాలిక బడ్జెట్ దేశ, రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని ఏపీసీసీ అధ్యక్షులు డా. రఘువీరా రెడ్డి వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. రైతులు ఈ బడ్జెట్‌లో కేంద్రం రుణమాఫీ ప్రకటిస్తుందని ఎదురు చూశారన్నారు. కేవలం ఏడాదికి రూ. 6వేలు..అదీ మూడు విడతలుగా ఇస్తామని ప్రకటించడంతో ఆశాభంగం చెందారన్నారు. ఇటీవల 10 శాతం అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో ఆమోదించినప్పుడు వారి ఆదాయ పరిమితి రూ.8 లక్షలుగా పేర్కొన్నారు. ప్రజల ఆదాయ పరిమితి కూడా రూ. 8 లక్షలకు చేస్తారని ఆశించారని, కాని ఈ నిర్ణయం ఆశా భంగం కలిగించిందన్నారు. కేంద్రం ఏపీకి మరోసారి ద్రోహం చేసిందని విమర్శించారు.

కనీస వేతన ప్రస్తావనేది -ఏఐటీయూసీ :

కార్మికుల కనీస వేతనాల పెంపుదల అంశాన్ని బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చలసాని వెంకటరామారావు విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసే గ్యారెంటీ ఏమి ఇవ్వలేదు. ఉపాధి అవకాశాల పెంపుదలకు ఎటువంటి గ్యారెంటీ ఇవ్వలేదు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొన్ని రాయితీలు ప్రకటించినా పేద, మధ్యతరగతి ప్రజల, రైతుల ఆదాయం పెరుగుదలకు ఎటువంటి చర్యలు బడ్జెట్లో చేపట్టలేదు. ఇది కేవలం ఎన్నికల తాయిలాల బడ్జెట్‌లా వుందని ఎద్దేవా చేశారు.

కేంద్రబడ్జెట్ ఓ మాయ- వ్య.కా.సం :

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పేదలను, రైతులను మోసం చేసి మాయ చేసిందని వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ విమర్శించారు. పేదలకు ఇళ్లు, విద్యుత్, మరుగుదొడ్లు, విద్య, వైద్యం అంద్రాక్షగా మారాయని, వాటిగురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావన లేదన్నారు. అలాగే ఆహారభద్రత నిధులు పెంచకపోవడం, ఉపాధి హామీ కూలి రేట్లు పెంచకపోవడం పేదలపట్ల నిర్లక్ష్యానికి నిదర్శనంగా పేర్కొన్నారు.

బంద్ సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో భానుగుడి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అలాగే రాజమహేంద్రవరంలో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆందోళనకారులు ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారు. జిల్లాలో జనసేనతోపాటు టీడీపీ ఎమ్మెల్యేలు కూడా బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ చైర్మన్ బూరిగ ఆశీర్వాదం, సీపీఎం జిల్లాకార్యదర్శి కె.శ్రీనివాస్, సీపీఐ కాకినాడ కార్యదర్శి నక్కా కిషోర్, సీపీఐ రాజమహేంద్రవరం నగర కార్యదర్శి నల్లా రామారావు , సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, వంగమూడి కొండలరావు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, రైతుసంఘం నాయకులు కోమటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నంజిల్లాలో

విశాఖపట్నం నగరంలో మద్దిలపాలెం జాతీయ రహదారిపై సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తితోపాటు జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణల ఆధ్వర్యంలో నాయకులు బైఠాయించారు. దీంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. పైగా ఆటో కార్మికులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వడంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఈనేపథ్యంలో జేవీఎస్‌ఎస్‌తో సహా యాభైమందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.పైడిరాజు, నగర సహాయ కార్యదర్శి జేడీ నాయుడు, పీసీసీ ప్రధానకార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాస్, బెహరా భాస్కర్‌రావు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విమల తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంజిల్లాలో

అనంతపురంలో సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్, సహాయ కార్యదర్శులు సి.జాఫర్, పి.నారాయణస్వామిలు బస్టాండ్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా డి.జగదీష్ మాట్లాడుతూ ప్రత్యేకహోదా వచ్చే వరకు పోరాటాలు సాగిస్తామన్నారు. సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. టీడీపీ శ్రేణులు నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు లింగమయ్య, నగర కార్యదర్శి శ్రీరాములు, రమణయ్య, అల్లీపీరా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తులసీరామ్‌నాయక్, మనోహర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, మహిళా సమాఖ్య నాయకురాల్లు జయలక్ష్మీ, వరలక్ష్మీ, అశాబీ, పద్మావతి, ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో

తిరుపతిలో బంద్ విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేకహోదా ప్రకటించకుంటే బీజేపీ ప్రభుత్వం స్మశానానికి వెళ్లక తప్పదని హెచ్చరించారు. చివరి బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేకహోదా బిల్లును ఆమోదించకుంటే రాష్ట్రంలో బీజేపీ నాయకులను తిరగనివ్వమన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనార్టీలు, జర్నలిస్టులు, అభ్యుదయ వాదులపై దాడులు పెరిగాయన్నారు. తొలుత వామపక్ష కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకుని కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు రామానాయుడు, పుల్లయ్య, సీపీఐ తిరుపతి నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు పెంచలయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురములో బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డి.జగదీష్, సి.జాఫర్, పి.నారాయణస్వామి, ఇతర నాయకులు



బంద్ సందర్భంగా విజయవాడలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

విజయనగరం జిల్లాలో

విజయనగరం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీపీఐ జిల్లాకార్యదర్శి ఒమ్మి రమణ ఆధ్వర్యంలో బైఠాయించి బస్సుల రాకపోకలను స్తంభింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. బొబ్బిలిలో జరిగిన బంద్‌లో ఐదుగురు సీపీఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, సీపీఎం నాయకులు టీవీ రమణ, రెడ్డి శంకర్‌రావు, జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు యడ్ల ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంజిల్లాలో

శ్రీకాకుళం నగరంలో సీపీఐ జిల్లాకార్యదర్శి సనపల నర్సింహులు, సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందరలాల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి బస్సుల రాకపోకలను నియంత్రించారు. ఏపీఎన్జీవోనేతలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, ఇతర విద్యాసంస్థలు బంద్‌కి మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, బుడితి అప్పలనాయుడు, చాపర వేణు, బలగ శ్రీరామ్మూర్తి, పట్టా ప్రభావతి, ఎం.యుగంధర్, షణ్ముఖరావు, శ్రీనివాస్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరుజిల్లాలో

నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్, సీపీఐ జిల్లాకార్యవర్గసభ్యులు అరిగెల నాగేంద్రసాయి, సీనియర్ నాయకులు రామరాజుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బస్సుల రాకపోకలను నిలుపుదల చేశారు. గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ మీదుగా ఆర్టీసీ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి మునీర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అన్వర్, రైతుసంఘం నాయకుడు షానవాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మస్తాన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లీలామోహన్, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వెంకట్రావ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కడపలో

కడపలో సీపీఐ, సీపీఎం, జనసేన నాయకులు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుని బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. సీపీఐ జిల్లాకార్యదర్శి జి.ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. వాహనాలను అడ్డుకోవడంతో పాతబస్టాండ్, నగర శివారులలో ట్రాఫిక్ నిలిచిపోయింది. జిల్లాలో ఉన్న అన్ని ప్రాంతాలలో బంద్ జరిగింది. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లాకార్యవర్గ సభ్యులు విజయలక్ష్మీ, సీపీఐ నాయకులు పులి కృష్ణమూర్తి, నాగ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో

ప్రకాశంజిల్లాలో బంద్ విజయవంతమైంది. ఎనిమిది డిపోల్లో బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. సీపీఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ రాష్ట్రనాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్ల నాయకత్వంలో నిరసన కార్యక్రమాలు చేశారు. కందుకూరులో సీపీఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కర్నూలు జిల్లాలో

కర్నూలులో ఏపీ రైతు సంఘం రాష్ట్రప్రధానకార్యదర్శి ఆవుల శేఖర్, కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీపీఐ నగర కార్యదర్శి పి.గోవిందు, సహాయ కార్యదర్శి గోవిందు, మహేంద్ర, ఏఐటీయూసీ రాష్ట్రనాయకులు మనోహర్‌మాణిక్యం, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఈనేపథ్యంలో పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. డోన్, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరులలో కూడా నిరసనలు జరిగాయి. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీరాములు, సీపీఐ నాయకులు సురేష్, రాము, రామ్‌నాయక్, మాజీమంత్రి మారెప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా

జిల్లాలో ఏలూరుతోపాటు అన్ని ప్రాంతాల్లో బంద్ పాటించారు. కార్యక్రమంలో సిపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకరరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తం ఉడుకుతోంది

(మొదటిపేజీ తరువాయి)

చర్చకు స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అనుమతించగా, తనను ఢిల్లీ పంపిస్తే వెనక్కి తీసుకున్న రూ.350 కోట్లను తెస్తానని చెప్పారు. అప్పుడే సభలోకి ప్రవేశించిన చంద్రబాబు ఒక్కసారిగా ఆగ్రహంతో విష్ణుకుమార్ వైపు చూస్తూ పైవిధంగా స్పందించారు. 'విభజన చట్టంలో లేనివి కూడా ఇచ్చామని చెబుతున్న మీరు రాష్ట్రానికి చేసిన సాయం ఏమిటో చెప్పండి' అని సూటిగా ప్రశ్నించారు. కొత్త రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం జరిగిందని ప్రజలే చెబుతున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలకు అతి సామాన్యులు అందచేస్తున్న ఆర్థిక సాయమే ఉదాహరణ అని చెప్పారు. కాకినాడకు చెందిన మున్నీసాబేగం కూడబెట్టిన పెన్షన్ సొమ్ము రూ.50 వేలతోపాటు అంగన్‌వాడీ టీచర్‌గా చేస్తున్న కుమార్తె జీతం రూ. 10,500తోసహా మొత్తం రూ.60,500ను రాజధాని నిర్మాణానికి అందజేశారన్నారు. 'ఆంధ్ర ప్రజలకు పౌరుషం లేదా..?' అంటూ ఆమె అందజేసిన లేఖను సభలో చదివి వినిపించారు. అనేక మంది ఇతోధికంగా రాష్ట్రానికి సాయం చేస్తుంట, బాధ్యత కలిగిన కేంద్రం అన్యాయం చేస్తోందని వ్యాఖ్యానించారు. సాధారణ పౌరులకున్న ఆసక్తి ప్రజాప్రతినిధి మీకు లేదా అని విష్ణుకుమార్ రాజును ఉద్దేశించి అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, హక్కుల సాధన కోసం 11న న్యూఢిల్లీలో నిరాహారదీక్ష చేయనున్నట్లు తెలిపారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే ఐటీ, సీబీఐతో దాడుల చేయించి జైల్‌లో పెట్టటం, ఇష్టం వచ్చినట్లు వ్యవహరించటంపై కేంద్రానికి ఎదురొడ్డి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. లాలూచీ రాజకీయాలు చేసే పార్టీలను గమనించాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే అన్నీ దిగమింగుకుని బీజేపీతో నాలుగేళ్లపాటు కొనసాగామన్నారు. అనేక సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగానని, ప్రధాని సహా కేంద్రమంత్రులెందరినో కలిసినా, చివరకు అమరావతి నిర్మాణానికి మట్టి-నీళ్లు తప్ప ఇంకేమీ ఇవ్వలేదని ఆవేదనను వెలిబుచ్చారు.

ఉత్తరాదికే పెద్దపీట

బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉత్తరాది అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇచ్చిందని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని నర్మదానదీ తీరంలో రూ.2,900 కోట్లతో సర్దార్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు.

రూ.1.10 లక్షల కోట్లతో అహ్మదాబాద్ - ముంబై బుల్లెట్ రైలు మార్గం, రూ.300 కోట్లతో డొలేరా నగర నిర్మాణం, ప్రయాగ కుంభమేళాకు రూ.1,200 కోట్లు, ద్వారకలో కన్వెన్షన్ సెంటరు నిర్మాణానికి రూ.27 వేల కోట్లను కేంద్రం ఇచ్చిందన్నారు. అదే సమయంలో దక్షిణాదికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దక్షిణాది నుంచి ఉన్న మంత్రుల్లో వెంకయ్యను ఉపరాష్ట్రపతి చేసి పక్కనపెట్టారని, దత్తాత్రేయను పదవి నుంచే తొలగించారన్నారు. అసలు వెంకయ్యను ఉపరాష్ట్రపతి చేయడం పదోన్నతా, లేక పనిష్మెంటా అని వ్యాఖ్యానించారు.

మరో అగ్రిగోల్డ్ బాధితురాలు మృతి

ముప్పాళ్ల ప్రభృతుల నివాళి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : అగ్రిగోల్డ్ బాధితురాలు మరొకరు ప్రాణాలు కోల్పోయారు. గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరి నివాసి మందలపు శ్రీలక్ష్మి(42) అగ్రిగోల్డ్ మోసంతో మనోవేదనకు గురై మృతి చెందింది. అగ్రిగోల్డ్ కంపెనీలో ఏజెంటుగా చేరి ప్రజలతో డబ్బులు కట్టించడమే కాకుండా తమ పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఉపయోగపడతాయని తన సొమ్మును కూడా కంపెనీలో దాచుకుంది. అయితే కంపెనీ బోర్డు తిప్పేయడంతో సొమ్ము వసూలుకు గత నాలుగు సంవత్సరాలుగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అనేక ఉద్యమాల్లో భాగస్వామి అయింది. ప్రభుత్వం హామీలు ఇవ్వడమే గాని ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వెనుకంజ వేయడంతో దాచుకున్న డబ్బులు వస్తాయో లేదో అనే బాధ, డబ్బులు చెల్లించిన వారి ఒత్తిడితో శ్రీలక్ష్మి మనోవేదనకు గురికావడంతో ఆరోగ్యం దెబ్బతిన్నది. గురువారం రాత్రి శ్రీలక్ష్మి మృతి చెందింది. శ్రీలక్ష్మికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీలక్ష్మి తల్లి జంపని అంజనీదేవి అసోసియేషన్ రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలిగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సాతులూరులోని స్వగృహంలో ఉంచిన శ్రీలక్ష్మి మృతదేహాన్ని శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, సహాయ కార్యదర్శి బి.చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నాగలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంత్రూనాయక్, కేతినేని అగస్టీన్, ఉపాధ్యక్షులు షేక్ కరిముల్లా, పెద బాబు, శ్రీవాణి, పాములపాటి సుజాత, సొలస వెంకటేశ్వర రావు సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

బ్యాలెట్ బడ్జెట్...!



న్యూఢిల్లీ : ఇన్‌చార్జి ఆర్థికశాఖ మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పలు ప్రజాకర్షక పథకాలకు పెద్దపీట వేసింది. అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునేలా మోడీ సర్కార్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. పీయూష్ గోయల్ తన ఆర్థిక చిట్టాలో ఆద్యంతం ఓటర్లను ఆకట్టుకునే ప్రతిపాదనలు చేశారు. ఎన్నికల వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఓటర్లపై వరాల జల్లు కురిపించారు. రైతులు, మధ్యతరగతి ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు సహా అన్ని వర్గాలను ఆకర్షించేలా తాయిలాలు ప్రకటించారు. బ్యాలెట్ గెలుపు కోసమే బడ్జెట్ అని చెప్పేందుకు రైతులకు ప్రకటించిన రూ.6 వేల సాగు సాయమే ఇందుకు నిదర్శనం. ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద మూడు విడతలలో ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. వాస్తవానికి ఖరీఫ్ సీజన్‌లో ఎకరా భూమి దుక్కి దున్నేందుకే రూ.2 వేలు చాలని పరిస్థితి. వ్యవసాయం సంక్షోభంలో ఉన్నందున దేశవ్యాప్తంగా రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండు చేస్తుంటే... మోడీ ప్రభుత్వం అందుకు భిన్నమైన నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్న రైతులను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నంలోనే ఈ అత్తెసరు పథకాన్ని ప్రకటించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో ఈ పథకానికి కేంద్రం రూ.75 వేల కోట్లు కేటాయించింది. మూడు విడతలలో రైతుల ఖాతాలో నేరుగా జమ చేయనున్న ఈ పథకాన్ని గతేడాది డిసెంబరు నుంచి అమలు చేయనున్నట్లు పీయూష్ గోయల్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.20 వేల కోట్లను కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకం వల్ల దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల కింద రుణాలు అందిస్తామని, రుణాలు సకాలంలో చెల్లించిన వారికి రాయితీలు చెల్లిస్తామని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతుల రుణాలు రీషెడ్యూల్ చేస్తామని హామీ ఇచ్చారు. పాడి పరిశ్రమ రుణాలు సకాలంలో చెల్లించే వారికి అదనంగా మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తామని చెప్పారు.

ఉద్యోగులకు భారీ ఊరట

సాధారణంగా ఐదేళ్లకు ఒకసారి ఉద్యోగులకు వరాలు ప్రకటించటం కేంద్ర ప్రభుత్వానికి ఆనాయితీగా వస్తోంది. బీజేపీ సైతం అందుకేమీ తీసిపోలేదు. ఎట్టి పరిస్థితిలోనూ ఉద్యోగుల ఓట్లు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ఏకంగా రెట్టింపు చేసింది. ఇప్పటి వరకు రూ.2.50 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి ఇన్‌కం ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంది. ఎన్నికల వేళ దీనిని మోడీ ఒక్కసారిగా రూ.5 లక్షలకు పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. గృహరుణాలు, ఇంటి అద్దెలు, బీమా కలిపి 6.50 లక్షల ఆదాయం వరకు ఎలాంటి పన్ను ఉండబోదని మంత్రి ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశంలో మూడు కోట్ల మంది మధ్య తరగతి ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేలకు పెంచనున్నట్లు గోయల్ ప్రకటించారు. పొదుపు ఖాతాలపై వచ్చే వడ్డీని రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంచనున్నట్లు వెల్లడించారు. నెలకు రూ.50 వేల జీతం వరకు టీడీఎస్ వర్తించదని, సొంతిల్లు అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయంపై రూ.2.50 లక్షల వరకు పన్ను ఉండదని స్పష్టం చేసింది. కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికుల ఓట్లను గంపగుత్తగా పొందేందుకు పింఛన్‌సుతో మోడీ ప్రభుత్వం వారికి ఆశపెట్టింది. ప్రధానమంత్రి శ్రమ యోగి బంధన్ పేరుతో 60 ఏళ్లు నిండిన ప్రతి అసంఘటితరంగ కార్మికుడికి నెలకు రూ.3 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే, నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లించే కార్మికులే ఈ పథకానికి అర్హులుగా పేర్కొంది. ఈ పథకం అమలు వల్ల 10 కోట్ల మందికి రూ.3 వేల పింఛన్ అందే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) సభ్యుల సంఖ్య పెరిగిందని, దీంతో గ్రాట్యుటీ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. ఈఎస్ఐ పరిధిని రూ.15 వేల నుంచి రూ.21 వేలకు పెంచింది. ఎన్‌పీఎస్ విధానంలో ప్రభుత్వ వాటాను 14 శాతానికి పెంచుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా 2022 నాటికి ప్రతి ఒక్కరికి ఇళ్లు, దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 150 జిల్లాలపై ప్రత్యేక దృష్టి, హర్యానాలో ఎయిమ్స్ ఏర్పాటు, అంగన్‌వాడీ టీచర్ల జీతం 50 శాతం పెంపు, తదితర ప్రతిపాదనల ద్వారా మధ్యంతర బడ్జెట్‌లో మోడీ సర్కారు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసినట్టు కనిపిస్తోంది.

నిరుద్యోగుల ఊసే లేదాయే...

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మోడీ..ఐదేళ్లలో ఇచ్చిన మొత్తం ఉద్యోగాలు రెండు కోట్లను మించలేదు. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా రూపొందించిన మధ్యంతర బడ్జెట్‌లో నిరుద్యోగులకు మాత్రం స్థానం దక్కలేదు. 45 ఏళ్లలో లేనంత గరిష్టస్థాయికి నిరుద్యోగం చేరింది. మోడీ పాలన వచ్చాకే నిరుద్యోగ సమస్య ఒక్కసారిగా ఏడు శాతానికి చేరింది. ఈ ఏడాది అంతానికి ఇది ఎనిమిది నుంచి తొమ్మిదిశాతానికి చేరే అవకాశం ఉందని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఓ) వెల్లడించింది. దేశంలో అత్యధికంగా యువత ఉండటంతో వారి ఓట్ల కోస గత ఎన్నికల ప్రణాళికలో ఉద్యోగాలను ఎరగా వేశారు. గత ఎన్నికల్లో 15 కోట్ల మంది తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోగా, ఈసారి ఆ సంఖ్య అదేస్థాయిలో ఉండనుంది. ఇలాంటి పరిస్థితిల్లో బడ్జెట్‌లో నిరుద్యోగ ప్రస్తావన లేకపోవటం శోచనీయం. గ్రామీణ ప్రాంతాలకన్నా పట్టణ ప్రాంతాల్లో స్త్రీ, పురుషుల్లో నిరుద్యోగ శాతం గణనీయంగా పెరిగింది. పురుషుల్లో 18.7 శాతం, మహిళల్లో ఏకంగా 27.2 శాతంగా ఉంది. గతేడాది రైల్వేలో 63 వేల దిగువ, మధ్యస్థాయి ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా, ఏకంగా 1.90 కోట్ల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో పీహెచ్‌డీలు చేసిన నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సర్వే వివరాలను బహిర్గతం చేసేందుకు అనుమతించలేదు. అనధికారికంగా నివేదికలోని అంశాలు వెలుగు చూశాయి. మోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో నిరుద్యోగుల ఊసు లేకపోవడం శోచనీయం.

డీఎస్సీ-2018 పోస్టుల విద్యార్హతలో సవరణలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ డీఎస్సీ-2018 ప్రకటనలో వివిధ పోస్టుల విద్యార్హతలపై ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌దాస్ శుక్రవారం జీవో నంబరు-15, 16 విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ), లాంగ్వేజీ పండిట్లు(ఎల్‌పీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ), మ్యూజిక్ టీచర్స్, క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ డ్రాయింగ్ టీచర్స్ పోస్టుల విద్యార్హతలలో పలు నిబంధనలు రూపొందించారు. స్కూల్ అసిస్టెంట్ మేథమేటిక్స్ పోస్టులకు డిగ్రీ-మ్యాథ్స్(అప్లైడ్‌మ్యాథ్స్/స్టాటిటిక్స్‌లో ఏదొక సబ్జెక్టు చదివి, బీఈడీ-మ్యాథ్స్ మెథడాలజీ చదవాలి. బీసీఏ చదివిన అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జూవాలజీ తప్పనిసరిగా చదవాలి. దాంతోపాటు బీఈడీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బోటనీ, జువాలజీ, నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులలో ఏదొకటి మెథడాలజీ ఒక అంశంగా చదవాలనే నిబంధన విధించారు. సోషల్‌స్టడీస్-స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీలో హిస్టరీ, ఎకనామిక్స్, జాగ్రఫీ, పొలిటికల్ సైన్సెస్, సోషియాలజీ తదితర అంశాల్లో ఏవైనా రెండు సబ్జెక్టులు చదివి ఉండాలి. పూర్తి వివరాలను జీవో నంబరు-15, 16లో పొందుపరిచారు. పరీక్షలు పూర్తయ్యాక ఈ సవరణలు చేయడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎస్ రద్దు అంశం ప్రస్తావించని కేంద్రం : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్టులో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు అంశాన్ని ప్రవేశపెట్టకపోవడం అన్యాయమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం వారిద్దరూ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగానికి రూ.32,800 నిధులు కేటాయించడం అన్యాయమని పేర్కొన్నారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయపన్ను పరిమితిని రూ.2.5 లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచడం కొంత ఊరటనిచ్చిందని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల వివరాల సేకరణ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్న ఇబ్రహీంపట్నంలోని సీఎఫ్ఎంఎస్ కార్యాలయాన్ని ఫిబ్రవరి 6న ముట్టడిస్తామని హెచ్చరించారు. వేతనాల బిల్లుల సమర్పణకు ఆన్‌లైన్లో అవకాశం కల్పించకుండా ఇబ్బందులు పెట్టడం దారుణమని దుయ్యబట్టారు.

ఎస్సీ,ఎస్టీలపై పెరిగిన దాడులు


వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం చంద్రబాబు పాలనలో దళితులు తీవ్ర అన్యాయం నెలకొందని,ఎస్సీ,ఎస్టీలపై దాడులు పెరిగిపోయాయని వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగు నాగార్జున విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం కృష్ణా,గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాంతీయ సమావేశాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ పిల్లలు చదివే ప్రాంతాల్లో స్కూళ్లు, హాస్టళ్లను మూసివేయించారని, సబ్-ప్లాన్ నిధులను దారిమళ్లించారని మండిపడ్డారు. దళితుల సంక్షేమానికి వైసీపీ కట్టుబడి ఉందని, వారి కోసం పార్టీ అధినేత జగన్ పలు సంక్షేమ పథకాల్ని ప్రకటించారని తెలిపారు.

మాజీల మృతికి సంతాపం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: శాసనసభ పదమూడో సమావేశాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం సభాపతి కోడెల శివప్రసాదరావు సంతాప ప్రతిపాదనలు చేశారు. ఇటీవల కాలంలో మరణించిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సభలో తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సభాసమక్షంలో తెలిపారు. ఈ సందర్భంగా రెండు నిముషాలపాటు మౌనం పాటించారు. అనంతరం ఏపీ అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ ప్రతిని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి బదులుగా మంత్రి కె.అచ్చెన్నాయుడు సభా సమక్షంలో ఉంచారు. అలాగే దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సవరణ బిల్లు-2019ను మంత్రి కొల్లు రవీంద్ర బదులు మంత్రి అచ్చెనాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిజియోథెరపి మండలి బిల్లు -2019ను ప్రవేశపెట్టేందుకు అనుమతి కోసం మైనార్టీ, వైద్యవిద్యాశాఖమంత్రి ఎన్ఎండి ఫరూఖ్ ప్రతిపాదించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. శుక్రవారం జరగాల్సిన ప్రాక్టికల్స్‌ను బంద్ కారణంగా ఇంటర్ బోర్డు వాయిదా వేసింది. ఆ ప్రాక్టికల్‌ను ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని ఇంటర్ బోర్డు కమిషనర్ బీ ఉదయలక్ష్మి తెలిపారు. శనివారం నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు 931 కేంద్రాలలో ప్రాక్టికల్స్ జరుగుతాయని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్‌ను పురస్కరించుకుని ఏర్పాట్లపై అన్ని జిల్లాల ఆర్ఐఓలు, ఆర్‌జేడీ, డీవైఈఓలతో ఆమె శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జనరల్ కేటగిరిలో 3,33,817 మంది, ఒకేషనల్ కోర్సులలో 60,486 మంది ప్రాక్టికల్స్‌ను హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం ఉండకూడదనే సీసీ కెమెరాల నిఘా పెట్టినట్లు తెలిపారు. అన్ని కాలేజీ యాజమాన్యాలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎగ్జామినర్లు కూడా సెల్‌ఫోన్లు వినియోగించకూడదని ఆమె స్పష్టం చేశారు. ఎక్కడైనా విద్యార్థుల బ్యాచ్‌లు మార్చాల్సిన పరిస్థితి ఎదురైతే తప్పనిసరిగా ఇంటర్మీడియట్ విద్యామండలి అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ విధానంలో నిర్వహిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

జనసేన మహిళా కమిటీల నియామకం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన రాష్ట్ర మహిళా, అనుబంధిత కమిటీల తొలిజాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ శుక్రవారం వెల్లడించారు. 22 కమిటీలలో విద్యార్థుల, యువజనులు, వైద్యులు, లెక్చరర్లు, న్యాయవాదులు, ఐటీ తదితర రంగాలకు ప్రాధాన్యత కల్పించారు. వీర మహిళ చైర్మన్‌గా జవ్వాది రేఖ(కర్నూలు), వైస్ చైర్మన్లుగా కనుమూరి కవిత, సింధూరి, షేక్ జరీనా, ప్రియా సౌజన్యను నియమించారు. పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పొండా సుజాతకు, పాలసీ వింగ్ చైర్మన్‌గా డాక్టర్ యామిని జ్యోత్స్నకి చోటు లభించింది. పార్లమెంటరీ ఎగ్జిక్యూటివ్ కమిటీల్లో జిల్లాల వారీగా మహిళలకు ప్రాధాన్యత కల్పించారు. పార్లమెంటరీ వర్కింగ్ కమిటీ సభ్యులుగా షాహిన్ సయ్యద్, షేక్ రజియా, మంజుల సునీత, సావిత్రి, వాశిలి తుషార బిందులను నియమించారు. క్యాంపైనింగ్ అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్‌గా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పెద్దిశెట్టి ఉషశ్రీకి బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఐడియాలజీ విభాగంలో వల్లూరి సుదేష్ణ, రమ్య కవిత, పోతురాజు, జువ్వాది విష్ణు ప్రియాంక, వెంకట సుజనప్రియ, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా నరసాపురం మండలం సరిపల్లెకు చెందిన రజితను నియమించారు. ఎలక్షనీరింగ్ విభాగం వైస్ చైర్మన్‌గా లోకం వర్షిణి, పబ్లిక్ హెల్త్ విభాగం చైర్మన్‌గా అమలాపురానికి చెందిన కొప్పుల నాగ మానసకు స్థానం కల్పించారు. కిసాన్‌వింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా లక్ష్మీకుమారి, పార్టీ క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్‌గా పద్మావతిలకు చోటు కల్పించారు. ప్రోటోకాల్స్ కమిటీ కో-ఆర్డినేటర్లుగా తాడికొండ లిఖిత, గన్నవరపు శివరాణి, కె.శివపార్వతి, ముఖమాతం శ్రీదేవి, ఏలూరు పార్లమెంటరీ స్పోక్స్‌పర్సన్‌గా వాణిశ్రీ, పబ్లిక్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్‌గా నందిగం రాణి, సెంట్రల్ కమిటీ ఫర్ పార్టీ అఫైర్స్ సభ్యురాలిగా చెరుకుపల్లి శ్రావణిలను నియమించారు. పార్టీ నిర్వహణ బాధ్యతల్లో పలువురు యువతులకు స్థానం కల్పించారు. ప్రభుత్వ కార్యక్రమాలు-పథకాల పర్యవేక్షణ తదితర కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యత లభించింది.

ఎన్నికల తాయిలాలు

మధ్యంతర బడ్జెట్‌పై సురవరం


మాట్లాడుతున్న సురవరం. ప్రక్కన చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ కేవలం ఓట్ల కోసమేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను మంత్రి చదివి వినిపించారన్నారు. ఐదేళ్లుగా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికలే లక్ష్యంగా హామీల వర్షం కురిపించిందని సురవరం అన్నారు. తాయిలాలతో కేంద్రం ప్రజలను మోసం చేయాలని చూస్తుందని, ఈ బడ్జెట్ ఏ వర్గానికీ మేలు చేసేలా లేదన్నారు. అదేవిధంగా పార్లమెంటులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగం సైతం వాస్తవాలకు దగ్గరగా లేదని, మోడీ సర్కార్ పూర్తిగా అవాస్తవాలు చెప్పించిందని సురవరం సుధాకరరెడ్డి ఆరోపించారు. ధరలు, నిరుద్యోగం పెరుగుదలను ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. ఐదు దశాబ్దాల కాలంలో ఎప్పుడూలేని విధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. ఇందుకు నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట రెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డితో కలిసి శుక్రవారం పార్టీ కార్యాలయం మఖ్దూంభవన్‌లో సురవరం విలేకరులతో మాట్లాడారు. 6 శాతానికి పైగా నిరుద్యోగం పెరిగిందని, అర్బన్ నిరుద్యోగమే 7.8 శాతానికి చేరిందని పేర్కొన్నారు. నిరుద్యోగం పెరిగినప్పటికీ రాష్ట్రపతి ప్రసంగంలో తగ్గిందని పేర్కొనడాన్ని ఆయన తప్పుబట్టారు. పెరిగిన ధరల విషయాన్ని ప్రస్తావించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అంకెలగారడీతో మాయాజాలం చేసిందని, తగ్గిన వృద్ధిని పెరిగినట్లుగా లెక్కలు చెప్పారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక తిరోగమన విధానాల వల్లనే నిరుద్యోగం పెరిగిందని చెప్పారు. కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలకు కేంద్ర ప్రభుత్వం దాసోహమైందని ఆరోపించారు. ఐదెకరాలు ఉన్న రైతులకు ఆర్థిక సహాయం రూ.6 వేలు చేస్తామని చెప్పారని, కనీసం రూ.12 వేలు చెల్లించాలని డిమాండు చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కేబినెట్ లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఒంటెత్తు పోకడలకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగి 50 రోజులు గడిచినా కేబినెట్ ఏర్పాటు చేయకపోవడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమేనన్నారు. రాష్ట్రంలో అధికారం కేంద్రీకృతమైందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో డబ్బు, మద్యాన్ని విచ్చలవిడిగా పంపిణీ చేయడంతో పాటు అధికార దుర్వినియోగానికి టీఆర్ఎస్ పాల్పడిందని ఆరోపించారు. ప్రతిపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించారని, వేలం పాటలు వేశారని, డబ్బున్నవారే సర్పంచ్ అయితే సామాన్యుల పరిస్థితి ఏమిటని చాడ నిలదీశారు. సర్పంచ్‌లకు 29 అంశాలను బదలాయించి విధులు, నిధులు ఇచ్చి పంచాయతీలను ఆర్థికంగా పరిపుష్టి చేయాలని డిమాండు చేశారు.

కేంద్ర నిధులు దోచుకున్న టీడీపీ

కన్నా లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-పలాస : ఆంధ్ర రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, కోట్లాది రూపాయల నిధులు వెచ్చించిందని, వాటిని ప్రజలకు చేరనీయకుండా రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు దోచుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అందించిన సహకారం, నిధులు మంజూరు వంటివి ప్రజలకు వివరించాలనే సంకల్పంతో ఈ నెల 4న పలాసలో బస్సు యాత్రను ప్రారంభిస్తామని, అంతకు ముందు భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. 10, 16 తేదీలలో గుంటూరు. విశాఖల్లో ప్రధాని నరేంద్రమోడీ పర్యటించనున్న నేపథ్యంలో బస్సు యాత్రకు విరామం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 18, 21 తేదీల్లో ఒంగోలు, రాజమండ్రిలలో బహిరంగ సభలలో అమిత్ షా పాల్గొంటారన్నారు. ఈ పర్యటనల అనంతరం విశాఖ నుంచి మరల బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ చూస్తే దేశాభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తోందో అర్థమవుతుందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాల్, కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ కణితి విశ్వనాధం, రాష్ట్ర కార్యదర్శులు పి.సన్యాసి రాజు, నాగభూషణ్, పండి యోగేశ్వరావు, పూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 4వ తేదీన పలాసలో అమిత్ షా నిర్వహించనున్న బహిరంగ సభాస్థలిని వీరు పరిశీలించారు.

టీడీపీ వర్సెస్ బీజేపీ

- పునర్విభజనపై వాడీవేడి చర్చ
- ఒకరిపైకి మరొకరు దూసుకెళ్లిన వైనం
- తీర్మానం కాపీలు చించేసిన ఎమ్మెల్సీ మాధవ్

విశాలాంధ్ర - అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంపై శాసనమండలిలో వాడివేడిగా చర్చ జరిగింది. అధికార టీడీపీ, ప్రతిపక్ష బీజేపీ సభ్యుల మధ్య మాటలయుద్ధం సాగింది. తీవ్ర పరుష పదజాలంతో పరస్పరం నిందించుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు మూడవ రోజున శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 అమలు అనే అంశంపై స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. ప్రత్యేక హోదా సాధన సమితి బంద్‌కు మద్దతుగా టీడీపీ ఎమ్మెల్సీలు నల్లరంగు దుస్తులు ధరించి మండలికి హాజరయ్యారు. ముందుగా గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలియచేస్తూ ఎమ్మెల్సీ శ్రీనివాసులు ప్రసంగించారు. ఇటీవల మావోయిస్టుల కాల్పుల్లో మృతి చెందిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 అమలుపై చర్చ ప్రారంభించారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును టీడీపీ సభ్యులు ఎండగట్టారు. విభజన హామీలు అమలు చేయడంలో నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దీనికి బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ ఘాటుగా స్పందించారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీ అడగటంతో హోదా పక్కకు పోయిందన్నారు. దీంతో టీడీపీ ఎమ్మెల్సీలు ఆందోళనకి దిగారు. మాధవ్ మాటలు రికార్డుల నుంచి తొలగించాలని డిమాండు చేశారు. మోడీ చెప్పడంతోనే చంద్రబాబు ప్యాకేజీకి అంగీకరించారని అన్నారు. ఇదంతా రాష్ట్రాభివృద్ధికే చంద్రబాబు చేశారని చెప్పారు. తమపై తప్పు రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోడియం వద్దకు వచ్చారు. బీజేపీ ఎమ్మెల్సీలు మాధవ్, సోము వీర్రాజు సైతం పోడియం వద్దకు రావటంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పరుష పదజాలంతో దూషించుకున్నారు. ఘర్షణ తీవ్రతరం కావడంతో కొంతమంది టీడీపీ సభ్యులు, పీడీఎఫ్ సభ్యులు ఇరుపక్షాలకు సర్దిచెప్పారు. గందరగోళం మధ్యనే సభ సాగింది. సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా రాష్ట్రంలో ఇంత అభివృద్ధి జరుగుతుందా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి 671 అవార్డులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం కింద ఏ రాష్ట్రానికి ఇవ్వని విధంగా రూ.28 వేల కోట్ల నిధులు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. డొక్కా మాణిక్య వరప్రసాద్, సత్యనారాయణ రాజు, బీద రవిచంద్ర, దొరబాబు, వయ్యావుల కేశవ్ తదితర ఎమ్మెల్సీలు మాట్లాడుతుండగా వారి భాషపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. మంత్రి యనమల ప్రసంగంపై బీజేపీ సభ్యులు అసహనం వ్యక్తంచేశారు. సభా నాయకుడికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. యనమల మాట్లాడుతూ కేంద్రంపై ధ్వజమెత్తారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని తెలిపేందుకు ఈ రోజు సభ్యులు రోడ్లు పైకి వచ్చి నిరసనలు తెలియచేస్తున్నారని అన్నారు. 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కొనసాగిస్తూ మన రాష్ట్రానికి మొండిచెయ్యి చూపుతున్నారని ఆరోపించారు. యనమల ప్రసంగించే సమయంలో సోము వీర్రాజు పలుమార్లు అభ్యంతరం చెప్పటంతో బీపీ టాబ్లెట్ వేసుకొని శాంతంగా ఉండాలంటూ యనమల సూచించారు. డిప్యూటీ చైర్మన్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసి సభ నుంచి సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అనంతరం పునర్విభజన చట్టం అమలుపై తీర్మానం ప్రవేశపెడుతుండగా బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. యనమల తీర్మానానికి సబ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. విభజన హామీలు అమలు చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేంద్రాన్ని డిమాండు చేశారు. విభజన హామీలు అమలు పర్చాలి అని రాసి ఉన్న దుస్తులు ధరించి మద్దతు తెలిపారు.

గ్రూపు -1 ప్రిలిమ్స్ వాయిదా

- మార్చి 30న పరీక్ష నిర్వహణ
- ఏఈఈ, ఫారెస్ట్, ఎండోమెంట్ పరీక్షా తేదీల్లోనూ మార్పులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఏపీపీఎస్సీ గ్రూపు-1 ప్రిలిమ్స్ (స్క్రీనింగ్ టెస్ట్) వాయిదా పడింది. మార్చి 10న నిర్వహించాల్సిన ప్రిలిమ్స్ మార్చి 30కి వాయిదా పడింది. యూపీ ఎస్సీ తరహాలో గ్రూపు -1 ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షల సిలబస్‌ను కొత్తగా ప్రవేశపెట్టడంపై అభ్యర్థుల నుంచి నిరసనల వ్యక్తమవుతున్నాయి. పరీక్షలను రద్దుచేసి పాత సిలబస్‌తోనే నిర్వహించాలనే డిమాండు ఉంది. అతి తక్కువ వ్యవధిలో భారీ సిలబస్‌ను చదవలేమని అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీ పరీక్షలను 20 రోజులపాటు వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అలాగే మరికొన్ని పరీక్షల తేదీల్లోనూ మార్పులు చేసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (ఏఈఈ) మెయిన్ పరీక్షలను ఏప్రిల్ 1,2కు బదులు 29, 30 తేదీలలో, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఫిబ్రవరి 24 నుంచి మార్చి 10వ తేదీకి వాయిదా వేసింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల మెయిన్ పరీక్షలను ఏప్రిల్ 28, 29, 30 తేదీలలో జరగాల్సి ఉండగా, మే 14, 15, 16 తేదీలకు వాయిదా వేశారు. మార్చి 3,4 తేదీల్లో జరగబోయే అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్ పరీక్షలను ఏప్రిల్ 9, 10వ తేదీలకు కమిషన్ వాయిదా వేసింది. గ్రూపు -1 ప్రిలిమ్స్‌ను 20 రోజులే వాయిదా వేయటంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్క్రీనింగ్ పరీక్షలో మైనస్ మార్కులను ప్రవేశపెట్టడాన్ని అభ్యర్థులు నిరసిస్తున్నారు. కొత్త సిలబస్ ప్రకారం పరీక్షను ఆరు నెలలపాటు వాయిదా వేయాలంటున్నారు. ఎన్నికల సమయంలో ఏపీపీఎస్సీ పరీక్షలన్నీ వాయిదా వేయాలని డిమాండు చేస్తున్నారు.

హార్టికల్చర్ ఆఫీసర్ల పోస్టుల నోటిఫికేషన్ రద్దు

ఏపీ హార్టికల్చర్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ వెల్లడించిన (తేదీ-13-12-2018) నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నంబరు 3ను విడుదల చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు హార్టికల్చర్ పోస్టుల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నామని, దరఖాస్తు చేసిన అభ్యర్థులకు పరీక్ష ఫీజును తిరిగి చెల్లిస్తామని పేర్కొంది.

సంపాదకీయం

ఇది అకౌంట్ ఫర్ ఓట్స్ !

తమది ఆమ్‌ఆద్మీ ప్రభుత్వమనీ, ప్రధానిగా తనకు స్పష్టమైన 'విజన్' ఉందని తొలినాళ్లలో సెలవిచ్చిన నరేంద్రమోడీ జమానా తాలూకు చిట్టచివరి బడ్జెట్ సమర్పణ ఘట్టంలో ఎన్నికల తాలింపు పెట్టిన గొప్పలు, గప్పాలు మోతెక్కిపోయాయి. ఈ బడ్జెట్.. తెలుగు రాష్ట్రాలను తీవ్ర నిరాశ పర్చింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు, నిరసనలను కూడా పట్టించుకోకుండా కేంద్రం తనదైన ప్రతీకార ధోరణినే ప్రదర్శించింది. ఓటర్లపై వరాల జల్లు కురిపించినట్లు పైకి కనిపిస్తున్నా.. మొత్తంగా చూస్తే పీయూష్ గోయల్ కనికట్టు విద్యను ప్రదర్శించారు. ఇది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌గా కాకుండా అకౌంట్ ఫర్ ఓట్స్‌గా తీర్చిదిద్దారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పరిమితిని అతిక్రమించిన పీయూష్ గోయల్ ఎన్నికల ప్రసంగం చేశారు. ఉద్యోగులు, రైతులు, మధ్యతరగతి వర్గాలు, కార్మికులను ఆకర్షించేందుకు ఆయన పెద్ద విన్యాసమే చేశారు. దేశాభివృద్ధికీ, ఆర్థిక ప్రగతికి వెన్నెముకలాంటి విద్య, ఉపాధి రంగాల ఊసే ఈ బడ్జెట్‌లో లేదంటే వారి విజన్ ఏమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రజల్లో ఒకసారి ప్రభుత్వంపై ప్రతికూల భావన మొదలైన తర్వాత ఎన్ని గిమ్మిక్కులు చేసినా, ఎన్ని రాయితీలు ప్రకటించినా పెద్దగా ఫలితం ఉండదనే గత అనుభవాలను మోడీ సర్కారు విస్మరించినట్లు ఉంది. ప్రజల్ని మభ్యపెట్టడంలో, మాయచేయడంలో ఈ సర్కారు ఘనాపాటి అని ఈ బడ్జెట్‌తో మారోసారి నిరూపించింది. ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని ఏకంగా రెట్టింపు చేస్తూ వేతన జీవులకు పెద్ద ఊరట కల్పిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. గృహరుణాలు, ఇంటి అద్దెలు, ఇన్సూరెన్స్‌లు కలిపి 6.50లక్షల ఆదాయం వరకూ పన్ను ఉండబోదనీ, మూడు కోట్ల మంది ఉద్యోగులు లబ్ధి పొందుతారని పేర్కొంది. అయితే ఈ ఆదాయపన్ను పరిధి పెంపు ఓ పెద్ద రాజకీయ గిమ్మికే. దీని వెనుక మోడీ వ్యూహాత్మక ఎత్తుగడ ఉంది. ఈ పెంపుదల అమలు భారం రాబోయే కొత్త ప్రభుత్వంపై పడుతుంది. ఐదు లక్షల ఆదాయం దాటిన వారు పన్ను పరిధిలోకి వస్తే, తాజాగా కేంద్రం తీసుకొచ్చిన ఈబీసీ చట్టం పరిధిలోని వారికి రూ.8 లక్షలు పరిమితి ఎలా విధిస్తారు, వారు ఎలా పేదలవుతారు. ఇదంతా కేవలం జుమ్లా అని స్పష్టమవుతోంది. రెండో ఇంటికి వచ్చే అద్దెకు పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది? దేశంలో కోట్ల మందికి నివాసమే లేదు. ఒక్క ఇల్లు ఉన్నవారూ తక్కువ మందే ఉన్నారు. రెండిళ్లు ఉండటమంటే ఆ యజమాని ఎగువ మధ్యతరగతికి చెందుతారు. కాబట్టి ఈ లబ్ధి పైవర్గాల వారికే తప్ప సామాన్యులకూ, మధ్యతరగతికి అందేది కాదు. అంగన్‌వాడీ టీచర్ల జీతం రెట్టింపు చేయడం, ఈఎస్ఐ పరిధి 15వేల నుంచి 21 వేలకు పెంపు తదితర ప్రతిపాదనలు మధ్యతరగతికి మేలు చేస్తాయి. 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరిట కొత్త పథకాన్ని ప్రతిపాదించడం ద్వారా రైతులకు ఏదో మేలు చేయబోతున్నట్లు అంకెల గారడీ చేశారు. దీని కోసం 75వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు ఏటా ఆరువేల రూపాయలు మూడు విడతలుగా ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం లక్ష్యం. ఒడిశా సర్కారు ఇప్పటికే కలియా(కృషక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఇన్‌కమ్ ఆగ్మెంటేషన్) స్కీంను అమలు చేస్తూ ఒక రైతు కుటుంబానికి వార్షికంగా పదివేలు జమ చేస్తున్నది. 2022నాటికి దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ హామీని గాలికి వదిలేసి ఈ తరహా గిమ్మిక్కులు ప్రదర్శించడమంటే రైతులపై, వ్యవసాయంపై ఈ సర్కారుకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తేటతెల్లం చేస్తున్నది. ఈ కొత్త ప్రతిపాదన ప్రకారం నెలకు రూ.500 సాయం రైతుకు అందుతుంది. అంటే ఆ కుటుంబానికి రోజుకు రూ.17 సాయమన్నమాట. అయితే కౌలు రైతుల మాటేమిటి? ప్రస్తుతం దేశంలో వ్యవసాయం వృద్ధిరేటు జీడీపీలో 2.5శాతం ఉంది. అది పన్నెండు శాతానికి పెరిగితే తప్పించి రైతుల ఆదాయం రెట్టింపు కాదని వ్యవసాయ నిపుణుల అంచనా వేశారు. ఈ విధానాల ద్వారా మరో మూడేళ్ల కాలంలో ఈ వృద్ధి 12శాతానికి చేరుకోవడం సాధ్యమా? నిజంగా, రైతుల సంక్షేమం, సాగువృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వామపక్షాలు, రైతు సంఘాలు కోరుతున్నట్లు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి. మోడీ హయాంలో వివిధ రకాల పంటల కనీస మద్దతు ధరలు కుప్పకూలిపోయాయి. గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డెక్కారు. ఎన్నడూ లేని విధంగా రైతులు సమ్మె చేశారంటే వారు ఎదుర్కొంటున్న భయానక పరిస్థితులేమిటో స్పష్టమవుతున్నాయి. 2018లో దేశవ్యాప్తంగా రైతులు పలుసార్లు ఆందోళనలు చేసిన నేపథ్యంలో వారి ఓట్లకు గాలం వేసేందుకే ఈ తాయిలం విదిల్చారు. కిసాన్ క్రెడిట్ కార్డుల కింద రుణాలు అందిస్తామనీ, రుణాలు సకాలంలో చెల్లించినవారికి రాయితీలు ఇస్తామనీ, ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు రుణాలు రీషెడ్యూలు చేస్తామని కూడా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 'ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్' పేరిట అసంఘటిత కార్మికులకు పింఛన్ పథకాన్ని ప్రకటించింది. దీని ద్వారా 10కోట్ల మంది కార్మికులు లబ్ధి పొందుతారని ప్రకటించింది. దీనికి ఒక్కొక్క కార్మికుడు నెలకు రూ.వంద ప్రీమియం చెల్లించాలి.

నేడు దేశం ఎదుర్కొంటున్న అత్యంత కీలక సమస్య నిరుద్యోగం. 2017-18లో నిరుద్యోగిత రేటు 6.1శాతానికి చేరిందనీ, ఇది 45ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరుకుందని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నివేదిక వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ సమస్య 2019లో ఎనిమిది శాతానికి కూడా తాకవచ్చని సర్వే అంచనా వేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే మోడీ సర్కారు ఆ సర్వే వివరాలను ప్రచురించడానికీ, ప్రకటించడానికి కూడా అనుమతించలేదు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రప్రథమ ప్రాధాన్యత అంటూ 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ హామీ ఇచ్చినా, దాన్ని అమలు చేయడంలో సర్కారు పూర్తిగా విఫలమైన ఫలితంగానే నిరుద్యోగిత బాంబు పేలడానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ అంశానికి బడ్జెట్‌లో పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వకపోడం మోడీ సర్కారు వైఖరి ఏమిటో తేటతెల్లమవుతోంది. 2019 ఎన్నికల్లో 13 కోట్ల మంది మొదటిసారి ఓటు వేయబోతున్నారు. ఈ ఓటు బ్యాంకు బీజేపీకి ఆటంబాంబుగా మారుతుంద నడంలో సందేహంలేదు. 2014లో మొదటిసారి ఓటు హక్కు వినియోగించు కున్న వారిలో అత్యధిక శాతం బీజేపీకే మొగ్గుచూపారు. ఈసారి వారే బీజేపీకి తిలోదకాలు పలికేందుకు సమరభేరి మోగిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. విభజన హామీ చట్టంలోని హామీలు, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరానికి అదనపు నిధులు, అదే విధంగా తెలంగాణకు ఉక్కు పరిశ్రమ, రైల్వే ఫ్యాక్టరీ, ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు తదితరాల ప్రస్తావనే ఈ బడ్జెట్‌లో లేదు. ఇది ఏపీకి మరోమారు తీవ్ర అన్యాయం చేయడమే తప్ప వేరేమీ కాదు.

యూపీఏ సగటు వృద్ధిరేటు సూచీల కన్నా తమ ఏలుబడిలో మెరుగ్గా ఉన్నాయని విత్తమంత్రి జాతిజనుల కళ్లకు టోకున గంతలు కట్టే దుస్సాహసం చేస్తున్నారు. తమ పాలనలో ఆర్థిక వ్యవస్థ స్థిరంగా దూసుకుపోతున్నట్లు పేర్కొన్నారు. 2013-14లో 13వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి ఇప్పుడు ఆరోస్థానానికి చేరినట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో ఐదు ట్రిలియన్ డాలర్లకు, 2030నాటికి పది ట్రిలియన్ డాలర్లకు ఆర్థిక వ్యవస్థ చేరుతుందనీ, ప్రపంచంలోనే మూడో అతిపెద్దదిగా నిలుస్తుందంటూ గాలిలో మేడలు కట్టారు. నీతి ఆయోగ్ చెప్పిన దాని ప్రకారం 9శాతం వృద్ధిరేటు ఉండాలి. కానీ ఇప్పుడు ఏడు శాతమే ఉంది. మోడీ పాలనలోనే పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో చిన్న, మధ్యతరగతి వ్యాపారులు తీవ్రంగా దెబ్బతిన్నారు. ధరలు విజృంభించాయి. గిరాకీలో కుంగుపాటు కనిపించింది. అదే సమయంలో పారిశ్రామిక వృద్ధికి తీసుకున్న ప్రత్యేక చర్యలు శూన్యం.దీంతో అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి మూలాన పెట్టుబడులు కుంగి పారిశ్రామిక వృద్ధి క్షీణించింది. వీటిని కప్పిపుచ్చి, ద్రవ్యలోటుకు సమర్థంగా పగ్గాలు వేయగలిగామని చాటుకోవడానికి పీయూష్ గోయల్ నానా తిప్పలూ పడ్డారు. ఆడంబరంగా ప్రకటించిన కేటాయింపుల్లో వ్యయీకరణను బిగపట్టి వద్దులు తెగ్గోసి ద్రవ్య పరిస్థితి అదుపాజ్ఞల్లోనే ఉన్నట్లు మభ్యపెట్టడంలో ఆయనెంతగా రాటుతేలిపోయారో అనామతు బడ్జెట్ వంటావార్పూ కళ్లకు కట్టింది. బీజేపీ ఎన్నికల ప్రణాళిక రచన ఇంపుసొంపులకు నిలువుటద్దం పడుతోంది.

ప్రాథమ్య రంగాలను పస్తులు పెట్టి, కీలక ఆర్థిక సూచీలను అధమస్థాయికి దిగజార్చిన స్వీయ నిర్వాకాలకు మసిపూసి మారేడు చేయడంలో అరుణ్‌జైట్లీని పీయూష్ మించిపోయారు. వలసలు ఆగలేదు, రైతుల ఆత్మహత్యలు తగ్గలేదు. ధరోల్బణం, ద్రవ్యోల్బణాల తాకిడికి జనం విలవిల్లాడుతున్నా ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. పెట్రోలు, డీజిలు ధరల్ని అనూహ్యంగా పెంచడంలో బీజేపీ పాలన సరికొత్త రికార్డులను నమోదు చేసింది. 'ఆమ్ ఆద్మీ' ప్రయోజనాలను అడుగడుగునా తుంగలో తొక్కిన బీజేపీ సర్కారు ప్రజానీకానికి లబ్ధి ముసుగులో దోపిడీ వ్యవస్థకు బాటలు పరచింది. ప్రభుత్వ పథకాలకు, ప్రణాళికలకు అవినీతి తూట్లు పొడిచింది. సామాజికరంగానికి జవజీవాలు కూరుస్తామన్న హామీలు కొల్లబోయాయి. కార్పొరేట్లకు దోచిపెట్టి, పేదల సంక్షేమాన్ని కుంగదీసి, అభివృద్ధిని ఎండమావి చేసిన మోడీ పాలన- ఆమ్ ఆద్మీకి భయంకరమైన పీడకల, జాతి పాలిట మహావంచన!

అవకాశవాద రాజకీయాలు దీర్ఘకాలం చెల్లవు

2019 లోక్‌సభ ఎన్నికలు చారిత్రకం కాబోతున్నాయి


పి.జనార్ధనరావు

రాజకీయాలు రోజురోజుకు కొత్తరూపు సంతరించు కొంటున్నాయి. పాలక భారతీయ జనతాపార్టీ మిత్రులను కోల్పోతున్నది. భారత జాతీయ కాంగ్రెస్ మూడు హిందీ రాష్ట్రాల్లో విజయం సాధించి మంచి ఊపు మీదున్నది. ఇప్పటి వరకు పాలకవర్గాలు ఆచరించిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలు భారత్ అరి కంగా వృద్ధి చెందటానికి తోడ్పడలేదు. వృద్ధి సాధించటానికి తోడ్పాటు తీసుకొన్న వ్యాపార వర్గాలు, గ్లోబల్ ద్రవ్య పెట్టుబడిదారులున్న వృద్ధి సాధించటానికి తోడ్పడ్డారు. కాని సాధించిన వృద్ధి జనాభాలో ఒక్క శాతం వద్దకు చేరింది. తమ కృషి ద్వారా తోడ్పడిన వ్యవసాయదారులు, యువత, కార్మికులు ఏ విధమైన ప్రయోజనం పొందలేదు. పేదరికం, మాల్‌న్యూట్రిషన్ అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. కారణం ద్రవ్య పెట్టుబడులు వుంచిన వారి ప్రధాన లక్ష్యం లాభార్జన. ఏదేశ ఆర్థిక వ్యవస్థపై గ్లోబల్ ఫైనాన్స్ కేపిటల్ ఆధిక్యత సాధిస్తుందో దాని ద్వారా జనాభాలో తక్కువ శాతం లాభం పొందుతారు. ఎవరివద్ద పెట్టుబడి, నైపుణ్యాలు ఉంటాయో వారు లాభిస్తారు. మిగిలిన జనాభా మాత్రం దుర్భర జీవితాలు కొనసాగిస్తారు. అసమానతలు పెరుగుతాయి. నిర్దాక్షిణ్యంగా మానవులను, భూమిని, ఇతర సహజ వనరులను దోచుకుంటారు. ప్రస్తుతం భారతదేశం అటువంటి పరిస్థితిలోనే వుంది.

ఫోర్బ్స్ సంస్థ 2018లో ప్రకటించిన సంపద వివరాలు : 119 మంది డాలరు బిలియనీర్లు వున్నారు. అదే సందర్భంలో ప్రపంచంలో 2043 మంది అత్యంత సంపన్నులు వున్నట్లు తెలిపింది. క్రెడిట్ సుసే ప్రకారం 2,45,000 మంది మిలయనీర్లు వున్నారు. గ్లోబల్ వెల్త్ నివేదికలో రెండువేల సంవత్సరం నుండి భారతదేశంలో సంపద 9.9 శాతానికి పెరిగింది. మొత్తం గృహస్తుల సంపద 5 ట్రిలియన్ డాలర్లు. ఒకవైపు సంపన్నులు పెరుగుతుంటే రెండవ వైపు 92 శాతం 10 వేల డాలర్ల కంటే తక్కువ కలిగి వున్నారు. ప్రభుత్వం మాత్రం భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతున్నదని సంబరపడుతున్నది. జీడీపీ పెరుగుదల 2017-18లో 6.7 శాతం, 2018-19లో 7.2 శాతంగానే వుంది. జీడీపీ పెరుగుదలకు అనుగుణంగా ఎంప్లాయ్‌మెంటు పెరగలేదు. జాబ్‌లెస్ గ్రోత్‌గా పేర్కొంటున్నారు. సీఎంఐఈ నివేదిక 2018లో 110 లక్షలు ఉపాధి పోగొట్టుకున్నట్లు తెలిపింది. నిరుద్యోగిత 2018 నవంబరులో 6.6 శాతం నుండి డిసెంబరు నాటికి 7.4 శాతానికి పెరిగింది. అర్థికంగా సంపద పెరగాలి అంటే గ్రోత్ పెరగాలి. పేదరికం వల్ల మాల్‌న్యూట్రిషన్ కొనసాగుతున్నది. ఆదాయం అందించే విధంగా ఉపాధికల్పన కొనసాగే వృద్ధి లక్ష్యంగా లేనందున పేదరికం, మాల్‌న్యూట్రిషన్ దేశంలో కొనసాగుతున్నది. జీడీపీ తక్కువస్థాయిలో కొనసాగటంవల్ల తక్కువ తలసరి ఆదాయం వినిమయం - ఆహార వినిమయం తగ్గుతుంది. పొదుపు, పెట్టుబడులు తగ్గుతాయి. అందువల్ల జీడీపీ పెరుగుదలకు పాలకవర్గం కృషి చేయాల్సి వుంది. ప్రస్తుతం ఉత్పాదక రంగాలైన వ్యవసాయ రంగం, మాన్యుఫ్యాక్చరింగ్‌లు స్తంభించి వుండటంవలన ఆ రెండు రంగాలు జీడీపీకి అందించే వాటా తక్కువగా వుంది. ఆ రెండు రంగాలు అత్యధికంగా ఉపాధులు అందజేసే రంగాల పెట్టుబడులు పెంచుట, విధానపరమైన నిర్ణయాలు తీసుకొని మాన్యుఫ్యాక్చర్‌ని, సేవల రంగాన్ని ప్రోత్సహించటం ద్వారా జీడీపీ పెరుగుదల, ఉపాధి అవకాశాలు పెరగటానికి సాధ్యమవుతుంది.

పెట్టుబడిదారీ అభివృద్ధి విధానంలో మరో దుర్లక్షణం. వృద్ధి జరుగుతుంది కాని ఉపాధులు పెరగవు. ప్రస్తుత భారతదేశంలో నిరుద్యోగ సమస్య ఎంతో తీవ్రంగా వుంది. రైల్వేల్లో 90 వేల ఉద్యోగాల భర్తీ చేయటానికి పూనుకొంటే 2.50 కోట్ల మంది దరఖాస్తులు దాఖలు చేశారు. ప్రత్యేకించి గ్రామీణ భారతం ఉపాధి అవకాశాల నష్టం ఎదుర్కొంటున్నది. మరో సమస్య వృద్ధి సాధించటానికి పెట్టుబడితోపాటు నైపుణ్యం గల వర్క్‌ఫోర్స్ అవసరం. దేశంలో నైపుణ్యం గల వర్క్‌ఫోర్స్ కొరత అధికంగా వుంది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమం చేపట్టి 30.67 లక్షలకు శిక్షణ అందజేసింది. కాని, అలా శిక్షణ పొందినవారిలో 2.9 లక్షల మంది మాత్రమే ఉద్యోగాలు పొందారు. అందులో పేదవర్గాల నుండి, గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారికి అవకాశాలు అందవు. వృద్ధి ఎలా సాధ్యం. ప్రభుత్వరంగం, ప్రైవేటు రంగం పెట్టుబడులు పెట్టినప్పుడు, ప్రైవేటు వినిమయం పెరిగినప్పుడు, ఎగుమతుల ద్వారా ఆదాయం పెరిగినప్పుడు సాధ్యం. ప్రస్తుత స్థితిలో ప్రైవేటు రంగం పెట్టుబడులు పెంచటానికి సిద్ధంగా లేదు. అప్పుల్లో వుండటం, ఉత్పత్తులకు డిమాండు లేకపోవుట, అనేక కారణాలవల్ల ఎగుమతులు మందగించటం, వడ్డీరేట్లు అధికంగా వుండటం కారణాలు. వేగవంతమైన, ఆధారపడదగిన ఆర్థిక వృద్ధి అంతర్గత పెట్టుబడులు, వినిమయం వల్ల మాత్రమే సాధ్యం. మోడీ ప్రభుత్వం ఈ రెండింటిని సాధ్యం చేయగల స్థితిలో లేదు. పెట్టుబడిదారీ దేశాల్లోలాగా ఉపాధి అవకాశాలు, వినిమయం పెంచటానికి ఖర్చు పెంపు చేయలేదు. భారతదేశంలాంటి అధిక జనాభా గల దేశం ఆర్థికంగా వృద్ధి సాధించటం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశాన్ని అభివృద్ధి చేయదలచింది. ముందస్తుగా రెండు సమస్యలు పరిష్కరించటానికి పూనుకొన్నారు. గ్రామాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటం, మానవ వనరులను అభివృద్ధి చేయటం. ఆహారంలో స్వయం సమృద్ధి సాధించుట. గ్రామాల్లో అధికంగా వున్న పేదరికం, మాల్‌న్యూట్రిషన్ నిరక్షరాస్యతను తొలగించుట. ఇరిగేషన్ వసతులు పెంచారు. విద్యుదుత్పత్తికి పూనుకొన్నారు. పారిశ్రామికంగా దేశాన్ని తీర్చిదిద్దారు. దేశం వెనుకబడి వుందని ఆలోచించకుండా శాస్త్ర సాంకేతిక రంగాలను విస్తృతపరచారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమ ఉజ్జీగా వుండటానికిగాను అటామిక్, అంతరిక్ష పరిశోధనకు నిధులందించారు. ఎంతో ముందుచూపుతో కృషి కొనసాగించారు. ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా వుండటానికి ప్రభుత్వరంగాన్ని ఏర్పరచటం జరిగింది. భూమి, నీరు వంటి సహజ వనరులు అధికంగా వున్నాయి. వేర్వేరు వాతావరణ స్థితిగతులవల్ల సంవత్సరం పొడవునా పంటలు పండించే అవకాశాలు లేవు. శ్రమించే మానవ వనరులున్నాయి. అత్యధికంగా సంపద సృష్టించింది గ్రామీణ భారతం. ఉపాధులు కల్పించింది కూడా అదే.

భారతదేశం నయా ఉదారవాద ఆచరణ చేపట్టింది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు భారత ప్రభుత్వ కార్యచరణను నియంత్రిస్తున్నాయి. మోడీ పాలన ప్రారంభించిన తరువాత వారి ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తున్నాడు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటు రంగానికి అప్పగించ విశ్వప్రయత్నం చేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని, మాన్యుఫ్యాక్చరింగ్‌ను స్తబ్ధతలో పడవేశారు. నూతనంగా ఉపాధి అవకాశాలు సృష్టించలేదు సరిగదా పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు ద్వారా కోట్లాది ఉపాధులను నష్టపోవటం జరిగింది. పెట్టుబడులు లేక అసంఖ్యాకమైన మైక్రో, స్మాల్, మధ్యతరహా వ్యవస్థలు మూతపడ్డాయి. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోనందున ఉపాధులు లేక మార్జినల్ రైతులు, వ్యవసాయ కూలీలు, వివిధ వృత్తులవారు నగరాలకు వలస బాట పట్టారు. అక్కడ వున్న పారిశ్రామిక వ్యవస్థలు గాని, సేవల రంగం గాని వారికి ఉపాధి కల్పించలేనందున అసంఘటిత రంగంలో చేరారు. వారు 450 మిలియన్లు దాటిపోయారు. భారత దేశంలో పేదరికం కొనసాగటానికి, అసంఘటిత రంగం పెరగటానికి దగ్గరి సంబంధాలు వున్నాయి. మోడీ హయాంలో ఉపాధులు సృష్టించింది తక్కువ ఉత్పాదక శక్తి గల నిర్మాణ రంగంలోనే గాని ఎక్కువ ఉత్పాదక శక్తి గల మాన్యుఫ్యాక్చర్ రంగంలో కాదు. గ్లోబల్ హంగర్ ఇండెక్సులో భారతదేశ స్థానం 118 దేశాల్లో 97. 15 శాతం అండర్ నరిష్డ్, 39 శాతం స్టంటెడ్, స్త్రీల ప్రసవ సమయం, మరణాల రేటు, పిల్లల మోర్టలిటీ రేటు అధికంగా వుంది. వీరు అత్యధికంగా ఎనిమియా బాధితులు.

ప్రజాస్వామిక సమాజంలో పౌరులందరూ ఆరోగ్యవంతమైన జీవితం గడపటానికి, ఉత్పాదిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనటానికి నైపుణ్యం గల విద్య నేర్చుకోటానికి అవకాశాలు కల్పించాలి. అందుకుగాను పోషణనిచ్చే ఆహారం, తాగుటకు శుభ్రమైన నీరు, పారిశుద్ధ్య సౌకర్యాల అందుబాటు, ఆరోగ్య రక్షణ సౌకర్యాలు ఏర్పాటు అవసరం. ఆహార భద్రత మానవుల భద్రతకే కాదు, జాతీయ సార్వభౌమత్వ భద్రతకు అవసరం. అందుకు దేశం ఆహార ధాన్యాలు, పల్సెస్, వంటనూనెల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి లేక వేరే ఆస్తులు లేక అవసరానికి చాలినంతగా ఆహారం కొనుగోలు చేయలేదు. వినిమయం తగ్గింది. మానవాభివృద్ధిలో భారత స్థానం 189 దేశాల్లో 131 గా వుంది. భారత ప్రధానమంత్రి మోడీ గొప్ప 'రిసోర్సుఫుల్ పర్సన్'. ఇన్‌స్టెంటుగా వాగ్దానాలు చేస్తారు. బహుజనుల సానుభూతి కోసం తాను కులవ్యవస్థలో అట్టడుగు కులం నుంచి వచ్చానని, వృత్తి వ్యవస్థలో టీ అమ్మినట్లు ప్రచారం చేసుకున్నాడు. 2014 ఎన్నికల ముందు వివిధ వర్గాలకు ఆయన చేసిన వాగ్దానాలు పరిశీలించిన అంతకంటే ఏ నాయకుడు ఆయనను అధిగమించలేదు. కాని ఆచరణలో జుమ్లా కొట్టడంతో ప్రజల సానుభూతిని కోల్పోయాడు. నెలనెలా మన్‌కీ బాత్ కార్యక్రమం చేపట్టి ప్రజలతో సంబంధాలు కొనసాగించ ప్రయత్నించాడు. కాని ఏ సందర్భంలోను తన కాషాయ దళాలు సాగించిన అకృత్యాలపై పల్లెత్తు మాట అనలేదు. మనువాద దొంతరలో అగ్రకుల బ్రాహ్మణులదే ఆధిక్యత కొనసాగించటానికి ఎంతగానో శ్రమిస్తుండటం చూస్తున్నాం. ఎన్నికల ప్రచారంలో ఆయనదొక ప్రత్యేకశైలి. ఎప్పటికి ఏది అవసరమో ఆది ప్రచారంలో పెడతాడు. బీహారు ఎన్నికలనాడు పెద్దమొత్తంలో తోడ్పాటు అందించగలనన్నాడు. బీజేపీ ఓడిపోయింది. తర్వాత ఆయన పరిధిలోకి వచ్చినా నేటికీ వాగ్దానం మిగిలిపోయింది. గుజరాత్ ఎన్నికలనాడు ఆత్మగౌరవం అంశం. పటేలుకు, మొరార్జీ కి కాంగ్రెస్ అన్యాయం చేసింది అన్నాడు. వారిద్దరు ఉన్నత పదవులు పొందారు. ఎక్కడా అవమానించబడలేదు. ఆయన అద్వానీని, మురళీమనోహర్ జోషిని, గుజరాత్‌లో కేశుభాయ్ పటేల్‌కు ఎటువంటి చోటిచ్చాడు. ప్రచారంలో అసత్యాలు, అర్ధసత్యాలు వెరపు లేకుండా చేస్తాడు. సంచలన ప్రకటనల్లో నిష్ణాతుడు. పర్యవసానాలతో నిమిత్తం లేదు. ఉదా. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు. జీడీపీ పతనం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. నగదు అందుబాటులేక చిరు వ్యాపార సంస్థలు లక్షలాదిగా మూతబడ్డాయి. కోట్లాది వలస కార్మికులు ఉపాధి కోల్పోయారు. మోడీకి ప్రజాక్షేమం కంటే తన పదవి కాపాడుకొనే ఆలోచనలే అధికం. మూడు హిందీ రాష్ట్రాల్లో ఓటమి ఆయనను తీవ్ర గందరగోళంలోకి నెట్టింది. ఆయన సాధించదలచిన కాంగ్రెస్ ముక్త భారతం ఎదురు తిరిగి ముక్త బీజేపీగా మారింది. దేశవ్యాప్త సమీకరణాలు ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ పార్టీలు బీజేపీ ఆధిక్యతను అంగరించే స్థితిలేదు. రెండవ అంశం పదవి కాపాడుకోటానికి వేస్తున్న ఎత్తుగడలు ముందుకు సాగటంలేదు. ప్రతిపక్షాలపైన, వారి కలయికలపైనా దుమ్మెత్తి పోస్తున్నాడు. ములాయంసింగ్‌పై విచారణ, లోహియా ఆలోచనలు, ఎన్టీఆర్ కాంగ్రెసు వ్యతిరేకత, చంద్రబాబు, కాంగ్రెస్ అనుకూలత అట్లాగే ఒకే కుటుంబం సోనియా, రాహుల్ ప్రస్తావన పదేపదే చేయటం జరుగుతున్నది. ప్రాంతీయ పార్టీలేవి బీజేపీకి అనుకూలంగా లేకపోవడంవల్ల మోడీ పాలకు తేళ్లు, జెర్రలు పాకుతున్నాయి. నరేంద్ర మోడీ గాని ఆరెస్సెస్ గాని జాతీయవాదులు కాదు. పక్కా హిందూ జాతీయవాదులు. మోడీ ప్రభుత్వం శతాబ్దాల తరబడి కొనసాగుతున్న విలువలను కాలరాసింది. మత ద్వేషం పెంచి ముస్లింలను, క్రైస్తవులను అవమానించింది. ఒక్క విషయం గమనించిన మోడీ అసలు స్వరూపం బయటపడుతుంది. ఆయన ఎప్పుడైనా మతసామరస్యత కోసం కృషి చేశాడా! గుజరాత్ మారణకాండవల్ల ముఖ్యమంత్రిగా ఉన్న మోడీని నాటి ప్రధాని వాజపేయి భర్తరఫ్ చేయదలిచాడు. అద్వానీ అడ్డు పడటంవల్ల నేటికి ఈ స్థితిలో వున్నాడు. అద్వానీకి ఆయన ఇచ్చిన గౌరవం ఏమిటి? కాలం చెల్లిన ఆలోచనలు అవకాశవాద రాజకీయాలు దీర్ఘకాలం చెల్లుబాటు కావు.

వ్యాస రచయిత : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, విజయవాడ

విశ్లేషణ

స్వాములు, బాబాల పీఠాలు కదులుతున్నాయి

నార్నె వెంకటసుబ్బయ్య

చింపిరి గుడ్డలతో, చెరిగిన జుట్టుతో బజారులో గమ్మత్తులు చేసే వాడిని గారడీవాడు అంటాము. నెత్తిన హ్యాట్ పెట్టుకుని, ఒంటికి కోటు వేసుకొని స్టేజీమీద ఇవే పనులు చేసేవాడిని మెజీషియన్ అంటాము. కాషాయబట్టలు ధరించి, మెడలో రుద్రాక్షలు వేసుకొని, గడ్డం పెంచుకొని లేక తీసివేసుకొని ఇవే పనులను చేసే వాడిని మాత్రం బాబాలు అంటాము. స్వతంత్రం రాకముందు ఇలాంటిబాబాలు ఎక్కడో ఒకడుండేవాడు. పబ్లిక్‌లోకి అంతగా వచ్చేవారు కాదు. నెహ్రూకాలంలో ఎవరూ లేరని చెప్పుకోవాలి. ఇందిరాగాంధీ కాలంలో ఆమె జైలుకి వెళ్ళివచ్చిన తర్వాత బాబాలను నమ్మటం మొదలు పెట్టింది. ధీరేంద్రబ్రహ్మచారి అని ఒక తుపాకులబాబా ఉండేవాడు. కాశ్మీర్‌లో ఈయనకు తుపాకుల కర్మాగారం ఉండేది. ఈయన ఇందిరాగాంధీకి నమ్మకస్తుడు. చివరకి ఈయన విమానప్రమాదంలో చనిపోయాడు. తరువాత రజనీష్ ఒక వెలుగువెలిగాడు. ఆయనపై ఎన్నో కేసులున్నాయి. అమెరికా పారిపోయాడు. అక్కడకూడా అమెరికా ప్రభుత్వం చాలా కేసులు పెట్టింది. చివరి దొంగతనంగా ఇండియా వచ్చి ఇక్కడే చనిపోయాడు. ఈ రకంగా దేశంలో బాబాలు ప్రజల అజ్ఞానాన్ని, అమాయ కత్వాన్ని ఆసరా చేసుకొని తామే దేవుళ్లమని కొందరు, అవతారపురుషులమని ఇంకొందరు, తమవద్ద మహిమలున్నాయని కొందరు ప్రచారం చేసుకొని మోసం చేయటం ప్రారంభించారు.

బాబాలకి కూడా అందరిలాగా జుట్టు నెరుస్తుంది. గోళ్లు పెరుగుతాయి. శరీరం ముడతలు పడుతుంది. రోగమొస్తే అందరిలాగా ఆస్పత్రికిపోతారు. కానీ కొంతమంది బాబాలకు చావు అందరిలాగా ఉండదు. ఉదాహరణకి పుట్టపర్తి బాబా ఈరోగంతో చనిపోయాడని డాక్టర్లు కూడా చెప్పలేదు. ఎంత భయంకర రోగమో! అలాగే పెనుగొండ కాళీప్రసాద్ బాబాకూడా ఏరోగంతో చనిపోయాడో ఆ డాక్టర్లు కూడా చెప్పలేదు .

వీరుపైకి ఎంత ప్రశాంతంగా కనిపిస్తారో వీరి మనసులు అంత మురికికంపు. వీరి వారికి తల్లిదండ్రులు పెట్టినపేరు ఒకటైతే తరువాత ప్రేమానందస్వామిగాను, నిత్యానంద స్వామిగాను, కామానందస్వామిగాను మార్చుకుంటారు.

"ఏదేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం" అన్నట్లుగా ఏ బాబా ఆశ్రమం చూచినా ఏమున్నది హత్యలు, అత్యాచారాలు, భూకుంభకోణాలు, మాదకద్రవ్యాల అమ్మకాలు, చెక్‌బౌన్స్ కేసులు, అన్నట్లుగా తయారైనాయి. బాబాల ఆశ్రమాలు ఆధ్యాత్మికం పేరుతో నేరసామ్రాజ్యాలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వం ఆశ్రమాల గుట్టురట్టు చెయ్య వలసిన అవసరం ఎంతైనావుంది. ఇలాంటి వారిలో ముఖ్యం గా మనరాష్ట్రంలో పుట్టపర్తి సాయిబాబా, చంద్రస్వామి, కల్కిభగవాన్, బాలసాయిబాబా, ప్రకాశం జిల్లాలో దొంగరామదూత, రాజమాత బండ్లమాంబ లాంటివారిని పేర్కొనవచ్చు. ఒక్కొక్కరిది ఒక్కోరకమైన చరిత్ర. అందరూ ప్రభుత్వ భూములు ఆక్రమించినవారే. అందరిపై రకరకాల కేసులున్నాయి. పుట్టపర్తి సాయి బాబా అసలు పేరు సత్య నారాయణ రాజు. చిన్నచిన్న మాజిక్స్ నేర్చుకుని అంతర్జాతీయ స్థాయిలో పేరుపొంది విదేశీయులను కూడా ఆకర్షించాడు. 1970 దశకంలో కొవూరు ప్రపంచ వ్యాప్తంగా దొంగబాబాలకు ఛాలెంజ్ చేశాడు. మీవద్ద మహిమలుంటే నాముందు ప్రదర్శించండి అని సవాలు విసిరాడు. ఎవరూ ముందుకి రాలేదు. చివరికి అప్పటి బెంగళూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.నరసింహయ్యతో కలసి కమిటీ ఏర్పడి అందరూ కలసి పుట్టపర్తి ఆశ్రమానికి వెళ్ళగా, లేదని చెప్పించి దొడ్డిదారిన బెంగళూరు పారిపోయాడు. ఆశ్రమంపై ఎన్ని కేసులున్నాయి. అనైతికమైన చేష్టలు చేశాడని బీబీసీలో ఆ రోజుల్లో చర్చకూడా జరిగింది. 1992లో ఆశ్రమంలో 6 హత్యలు జరగ్గా భయపడి గదిలో దూరి తలుపులు వేసుకున్నాడు. ఆయనకు మహిమలుంటే హంపట్ అని కాలువలు త్రవ్వించాలి, హంపట్ అని హాస్పిటల్ తయారుచేయాలి, అంతేకానీ అందరి మనుషుల్లాగా, మిషన్లతో, మాన్‌పవర్‌తో చేయించటమేమిటి? చివరికి ఏ రోగమో కూడా తెలియని స్థితిలో చనిపోయాడు. దేవుడుకి రోగం రావటమేమిటి? ఒకసారి బాత్రూమ్లోపడి కాలు విరిగింది. తనమహిమతో తగ్గించుకోలేదు. అందరిలాగా హాస్పిటల్‌కి వెళ్ళాడు.



ఇంకొక బాబా కల్కి భగవాన్. ఈయన అసలుపేరు విజయకుమార్. చిత్తూరు జిల్లాలో ఒకప్పుడు ఏజెంట్‌గా ఉండేవాడు. అది గిట్టుబాటుగాలేదని స్కూలు కొంతకాలం నడిపాడు. అదీ గిట్టుబాటు కాలేదని కల్కిఅవతారమెత్తి తాను కల్కిభగవానుగాను, భార్య పద్మావతి భగవతిగాను ప్రచారంగావించుకొని తమిళనాడులో ఒక బ్రాంచి, దగ్గర్లోని వరదయ్యపాలెంలో గోల్డెన్ టెంపుల్ కట్టించాడు. అందులో ప్రభుత్వ భూమికూడావుంది. ఆ కేసుకూడా అందరి బాబాల్లాగానే ఇప్పటికీ కోర్టులోవుంది. గోల్డెన్ టెంపుల్ ప్రారంభసమయంలో తొక్కిసలాట జరిగి ఐదుగురు చనిపోయారు. ఎవరుకూడా వారికి ఇప్పటికి నష్టపరిహారం ఇవ్వలేదు. ఆశ్రమంలోకి ప్రవేశించాలంటే ఐదువేలు, కల్కిని చూడాలంటే 25 వేలు, ఆయనతో మాట్లాడాలంటే, కాళ్ళకి మొక్కాలంటే లక్షరూపాయలు అక్కడిరేట్లు. 20,25 సంవత్సరాల వయసుగలిగిన యువతీ యువకులను ఆశ్రమంలో సేవలు చెయ్యటానికి దాసాజీలుగా చేర్చుకుంటారు. దాసాజీలు వివాహం చేసుకోకూడదు. వచ్చిన వారికి సేవలు మాత్రమే చెయ్యాలి. వయసులో సహజంగా వచ్చే కోర్కెలను చంపుకోలేక వారు మత్తుపదార్థాలను సేవించి చేసిన వికృత చేష్టలను ఆమధ్య టీవీల్లో చూసాము. వేలకోట్లకి, వేలాది ఎకరాల భూమికి అధిపతి అయ్యాడు.

ఇంకొకబాబా బాలసాయిబాబా. అరవై ఏళ్లు దాటినా ఇంకా బాలసాయిబాబానే. అసలుపేరు శేషశాయిశర్మ. చిన్నప్పుడు సినిమాహాల్స్‌లో బ్లాక్ టికెట్స్ అమ్ముకునేవాడు. నోట్లోంచి లింగాలు తియ్యటం నేర్చుకుని, చిన్నచిన్న మ్యాజిక్స్‌తో బాబాగా కర్నూలు, తుంగభద్ర ఒడ్డున ప్రభుత్వభూములాక్రమించి ఆశ్రమమేర్పరచాడు. తన శిష్యుడు శివప్రసాద్ దగ్గర డబ్బులుతీసుకొని, చెక్కులిచ్చి అవి బౌన్సు కాగా జైలుకి వెళ్లాడు. ప్రభుత్వ భూములాక్రమనకేసులో కుడా అరెస్టు కాబడ్డాడు. ప్రతి సంక్రాంతికి నోట్లోంచి లింగాలు తియ్యటం, అవి ఎలా తీసేవాడో మెజీషియన్ విక్రం ప్రతిసారి చేసి చూపించేవాడు. ఈ మధ్యనే చనిపోయాడు.

ఇంకొక బాబా అనంతపూర్ జిల్లా పెనుగొండలో కృష్ణ దేవరాయలు కోటను అనుకోని ఆశ్రమమేర్పరచి, గుప్త నిధుల కోసం కోటనంతా కుళ్ళపొడిచినందుకు కేసులుకూడా ఉన్న ఖాళీప్రసాద బాబా. అందరిబాబాలలాగా ఈయన కాషాయ బట్టలు ధరించడు. వైట్ అండ్ వైట్ డ్రెస్ మాత్రమే వేస్తాడు. గుప్త నిధులకోసం కోటను త్రవ్వినందుకు ఎన్నో కేసులున్నాయి చివరికి జబ్బు ఏమిటో కూడా తెలియకుండా సాయిబాబా మాదిరి చనిపోయాడు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో చంద్రస్వామి ఒక వెలుగువెలిగాడు. చూడటానికి బాలనాగమ్మ నాటకంలో మాయలఫకిరు ఉన్నట్లుంటాడు. అసలుపేరు నేమిచంద్ జైన్. కొంతకాలం జంటనగరాలకు కాంగ్రెస్ అధ్యక్షుడుగా చేశాడు. తరువాత నాలుగేళ్ళ మాయమైపోయి, తిరిగొచ్చి హిమాలయాల్లో తపస్సు చేసివచ్చాను, మంత్రశక్తులు సిద్ధించాయని చెప్పుకుని చంద్రస్వామిగామారి చక్రం తిప్పాడు. చివరికి ఫెరా కేసులో కటకటాల్లోకి వెళ్ళాడు.

ఇంకొక స్వామి ప్రకాశంజిల్లాలో ప్రభుత్వ భూములాక్రమించి అధికారులతో పైరవీలు జరిపి , తనవద్ద మహిమలున్నాయని ప్రచారంగావించుకొని, దీర్ఘరోగాలను సైతం తగ్గిస్తానని ప్రకటించుకొని, పిల్లలులేనివారికి పిల్లలను సైతం పుట్టిస్తానంటూ సువర్ణ దాంపత్య యాగాలు చేస్తూ కేంద్ర మంత్రులను, గవర్నర్లను, డీజీపీలను, ఐఏఎస్‌లను రప్పించు కొంటూ మోసంచేస్తున్న దొంగరామదూత. ఈయన దగ్గరకు గతంలో యడ్యూరప్ప, గాలిజనార్దనరెడ్డి వచ్చారు. వారి జీవితాలు బాగుపడకపోగా పదవులు ఊడాయి. జైలుకెళ్ళారు. ఈస్వామిపై హైకోర్టులోనూ లోకాయుక్తలోను భూఆక్రమణ కేసులున్నాయి. మొన్ననే విజయవాడ దగ్గర సంగమంలో యాగంచేసి కేంద్రమంత్రి గడ్కరీని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునికూడా రప్పించుకొన్నాడు. ఎందుకంటే అమరావతి దగ్గర భూములు కాజేయటానికి పన్నిన పన్నాగంలో భాగమే ముఖ్యమంత్రిని రప్పించటం. అమరావతి చుట్టు ప్రక్కల దొంగస్వాములు పాగా వేయ్యకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. ఈ బాబా తప్పుడు అఫిడవిట్ యిచ్చి, ప్రభుత్వభూమి తనదేనని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్నాడు. జైల్లో పెట్టవలసిన మంత్రులు ఈ దొంగస్వామికి దండాలు పెడుతున్నారు. డేరాబాబా, అసారాంబాపు, రాంపాల్ బాబా, నిత్యానందస్వామి, ప్రేమానందస్వామి లాంటివాళ్ళు జైళ్లలో మగ్గుతున్నారు. కానీ మనరాష్ట్రంలో ఈ దొంగలకు ప్రభుత్వం దండాలు పెట్టటం విచిత్రంగా ఉంది. కనుక ప్రభుత్వం తక్షణమే బాబాల గుట్టురట్టుచేసి ,ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకొనవలసిన అవసరమెంతైనా ఉంది.

వ్యాసరచయిత : అధ్యక్షుడు, ఏపీ హేతువాదసంఘం

వి-మెయిల్

ఓటు(ఆన్ అకౌంట్) బడ్జెట్

ప్రధాని ఒకే దేశం ఒకే ఎన్నికలు మంచివని చెబుతారు. బీజేపీ అధ్యక్షులు మాట్లాడుతూ స్థిరమైన పార్టీని ఎన్నుకోండి. సంకీర్ణాల్ని వద్దు.రోజుకో ప్రధాని వుంటే కష్టం అన్నారు.కానీ ఆలోచిస్తే ఏటేటా ఎన్నికలొస్తేనే మంచిదేమోననిపిస్తుంది ఈ సారి బడ్జెట్ చూశాక.విధానాలూ.ప్రణాళికలూ నిధులూ అంటూ వచ్చే పూర్తి బడ్జెట్ కన్నా.ఎన్నికల ముందొచ్చే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కే మెరుపులెక్కువ. అంతోఇంతో ప్రజలు ఊరట పొందే ఊసులు,ఊరింపులు ఎక్కువ.ఎన్డీయే హయాం లోని నాలుగేళ్ల పూర్తి బడ్జెట్లు ఇచ్చిన అభయం కన్నా.నాలుగు నెలల ఖర్చుల నుద్దేశిస్తూ వచ్చిన తాత్కాలిక బడ్జెట్ ఎక్కువ ఆశలు రేపుతోంది.ముఖ్యంగా వేతనజీవులు 2014 నుండీ ఎదురుచూస్తూ వచ్చిన పన్ను మినహాయింపులు ఈసారి రెట్టింపు చేశారు.పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచడం మంచి నిర్ణయం.పెరుగుతున్న జీవన వ్యయం నేపథ్యంలో అవసరం.అసంఘటిత కార్మికులకు పింఛను నదుపాయం కల్పించడం మరో మంచి నిర్ణయం. మన దేశంలో అసంఘటిత కార్మికులే ఎక్కువ కనుక.ఐదెకరాల లోబడి భూమి కలిగిన చిన్న రైతు లకు ఏటేటా ఆరువేల రూపాయల నగదు ప్రత్యక్షంగా చేతికే అందిస్తామన్నది ఒక చిన్న సానుకూల చర్య.అది భూమిలేని వ్యవసాయ కూలీలకు,కౌలు రైతులకు కూడా అందించాల్సిన అవసరం ఉంది.అంతకు మించి చేయాల్సినవి కనీస మద్దతు ధర పెట్టుబడి కన్నా యాభై శాతం ఎక్కువగా నిర్ణయించడం,మార్కెట్ అనుసంధానం,గోదాముల నిర్మాణం ఇంకా ఎన్నో.అయితే ఇది తాత్కాలిక బడ్జెట్ కనుక ప్రభుత్వం ఆమాత్రం రైతు గురించి ఆలోచించడమే మహద్భాగ్యం అనుకొందాం.దేశంలో నిరుద్యోగిత గత నలభై ఐదేళ్ల రికార్డుని అధిగమించి ఆరుశాతం గా నమోదైందని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి.యువత ఎక్కువగా ఉన్న దేశం నిరుద్యోగ దేశంగా మిగిలితే సామాజిక, ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తుంది. ఉద్యోగ కల్పనలో తన పరాజయాన్ని అంగీకరించి ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సింది. నిర్మాణ రంగానికి చేయూత నివ్వాల్సింది. ఆదిశగా చర్యలు లేవు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల అమలులో ఐదేళ్ల పిమ్మట కేంద్రం ఏ స్థానంలో వుందో ఈ ఆఖరు బడ్జెట్లోనైనా తెలియజెప్తే బాగుండేది. ఏది ఏమైనా ఎన్నికల హామీల పూర్తి సినిమాకు ముందు ఈ బడ్జెట్ అధికారిక ట్రైలర్.ఆకర్షించింది.

నీతి : అసలు బడ్జెట్‌కి వడ్డింపులెక్కువ- కొసరు బడ్జెట్ కి ఊరింపులెక్కువ.

- డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
02 ఫిబ్రవరి 2019

జీవన పోరాటం



కొత్తగా ప్రారంభమైన క్రూయిజ్ వల్ల తమకు జీవనోపాధి లేకుండా పోయిందని, వాటిని నిషేధించాలంటూ వారణాసిలోని రాజేంద్ర ప్రసాద్ ఘాట్‌లో నావికులు ఆందోళన చేస్తున్న దృశ్యం.

బతకనివ్వండి...ప్లీజ్ !





విడాకులు తీసుకున్న ఓ యువతి సమాజానికి రాసిన బహిరంగ లేఖ

డియర్ సొసైటీ,

నాకు ఒక విషయం ఎప్పుడూ అర్థం కాదు....ఎప్పుడూ మిస్టరీగానే ఉంటుంది...ఏ వయస్సులో ఉన్నా ఒక మహిళను ఈ సమాజం ఎందుకు వేధించుకు తింటుంది? తన మన్నాన తనను ఎందుకు బతకనివ్వదు. ఆమె పెళ్ళి గురించి ఎప్పుడూ చర్చ నడుస్తూనే ఉంటుంది. ఇరుగుపొరుగు ఆంటీలూ, అంకుల్స్ అందరికీ ఆమె విషయమే కావాలి. ఒంటరి మహిళ ఉందంటే విషయాలన్నీ ఆమె చుట్టూనే తిరుగుతుంటాయి. చర్చోపచర్చలు జరుగుతుంటాయి. ఆమె విషయాలే వారికి వినోదం అవుతుంటాయి.

విడాకులు తీసుకున్న మహిళ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దారితెన్నూ తెలీని అగమ్యగోచరంలా తయారవు తుంది. ఆమెను సమాజం నుంచి వెలివేసినట్టే చూస్తారు. పెళ్ళి బంధం నుంచి బయటపడిన ఆమెను అడుగడుగునా అవమానిస్తూనే ఉంటారు. ఆమె సొంత విషయాలన్నీ వారికే కావాలన్నట్టు ఆరా తీస్తారు. భరించలేని బంధం నుంచి బయటపడాలనుకోవడం తప్పెలా అవుతుంది? ఒక మహిళగా అది నాకు స్వేచ్ఛ అవుతుంది. విడాకులు తీసుకోవడం అలాంటి ఊపిరి తీసుకునేందుకే. విడాకులు తీసుకోవడం అంటే...జైలు నుంచి విముక్తి పొందడమే. ఇది నాకు కొత్త జీవితమే. కొత్త జీవం పోసుకున్న జీవితంలా కనిపిస్తోంది నాకు. నా వరకూ నాకు ఇది అత్యుత్తమ జీవితం కిందే లెక్క. ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళ నుంచి పడిన కష్టాల నుంచి విముక్తి లభించింది. ఏ పనీ చేయకపోయినా నిస్సహాయంగా ఉండిపోయిన భావన నుంచి బయటకొచ్చాను.

యుక్త వయస్సులోనే నా పెళ్ళి అయ్యింది. కాలేజీ చదువు పూర్తవగానే వివాహం చేసేసారు. నిజానికి నేను అమెరికాలో చదువుకో వాలని కలలు కన్నాను. పీహెచ్‌డీ కూడా చేయాలనుకున్నాను. కానీ పెళ్ళి విషయం వచ్చేసరికి అన్నీ ఆగిపోయాయి. అలాగని నాది బలవంతపు పెళ్ళేమీ కాదు. చేసుకోబోయే అతను నాకు బాగానే తెలుసు. అప్పటికే నా స్నేహితులందరికీ పెళ్ళిళ్ళు అయిపోవడంతో నేనూ పెళ్ళి చేసుకునేందుకు అంగీకరించాను. వయస్సురీత్యా చూస్తే చిన్నదాన్ని, సరళంగా ఉంటాను, అమాయకంగా ఉంటాను. అంతా సజావుగానే జరిగిపోతుందనుకున్నా. అప్పటి నా నిర్ణయానికి తర్వాత పశ్చాతాపపడ్డా. కానీ వివాహమయ్యాక పరిస్థితులు ఏవీ నేను అనుకున్నట్టుగా లేవు. రోజులు గడిచేకొద్దీ ఏదో పోగొట్టుకున్నట్టే ఉండేది. సంతోషమన్నదే కనుమరుగై పోయింది. ఏళ్ళు గడిచేకొద్దీ అసలు ఏ భావమూ లేకుండా పోయింది. జీవితం నిస్సారంగా అనిపించింది.

విడాకులు తీసుకోవడం అనివార్యమైంది. విడాకులు తీసుకున్నాక జీవితం సాగించడం అంత సులభం ఏమీ కాదు. స్వేచ్ఛ లభించిందనే ఒక్క విషయం తప్ప ఇంకే విషయంలోనూ ఊరట కనిపించదు. బంధువులు వ్యతిరేకంగా మారతారు. పెళ్ళి రద్దు చేసుకున్నందుకు తప్పంతా నాదే అన్నట్టు నిందిస్తారు. అతిగా ఆలోచించానని, సొంత నిర్ణయం తీసుకున్నానని, అనవసరంగా అతనిని బాధించానని రకరకాలుగా మాట్లాడతారు. అంతేగానీ నేను పడ్డ కష్టాల గురించిగానీ, నేను ఎదుర్కొన్న పరిస్థితుల గురించి గానీ, ఇప్పుడు నేను ఎదుర్కోవాల్సిన పరిస్థితుల గురించి గానీ ఇసుమంతైనా ఆలోచించరు. చుట్టూ ఉన్న మనుషులు ఎలాంటివాళ్ళో ఇప్పుడు నాకు బాగా అర్థమవుతోంది. ఇక్కడ సమస్య ఏమిటంటే...ఎట్టి పరిస్థితుల్లోనూ వారు నాకు మద్దతు రారు, నా వైపున నిలబడరు. సొంత నిర్ణయం తీసున్నందుకు, తనదైన ఆలోచన చేసినందుకు మహిళలు పడే బాధ ఎంతగా ఉంటుందో నాకు అనుభవమైంది. ఇలాంటి కఠినమైన పరిస్థితులకు ఎదురు నిలిచి బలంగా, శక్తివంతంగా అవతరించాలి. ఏదో సామెత చెప్పినట్టుగా పరిస్థితులే మనల్ని బలవంతులుగా మారుస్తాయి. సమానత్వం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విషయం ఏదైనా చుట్టూ ఉన్న అవమానకరమైన వాతావరణాన్ని దాటి వచ్చేందుకు మహిళలు కనిపించని సంకెళ్ళను తెంచుకోవాల్సిందే. విడాకులు తీసుకున్నాక మహిళలకు ఉండే ఇలాంటి వాతావరణం, అవమానకరమైన పరిస్థితులు పురుషులకు ఎందుకు ఉండవు? అన్నది ఈనాటికీ ప్రశ్నగానే మిగిలి ఉండడం అత్యంత శోచనీయం. ఇన్నాళ్ళుగా మహిళలు ఏం జరిగినా మౌనంగానే భరించారు. ఎలాంటి బాధలనైనా పంటిబిగువన ఓర్చుకున్నారు. నేడు మీటూ లాంటి ఉద్యమం వచ్చింది. అది కూడా ముమ్మరంగా సాగింది. అలాగే, బిడ్డకు తల్లి పాలిస్తున్న చిత్రాలూ మ్యాగ్‌జైన్ కవర్ల మీద ప్రింటై...పెను సంచలనంగా మారాయి. మహిళా ప్రాధాన్యతా చిత్రాలు బాక్సాఫీస్‌క్రేజీగా మారాయి. సీఈఓ, సీఎఫ్ఓలుగా మహిళలు కంపెనీల అధిపతులుగానూ చలామణి అవుతున్నారు. ఇన్ని విజయాలు సాధిస్తున్న తరుణంలోనూ మహిళల జీవితాల మీద, వాళ్ళ వ్యక్తిత్వాల మీద ఎందుకింత చిన్నచూపు, ఎందుకింత కఠినమైన విమర్శలు, ఎందుకు ఇన్ని అవమానాలు, ఎందుకు ఇన్ని వెటకారాలు, ఎందుకు ఇన్ని వ్యంగ్యాలు...ఎప్పటికి మారేను ఈ దుస్థితి? నాకు అర్థం కాని విషయం. మనుషుల ఆలోచనల్లో, మనుషుల సమూహాలతో కూడిన సమాజంలో మార్పు ఎందుకు రాదు? మనం అంత అధోగతిలో ఆలోచిస్తున్నామా? మన మెదళ్ళు అంతగా బూజుపట్టిపోయాయా? లేదా పట్టిన బూజు వదిలించుకోనంత చాంధసంలో కూరుకుపోయమా? ఈ ప్రశ్నలన్నింటికీ జవాబులు వెతకాలి. అన్నింటిలో కాదు...ముందుగా ఇందులో విజయం సాధించాలి. ఇలాంటి విజయం సాధించేవరకూ ఎన్ని సాధించినా మహిళల జీవితాల్లో మార్పు రాదు.

వివాహమైనా, విడాకులు తీసుకున్నా, ఏదైనా ఎఫైర్ ఉన్నా, ఇద్దరిని ప్రేమిస్తున్నా, లేదంటే ఒక్కరే జీవిస్తున్నా...అది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం. పురుషుల విషయంలో ఇలా ఆలోచించే సమాజం మహిళల విషయంలో మాత్రం ఎందుకు వివక్షత చూపిస్తుంది. ఏ విషయాన్నైనా ఎదుటివారి కోణంలో నుంచి చూడడం, వారి వైపు నుంచి అర్థం చేసుకోవడం అవసరం. మన ఇష్టానుసారం ఊహించుకోవడం, ఎలా పడితే అలా మాట్లాడడం ఎవరి విషయంలోనైనా సంస్కారం కాదు.

మహిళలకు ఆనందంగా జీవించే అవకాశాన్ని ఇవ్వండి. విడాకులు తీసుకుని సంతోషంగా ఉన్న మహిళలకు కావలసిన అండదండలు అందించండి. వారిని అందరిలాగే బతకనివ్వండి....ప్లీజ్! ఓ సమాజమా...ఇంతకుమించి నిన్ను అడిగేదేమీ లేదు!!

ఇట్లు
– ఓ నడివయస్కురాలు

సోంపు తింటున్నారుగా...



ఆహారం తీసుకున్న తర్వాత సోంపు తినడం చాలా మందికి అలవాటు. ప్రత్యేకించి మాంసాహార భోజనం తర్వాత దీన్ని తీసుకుంటే నోరు తాజా ఉన్న ఫీలింగ్‌తో పాటు త్వరగా అరుగుతుందనేది వారి భావన. అందుకని సోంపును ప్రతి ఒక్కరూ స్టోర్ చేస్తుంటారు. సోంపు కేవలం నోటిని ఫ్రెష్‌గా ఉంచడానికి మాత్రమే కాదు. మీ ఆరోగ్యాన్ని కాపాడటానికి కూడా సహాకరిస్తుంది.

సోంపుతో ప్రయోజనాలు...

- సోంపును పొడిగా చేసి అందులో ఉప్పు, నిమ్మరసం కలిపి నిల్వ ఉంచండి. దీన్ని నోటి నుంచి చెడువాసన వచ్చినప్పుడు ఉపయోగించండి. నోరు తాజాగా ఉండడంతో పాటు తీసుకున్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.
- మలబద్దకం సమస్య ఉంటే రాత్రి పడుకునే ముందు సోంపు పొడిని గోరు వెచ్చని నీటిలో కలిపి తాగండి. ఇలా చేస్తే మలబద్దకం తగ్గుతుంది.
- జలుబు వల్ల గొంతులో సమస్యగా ఉంటే ఉదయం లేవగాన్నే సోంపును నమలండి. దీంతో సమస్య అదుపులోకి వస్తుంది.
- అరికాలు, అరి చేతుల్లో మంటలుగా ఉంటే సోంపు, ధనియాలను సమానంగా తీసుకోని పొడి చేసుకోండి. ఈ పొడిని భోజనం చేశాక వారం పాటు రోజు తీసుకుంటే కొన్ని రోజుల్లోనే మంటలు తగ్గుతాయి.
- భోజనం తర్వాత నిత్యం సోంపు తీసుకుంటే కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- సోంపు పొడిని పాలలో కలిపి తీసుకుంటే నిద్రలేమి సమస్య తగ్గి హాయిగా నిద్రపడుతుంది.

ఫ్లవర్ వాజ్.. పరిమళభరితంగా



వాడిపోయిన పువ్వులను ఎవ్వరూ ఇష్టపడరు. ఫ్లవర్‌వాజ్‌లో పువ్వులు మరింత తాజాగా ఉండాలనుకుంటారు. దీని కోసం మార్కెట్లో దొరికే ఉత్పత్తులను ఉపయోగిస్తుంటారు. దీని వల్ల అవి తాజాగా ఉండే సంగతి అటుంచితే సమయానికి ముందే వాడిపోతాయి. ఇంటి దగ్గర మీరే సేంద్రీయంగా తయారు చేసి సహజంగా ఉపయోగిస్తే పువ్వులు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి. పువ్వులను ఎక్కువ సమయం తాజాగా ఉంచడం కోసం పంచదార, నిమ్మరసం, వెనిగర్, వేపనూనెను తీసుకోండి.



ఒక మీడియం సైజు ఫ్లవర్ వాజును తీసుకుని రెండు టేబుల్ స్పూన్‌ల పంచదార, రెండు టేబుల్ స్పూన్‌ల వెనిగర్, ఒక టేబుల్ స్పూన్ వేప నూనె, కొన్ని నీటిని పోయండి. ఇలా చేయడం వల్ల పంచదార మొక్కకు శక్తినిచ్చి మొగ్గలను ఎక్కువ సమయం వికసించేలా చేసి సువాసనను ఎక్కువ సమయం వరకూ నిలిపి ఉంచుతుంది. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ వెనిగర్‌లోని ఎసిటిక్ యాసిడ్ ఇవి రెండు కూడా పువ్వులోని పిహెచ్ స్థాయిల్ని కాపాడుతుంది. అంతేకాక వేప నూనె బాక్టీరియా వృద్ధి చెందకుండా కాపాడుతుంది.సో మీ ఫవర్ వాజ్‌లో పువ్వులు తాజాగా ఉండాలంటే మీరూ పాటించి చూడండి.

పగిలిన మడమలా...!



చలికాలంలో మడమలు పగలటం అనేది చాలా సాధారణమైన సమస్యల్లో ఒకటి. ఇది తీవ్రమైతే నొప్పి భరించలేరు, నడవలేరు. చాలా ఇబ్బందిపడతారు. దీని నుంచి మీ బయటపడాలని ఆలోచించిన వెంటనే మనస్సులో మెదిలేది పెడిక్యూర్ గురించే. ఎందుకంటే ఇవి అలసిన మీ పాదాలకు, కండరాలకు విశ్రాంతి నివ్వడంతో పాటు పగిలిన మడమలకు చికిత్సనందిస్తుంది. పెడిక్యూర్ మీ పాదాలను ఆరోగ్యంగా ఉంచడానికి సహాకరిస్తుంది. మీరు నెలకు ఎన్ని సార్లు పెడిక్యూర్ చేయిస్తున్నారు. దీన్ని తరచూ చేయించడం అంత మంచిది కాదు. పగిలిన మడమలకు పెడిక్యూర్‌ల కన్నా ఇంటివద్దే చిన్న చిన్న నివారణలు పాటించడం మంచిది. మరీ అవేంటో తెలుసుకుందామా...!

అర చెక్క నిమ్మ రసం, రెండు టేబుల్ స్పూన్ల కలబంద రసం, ఒక టేబుల్ స్పూన్ టీ ట్రీ ఆయిల్, ఒక టేబుల్ స్పూన్ ఎప్సిమ్ సాల్ట్, ఒక టేబుల్ స్పూన్ వెనిగర్ తీసుకోని బకెట్ గోరు వెచ్చని నీటిలో వేసి మీ పాదాలను పావుగంట పాటు నానబెట్టండి. ఇలా చేయడం వల్ల పగుళ్ళు వల్ల ఏర్పడిన మృత కణాలు తొలగి చర్మం మృదువుగా తయారవుతుంది. దీనిలోని సాల్ట్, కలబంద రసం పగిలిన మడమలపై అద్భుతంగా పనిచేస్తుంది. నానబెట్టిన తర్వాత పాదాలను స్క్రబింగ్ చేయండి. స్క్రబింగ్ పూర్తయినాక పొడి టవల్‌తో తుడవండి. తర్వాత పాదాలను గోరు వెచ్చని నీటితో శుభ్రం చేయండి. ఇప్పుడు మాశ్చరైజయిర్‌ను అప్లై చేయండి. ఇలా తరచూ చేస్తుంటే పాదాల పగుళ్ళను సాధ్యమైనంత మేర నివారించవచ్చు.

కలబందతో పొడవైన వెంట్రుకలు





దట్టమైన, పొడవైన కురులంటే ఇష్టపడని వారుండరు. దీని కోసం మార్కెట్లోకి వచ్చిన ప్రతీ ప్రొడెక్ట్‌ని వినియోగిస్తుంటారు. కానీ ఈ బిజీబిజీ జీవితంలో ఎవ్వరి కూడా వారి వెంట్రుకలను సంరక్షించుకునే తీరిక లేదు. దీంతో వెంట్రుకలు రాలడం, చిట్లడం వంటి సమస్యలు మొదలవుతున్నాయి. వెంట్రుకలు పొడవుగా ఎదగాలంటే అది ఒక రోజు, ఒక నెలలో జరిగే పనికాదు. ఏళ్ళు పడుతుంది. కలబందను స్కిన్, హెయిర్ రెండిటికి వినియోగిస్తారు. కలబందలోని అమినో యాసిడ్స్, ఎంజైమ్స్ వెంట్రుకల పెరుగుదలకు సహాకరిస్తుంది. అంతేకాక వెంట్రుకలు రాలడాన్ని నివారిస్తుంది. కలబందలోని యాంటీ ఫంగల్ లక్షణాలు తలపై చుండ్రును తగ్గిస్తుంది. మరి ఇలాంటి కలబందను ఎలా ఉపయోగించాలో తెలుసుకుందామా..!

తేనె

ఐదు టేబుల్ స్పూన్స్ కలబంద రసం, మూడు టేబుల్ స్పూన్స్ కొబ్బరి నూనె, రెండు టేబుల్ స్పూన్స్ తేనెను తీసుకోండి. ఈ మూడింటిని బాగా కలిపి తలపై మసాజ్ చేయండి. అరగంట తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపుతో తలస్నానం చేయండి. వెంటనే కండీషనర్ అప్లై చేయండి.

ఉల్లిపాయ

ఒక టేబుల్ స్పూన్ కలబంద రసం, ఒక కప్పు ఉల్లిరసం తీసుకోండి. ఈ రెండిటిని బాగా కలిపి కదుళ్ళకు పట్టించండి.

ఒక గంట తర్వాత తలస్నానం చేయండి. తర్వాత కండీషనర్‌ను వాడండి.

కొబ్బరి పాలు

నాలుగు టేబుల్ స్పూన్స్ కలబంద రసం, నాలుగు టేబుల్ స్పూన్స్ కొబ్బరి పాలును తీసుకోండి. ఈ రెండిటిని బాగా కలిపి తలపై మసాజ్ చేయండి. కుదుళ్ళకు పట్టే విధంగా పట్టించండి. ఒక గంట తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపుతో తలస్నానం చేయండి.

మందారం

రెండు మందార పువ్వులు, ఒక కప్పు కలబంద రసంను తీసుకోండి. ముందుగా మందార పువ్వులను నూరి గుజ్జులా తయారు చేసుకోవాలి. తర్వాత ఈ గుజ్జు కలబంద రసంలో కలిపి మాడుకు బాగా పట్టించాలి. ఒక గంట తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకల సమస్య తగ్గి బాగా పెరుగతాయి.

పంజాబీ స్పెషల్స్

ఇంటికి వచ్చే అతిథుల కోసం ఏదైనా కొత్త డిష్ చేయాలనుకుంటున్నారా? అయితే పంజాబీ స్పెషల్ డిష్‌లు మీకు బెస్ట్ ఆప్షనే. మరెందుకు ఆలస్యం వీటిని తయారు చేయడం ఎలాగో తెలుసుకొని వంట చేయడం షురూ చేయండి.

మేథి చికెన్



కావలసిన పదార్థాలు : చికెన్ కేజీ, మెంతి కూర కట్ట, పాలకూర కట్ట, ఒక టేబుల్ స్పూన్ కసూరి మేథి, దాల్చిన చెక్క ఒకటి, యాలకులు రెండు, లవంగాలు నాలుగు, ఉల్లిపాయ ఒకటి, అల్లం వెలుల్లి పేస్ట్ ఒక టేబుల్ స్పూన్, పచ్చిమిర్చి నాలుగు, పసుపు అర స్పూన్, పంజాబీ గరం మసాలా ఒక టేబుల్ స్పూన్, కారం ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర ఒక టేబుల్ స్పూన్, ఉప్పు తగినంత, నూనె సరిపడా.

తయారీ విధానం : ముందుగా ప్రెషర్ కుక్కర్‌ను తీసుకొని నూనె వేసి వేడిచేయండి. వేడెక్కిన నూనెలో చికెన్ వేయించండి. కొద్దిసేపు చికెన్‌ను వేయించాక తీసి పక్కన పెట్టండి. అందులోనే మరికొంత నూనె చేర్చి దీనిలో జీలకర్ర, దాల్చిన చెక్క యాలకులు లవంగాలు వేసి వేయించండి. దీనిలో అల్లం వెలుల్లి పేస్ట్, ఉల్లిపాయ పేస్ట్, మిర్చి వేసి బాగా తిప్పండి. తర్వాత పసుపు, కారం, ఉప్పు వేయండి. ఇప్పుడు మెంతి కూర, పాలకూరను మిక్సీ పట్టిన పేస్ట్ కప్పు వేసి ఐదు నిముషాల పాటు ఉడికించండి. తర్వాత చికెన్ వేసి తిప్పి ఒక గ్లాసు నీటిని కూడా వేసి కుక్కర్ మూత పెట్టి మూడు విజిల్స్ రానివ్వండి. ప్రెషర్ పోయిన తర్వాత మూత తీసి గ్రేవి దగ్గర పడే వరకు తిప్పండి. అంతే మేథి చికెన్ రెడి. ఇక సర్వ్ చేయవచ్చు.

పెరుగు చికెన్

కావలసిన పదార్థాలు : బోన్ లెస్ చికెన్ అరకేజీ, ఒకటిన్నర కప్పు పెరుగు, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెలుల్లి పేస్ట్, అర టీ స్పూన్ కారం, పావు టీ స్పూన్ పసుపు, పంజాబ్ మసాలా పౌడర్ పావు టీ స్పూన్, పచ్చిమిర్చి నాలుగు, టమాటా ఒకటి, ఉల్లిపాయలు రెండు, కొత్తిమీర తగినంత, ఉప్పు రుచికి సరిపడా, నూనె తగినంత.

తయారీ విధానం : ఒక గిన్నె తీసుకొని దానిలో పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా పౌడర్, పసుపు, కారం, తరిగిన పచ్చిమిర్చి, చికెన్ వేసి అరగంట పాటు పక్కన ఉంచండి. ఇప్పుడు పాన్‌లో నూనె వేసి వేడి చేయండి. టమాట ప్యూరీ వేసి వేయించండి. తర్వాత ముందుగా కలిపి ఉంచుకున్న చికెన్ మిశ్రమాన్ని కూడా వేసి వేయించండి. అవసరమైతే కొంచెం నీరు, ఉప్పు వేసి గ్రేవీ తయారు చేసుకోండి. చివరగా కొత్తమీర వేసి దించండి. ఇక పంజాబీ స్పెషల్ పెరుగు చికెన్ సిద్ధం.



నేను - నుడిగుండం

(నవల) 33

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

క్రమంగా చిన్న బృందం తయారయింది. నేనూ, రమాకాంత్ ఈ దేశంలోని ఇంగ్లీష్ ఛానల్స్‌ని, విదేశాల్లో వున్నవాటిని స్టడీ చేస్తున్నాం. తరచుగా ప్రయాణాలు చేసేవాడిని.

అలాగే ఎవరెవరు ఏ కార్యక్రమాలు చేయాలో ముందు నిర్ణయం తీసుకున్నాం. ఏఏ అంశాల మీద పరిశోధనలు చేయాలో అనుకున్నాక ఓ బృందాన్ని ఆ పనుల మీద పంపించాం. దినపత్రికలకు ఎప్పుడూ వార్తలు వుంటాయి. క్రీడలకి, పిల్లలకి, సినిమాలకు పూర్తి పేజీలు కేటాయించే పరిస్థితి వచ్చింది.

ప్రధాన నగరాల్లో కూడా స్టాఫ్ ని నియమించుకున్నాం. మా దగ్గర కంటెంట్ కొరత లేదు.

టెస్ట్ సిగ్నల్స్ మొదలు పెట్టటానికి తొమ్మిది నెలలు పట్టింది. ఈ కాలమంతా నేను నిద్రపోయింది తక్కువ. వ్యక్తిగత జీవితం లేదు. వెన్నెలకీ, నిదాకి రెండు గంటలు కేటాయించ లేకపోతున్నాను.

ఇప్పుడు నా రూపం మారిపోయింది. బట్టలు మారిపోయాయి. షూస్, కోటు వచ్చాయి. మేం ట్రిబుల్ బెడ్ రూమ్‌కి మారాం. నిదాని కొత్త స్కూల్లో చేర్పించాను. ఓ రోజున కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, సినీ నటీ నటులందరి ముందు టీ.వీ.ని లాంచ్ చేసాం. పత్రికలన్నీ ప్రముఖంగా ఈ వార్తని ప్రచురించాయి. మామూలు జనం ఎంటర్‌టైన్ ఛానల్స్‌ని మించి బయటకు రారు.

మాకయితే అలాంటి ఆలోచన లేదు. మేం మధ్యతరగతి వారిని టార్గెట్ చేసుకున్నాం, జయదేవ్, అమిత, అర్చన, విస్సులాంటి వారంతా శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అలాంటి సంచలనాత్మక పరిశోధనలు చేసాం. అప్పటి వరకు నిర్లక్ష్యం చేయబడ్డ వర్గాలకు ప్రాముఖ్యతని యిచ్చాం. రమాకాంత్ శూలశోధన జరపటానికి ఎప్పటికప్పుడు ఆధునిక పరికరాలు తెప్పించేవాడు. అన్ని రంగాల ప్రముఖుల్ని వేదిక మీద చేర్చి చర్చా వేదికల్ని నిర్వహించాం.

నేను ప్రత్యేకంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. రాజకీయ నాయకుల నుండి, అన్ని రంగాల ప్రముఖులు మా టీ. వీ. లో కన్పించటం ఓ గౌరవం అనే స్థితికి వచ్చారు.

****

సంవత్సరం తిరిగేలోపు ఓ ఛానల్, ఆ తర్వాత కొద్ది నెలల్లో ఇంకో ఛానల్ వచ్చాయి. మా దగ్గర వున్నవారిలో కొంతమంది వెళ్లిపోయారు. శ్రీధర్ నాతోనే వున్నాడు.

ఎప్పుడయితే పోటీ మొదలయిందో అప్పుడు మరింతగా కార్యక్రమాల్లో మునిగి పోయాం. రెగ్యులర్‌గా మేం అన్ని విభాగాల గురించి సమీక్షించే వాళ్లం. ఎక్కడ లోపాలు జరుగుతున్నాయో గుర్తించే వాళ్లం..

నేను చేసిన పని మంచి లైబ్రరీని ఏర్పాటు చేయటం. మాకు రీసెర్చి విభాగం వుంది. రెండు ఛానల్స్ కంటే మేం చాలా ఎత్తులో వున్నాం.

రమాకాంత్ ఒకటే చెప్పాడు.

"మనకి ఏ పార్టీ ముద్ర పడకూడదు. మనకు నిజం కావాలి. ప్రజలు తమకోసం మన ఛానెల్ పని చేస్తుంది అనుకోవాలి. మనకు విశ్వసనీయత కావాలి. అధికార పక్షాన్నే కాదు, తప్పులు జరుగుతున్నప్పుడు మనం ప్రతిపక్షాలను కూడా స్పేర్ చేయవద్దు" అంటూ.

ఓ రోజున అకస్మాత్తుగా అందరికీ జీతాలు పెంచటం జరిగింది. యాంకర్లను నియమించుకోవటంలో, గ్రామాల వరకు మా నెట్‌వర్క్‌ని విస్తరించటంలో నిమగ్నం అయ్యాం . మా నుండి బయటకు వెళ్లిన వారు బాధ పడ్డారు. మా దగ్గర వారికి స్వేచ్ఛ వుండేది. కొత్త చోట అలా కాదు. పరిమితులు వున్నాయి.

మా వల్ల నష్టపోయిన వారున్నారు.

వ్యక్తిగతంగా నామీద కసి పెంచుకున్నారు. అలాగే సాధారణ జర్నలిస్ట్‌గా ఉన్న నేను ఇంతగా ఎదగటాన్ని కొందరు భరించలేకపోతున్నారు. అలా శత్రువర్గం తయారవుతోంది. ఇవన్నీ నా దృష్టిలో వున్నాయి.

****

నరసయ్య మావయ్యనీ, అత్తనూ మా ఊరి నుండి హైదరాబాద్ తీసుకు రావాలనుకున్నాను. ముందు వెన్నెలని మావయ్య దగ్గరకు పంపించాను.

మావయ్య ఒప్పుకోలేదు. ఒకప్పుడు కూడా అలానే అన్నాడు. నేను అక్కడికి వచ్చి ఏం చేయాలి అని. ఆయన రైతు. బతికినంత కాలం అలానే వుండాలి అనుకుంటాడు. నేను ఓ ఎకరం కొన్నాను మా ఊర్లోనే. అది కూడా మావయ్య చూసుకుంటున్నాడు.

పొలం కౌలుకి యిద్దామన్నా ఒప్పుకోలేదు.

"ఒంట్లో ఓపిక వున్నంతవరకూ పని చేయాలి. సుఖపడటానికి అలవాటు పడకూడదు" అన్నాడాయన.

"కనీసం ఆరోగ్యం బాగుండక పోయినప్పుడైనా మా దగ్గరకు వస్తారా?" అని అడిగింది వెన్నెల.

"ముందు ముందు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు. మీరు కాకుండా మాకు ఎవరున్నారు" అని అత్తయ్య అంది.

నేను ఓ నిర్ణయం తీసుకున్నాను.

మా ఊర్లో స్థలం కొనాలి. అక్కడ ఇల్లు కట్టాలి. మావయ్య వాళ్ల ను అందులో వుంచాలి.

సంవత్సరం మాత్రం యిక్కడ వుంటాను అనుకున్నది అంతా మారిపోయింది. నాకు వ్యక్తిగతంగా ఖరీద యిన కారుని రమాకాంత్ ప్రెజెంట్ చేసాడు. అలాగే ముఖ్యమైన వారికి చిన్న చిన్న కార్లు యిచ్చాడు.



అక్కడ స్థలం కొనటం ఎందుకు? హైదరాబాద్ లో కొని ఇల్లు కడితే బాగుంటుంది కదా అని సలహాలు యిచ్చిన వారున్నారు. నా మనసులో వున్నవి వారికి చెప్పలేను.

****

పెద్ద మావయ్యగారి అమ్మాయి!

ఓ రోజు నేను ఆఫీస్‌లో వుండగా....

మిమ్మల్ని కలవటానికి ఓ అమ్మాయి వచ్చింది. మీరు బంధువులు అవుతారంట అనగానే ఆశ్చర్యం కలిగింది. నాకు బంధువులా అనుకుని లోపలకి పంపమన్నాను.

తను వచ్చింది. అయినా గుర్తు పట్టలేకపోయాను.

"నేను మీ పెద్ద మావయ్యగారి అమ్మాయిని" అంది. నాకు ఆశ్చర్యం కలిగింది.

"ఓసారి మాత్రం దూరంగా చూసాను. గుర్తు పట్టలేదు. ఏమీ అనుకోవద్దు" అన్నాను.

"చిన్నప్పుడు ఓసారి చూసారు. ఎలా గుర్తుంటుంది" అంది. అప్పటికప్పుడు కాఫీ తెప్పించాను. తర్వాత ముందు ఇంటికి వెళ్తువుగాని. వెన్నెలతో మాట్లాడుతుండండి. నేను త్వరగా పనులు పూర్తి చేసుకుని వస్తాను" అన్నాను.

డ్రైవర్‌ని పిలిచి ఇంటి దగ్గర డ్రాప్ చేయమని పంపించాను. వెన్నెలకి ఫోన్ చేసి "మీ అక్క వస్తోంది" అన్నాను.

"మా అక్కా" అంది.

"మీ పెదనాన్నగారి అమ్మాయి"

"ఇప్పుడెందుకు వచ్చింది?"

"తెలియదు. ఆఫీస్‌లో అవన్నీ ఎలా అడుగుతాను. నువ్వు భోజనానికి ప్రత్యేకంగా ఏమీ చేయవద్దు. నేను కర్రీస్ తీసుకు వస్తాను" అన్నాను.

ఆ తర్వాత ఇంటికి వెళ్లాను.

అప్పుడు అసలు విషయం తెలిసింది.

ఆ అమ్మాయి పేరు గంగ. తను ఇంటర్‌కేస్ట్ మ్యారేజ్ చేసుకుందంట. అది వాళ్లు ఒప్పుకోలేదు. ఇప్పుడు సంబంధాలు తెంచుకున్నారంట. ఇలా పెళ్లి చేసుకుంటుందని వారు అనుకోలేదు.

"అత్తయ్య విషయంలో, నీ విషయంలో మా నాన్న, బాబాయి చాలా అన్యాయం చేసారు బావా. మీ అందర్నీ చూడాలని చిన్నప్పటి నుంచి మాకు వుండేది. ఇంట్లో ఒప్పుకునే వారు కాదు. మెల్ల మెల్లగా మాకు మీగురించి తెలిసింది. చుట్టుపక్కల వారు నా దగ్గర విమర్శలు చేసేవారు. మీ నాన్న వాళ్లు వారికి డబ్బులు ఇవ్వలేకపోవచ్చు. కనీసం సంవత్సరానికి ఓసారి చూసి రాలేరా? మనుషులు ఇంత కఠినంగా ఎలా వుంటారు అనేవారు. అప్పుడు నాకు ఏడుపు వచ్చేది" అంది బాధగా.

"నరసయ్య బాబాయిని ఎన్ని మాటలు అన్నారు. వాళ్ల చేయరు. చేసేవారి మీద దుమ్ము పోస్తారు. నాకు బాబాయి దేవుడిలా అనిపించేవాడు. నిజంగా అలాంటి మంచి మనిషిని నేను ఈ మధ్య చూడకపోయినా, నా మనసులో నిలిచాడు"

వెన్నెల అక్కకేసి చూస్తోంది.

"అత్త చనిపోయిన విషయం మాకు తెలీదు... పెళ్లి అప్పుడు చెప్పకపోయినా ఫర్వాలేదు. ఇప్పుడు చెప్పివుంటే బాగుండేది కదా అనిపించింది" అంటుంటే...

"అమ్మ చివరి కోరిక అది. అందుకే..." అని నేను అంటుంటే

"మీరు చెప్పినా నాన్న వాళ్లు వస్తారని కాదు. మనసులో ఎంత గాయపడి వుంటే అత్త అలా అంటుంది. అయినా అత్త వాళ్లకి శత్రువా? వారి మధ్య రక్తసంబంధం వుంది. మా అమ్మ సాటి ఆడదై వుండి ఇలా ఎందుకు చేసింది అనుకునేదాన్ని. నాకు ఎప్పటికయినా తిరుగుబాటు చేయాలని అప్పటి నుంచి వుండేది" అని ఆగింది.

నిదా కూడా పక్కన వుంది.

"నువ్వు నిద్రపోదువుగాని" అని వెన్నెల తీసుకు వెళ్లింది. ఇలాంటివి పిల్లల ముందు మాట్లాడటం మంచిది కాదు. వారి లేత మనసుల్లో ఇవి ముద్రించుకుంటాయి. తమకంటూ ఓ నిర్ణయం వచ్చేదాకా మనుషుల మీద విపరీతమైన ద్వేషాన్నో, అభిమానాన్నో పెంచుకునేలా చేస్తాయి. రెండూ ప్రమాదకరమే.

వెన్నెల వచ్చాక మళ్లీ మాట్లాడటం మొదలు పెట్టింది.

"చిన్నప్పటి నుంచి నేను గమనించాను. ముందుగా నాన్నకి, బాబాయికి మేం పుట్టాం. తర్వాత తమ్ముళ్లు పుట్టారు. వారు పుట్టనంత వరకు బాగానే వుంది. తర్వాత నాకు అర్థం అవుతూ వచ్చింది. ఇటు నాన్నా బాబాయి కూడా మగపిల్లలకి, ఆడపిల్లలకి మధ్య తేడా చూపించారు. మీరు ఈడపిల్లలు కాదు, ఎప్పటికయినా బయటకు వెళ్లాల్సినవారే అనేవారు. అంటే అత్తని ఎలా చూసారో మా పరిస్థితి కూడా అంతేనని అర్థం అయింది"

(ఇంకా ఉంది)

పురోగమనంలో హోటల్ మేనేజ్‌మెంట్ రంగం

వివిధ కోర్సుల్లో శిక్షణతో మెండుగా ఉపాధి అవకాశాలు



మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. విహారాలకు వెళ్లినవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఈ రంగానికి అనుబంధంగా ఆతిథ్య రంగం అవతరించింది. ఈ రంగానికి సంబంధించి హోటల్ మేనేజ్‌మెంట్ సిబ్బంది అందిస్తున్న సేవల కారణంగా పర్యాటకులు విహార పర్యటనల్లో ఆహ్లాదాన్ని పొందుతున్నారు. స్వదేశమైనా.. విదేశమైనా.. విహారమైనా.. విధినిర్వహణలో భాగమైనా.. అవసరాలకు అందు బాటులో ఉండి అన్ని వసతులతో అతిథులను ఆహ్వానించి ఆనందింపజే స్తున్నారు ఈ రంగం సిబ్బంది. వీరంతా హోటల్ మేనేజ్‌మెంట్‌లోని వివిధ విభాగాల్లో శిక్షణ పొందిన నిపుణులు.

మన దేశంలో ఐటీ తర్వాత ఆతిథ్య రంగంలోనే ఎక్కువమంది ఉపాధి పొందుతున్నారు. ప్రపంచ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్ ప్రకారం బిజినెస్ ట్రావెల్ డెస్టినేషన్‌లో భారత్ 18వ స్థానంలో ఉంది. మరికొన్నేళ్లలో అయిదో స్థానానికి చేరుకుంటుందని అంచనా. దేశీయ దిగ్గజాలైన లీలా, ఒబెరాయ్, తాజ్, ఐటీసీ హోటళ్లు విస్తరిస్తున్నాయి. స్టార్‌వుడ్, మారియట్ లాంటి విదేశీ సంస్థలు మన దేశంలో శాఖల సంఖ్యను పెంచుతున్నాయి. ఫాస్ట్‌ఫుడ్ చైన్‌లో కేఎఫ్‌సీ, మెక్ డొనాల్డ్స్, పిజా హట్, డోమినోస్... ప్రముఖ సంస్థలుగా వెలుగొందుతున్నాయి. జొమాటో, స్విగ్గీ, ఫుడ్ పాండా... తీరిక లేకుండా ఆహారాన్ని అందిస్తూనే ఉన్నాయి. దేశీయ, విదేశీ పర్యాటకుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుండటంతో చెఫ్, వెయిటర్, సర్వర్, హౌస్ కీపింగ్, ఫ్రంట్ ఆఫీస్, ఫుడ్ అండ్ బేవరేజ్, గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్....ఇలా ఎన్నో రకాల నిపుణుల అవసరం పెరుగుతోంది. అందుకే ఆతిథ్య రంగంలో వస్తున్న ఈ అవకాశాలను అందుకోవాలంటే కొన్ని రకాల కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది.

అడ్మిషన్ విధానం..

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు అందిస్తున్నాయి. ఇందుకోసం ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ ప్రధానమైన పరీక్ష. దీని ప్రకటన వెలువడింది. అలాగే ఐటీసీ, ఒబెరాయ్ గ్రూప్‌లు ప్రత్యేకంగా కోర్సులు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. వీటిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఆతిథ్య కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్రస్థాయి పరీక్ష రాయాలి. అయితే తెలుగు రాష్ట్రాల్లో చాలావరకు హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలు ఎలాంటి పరీక్ష లేకుండా నేరుగా కోర్సుల్లో చేరే అవకాశం కల్పిస్తున్నాయి. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సులున్నాయి. ఇంటర్ పూర్తిచేసుకున్నవారు డిప్లొమా, యూజీ కోర్సుల్లో చేరవచ్చు. డిగ్రీ కోర్సులకు మూడేళ్లు, డిప్లొమాలకు 18 నెలల కాలవ్యవధి ఉంటుంది.

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ

నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ) కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ సంస్థ తరఫున హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. దీనిద్వారా దేశవ్యాప్తంగా 63 హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది. కొన్ని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్లలోకీ ఈ స్కోర్‌తోనే ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ స్కోర్‌తో తెలుగు రాష్ట్రాల్లో పలు సంస్థలు నేరుగా ప్రవేశం కల్పిస్తున్నాయి. హైదరాబాద్ (విద్యానగర్)లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేంద్ర సంస్థ. ఇక్కడ బీఎస్‌సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ (జనరిక్/స్పెషలైజేషన్), పీజీ డిప్లొమా ఇన్ అకామడేషన్ ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పాటిస్సరీ/ ఫుడ్ అండ్ బేవరేజెస్‌లో సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, తిరుపతి, డాక్టర్ వైఎస్‌ఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, హైదరాబాద్; ప్రైవేటు యాజమాన్యంలో శ్రీశక్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ (బేగంపేట) జేఈఈ స్కోర్ ద్వారా ప్రవేశం కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలన్నీ ఈ స్కోర్ ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. పరీక్ష తేదీ ఏప్రిల్ 27.

వెబ్‌సైట్ : http://nchm.gov.in

ఉద్యోగావకాశాలు

బీఎస్‌సీ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివినవారిని మేనేజ్‌మెంట్ ట్రెయినీ లేదా ఎగ్జిక్యూటివ్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ అవుట్ లెట్లు, రిసార్టులు, రైల్వే, డిఫెన్స్, ఎయిర్ లైన్స్, క్రూయిజ్ లైన్స్, స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు, బహుళ జాతి కంపెనీలు... ఇలా ప్రతిచోటా ఉద్యోగాలు లభిస్తాయి. సొంతంగా ఫుడ్ కోర్టులు ప్రారంభించవచ్చు. పీజీతో ఉన్నత అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. నేషనల్ హాస్పిటాలిటీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టులో అర్హత సాధిస్తే బోధన రంగంలో ఆకర్షణీయ వేతనాలు అందుతాయి. ప్రముఖ సంస్థల్లో ఆతిథ్యంలో బీఎస్సీ కోర్సులు పూర్తిచేసుకున్నవారు ప్రారంభంలోనే నెలకు రూ.20,000- 25,000 వేతనం పొందవచ్చు. అయిదేళ్ల అనుభవంతో జీతం రూ.యాభై వేల వరకు చేరుతుంది. డిప్లొమా అభ్యర్థులకు ప్రారంభంలోనే రూ.12,000-15,000 వేతనం అందుతోంది.



ఐటీసీ హోటల్స్

కార్పొరేట్ హోటళ్లు కొన్ని ప్రత్యేకంగా హొటల్ మేనేజ్‌మెంట్ సంస్థలను నెలకొల్పాయి. ఐటీసీ, ఒబెరాయ్ గ్రూప్‌లు యూజీ, పీజీ డిప్లొమా కోర్సులు ఉచితంగా అందిస్తున్నాయి. ప్రతినెలా స్టయిపెండ్ సైతం చెల్లిస్తున్నాయి. గుడ్‌గావ్‌లోని ఐటీసీ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీసీ హెచ్ఎంఐ) హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ట్రెయినింగ్ (హెచ్‌ఎంటీ) ద్వారా వెల్‌కం లీడ్, గ్రాడ్యుయేట్ హాస్పిటాలిటీ, మేనేజ్‌మెంట్ ట్రెయినీ పేర్లతో కోర్సులు నిర్వహిస్తోంది.

వెల్ కం లీడ్ : ఇది మూడేళ్ల డిగ్రీ కోర్సు. ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులు. కోర్సులో చేరినవారు ఎలాంటి ఫీజూ చెల్లించనవసరం లేదు. స్టయిపెండ్ సైతం ఐటీసీ గ్రూప్ చెల్లిస్తుంది. కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకుంటే ఇగ్నో ద్వారా బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (టూరిజం స్టడీస్) డిగ్రీని అందుకోవచ్చు. దీంతోపాటు వెల్‌కం లీడ్ సర్టిఫికెట్, అనుభవ పత్రాన్ని ఐటీసీ జారీ చేస్తుంది. ఈ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

గ్రాడ్యుయేట్ హాస్పిటాలిటీ ప్రోగ్రాం : పూర్తి రెసిడెన్షియల్ విధానంలో ఐటీసీ గ్రాడ్యుయేట్ హాస్పిటాలిటీ ప్రొగ్రాం (జీహెచ్‌పీ) అందిస్తోంది. ఉచితంగా అందించే ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలూ అర్హులే. ఈ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వివరాలు https://www.itchotels.in/hmi/programmes/welcomlead.html లింక్‌లో లభిస్తాయి.

మేనేజ్‌మెంట్ ట్రెయినీ ప్రోగ్రాం : హోటల్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లకు ఈ సంస్థ పలు విభాగాల్లో (కిచెన్, హౌస్ కీపింగ్, సేల్స్ అండ్ మార్కెటింగ్, రెవెన్యూ, ఫైనాన్స్, హెచ్‌ఆర్, ఇంజినీరింగ్) మేనేజ్‌మెంట్ ట్రెయినీ ప్రోగ్రామ్‌లు అందిస్తోంది. దీనికి హోటల్ మేనేజ్‌మెంట్ బ్యాచిలర్ డిగ్రీలో కనీసం 65 శాతం మార్కులు తప్పనిసరి.

ఒబెరాయ్ గ్రూప్

స్టెప్ పేరుతో మూడేళ్ల డిగ్రీ, ఓసీఎల్డీ పేరుతో రెండేళ్ల పీజీ డిప్లొమా కోర్సులను ఒబెరాయ్ గ్రూప్ ఉచితంగా అందిస్తోంది. వీటిని విజయవంతంగా పూర్తిచేసుకున్నవారు ఒబెరాయ్ హోటళ్లలోనే సేవలు అందించవచ్చు.

స్టెప్

సిస్టమేటిక్ ట్రయినింగ్ అండ్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాం (స్టెప్) పేరుతో ఒబెరాయ్ గ్రూప్ ఇంటర్ పూర్తిచేసుకున్నవారికి మూడేళ్ల బ్యాచిలర్ ఆఫ్ టూరిజం స్టడీస్ కోర్సు అందిస్తోంది. ఫ్రంట్ ఆఫీస్, హౌస్ కీపింగ్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, కిచెన్ విభాగాల్లో శిక్షణ ఇస్తారు. స్టెప్ ద్వారా కిచెన్, హోటల్ ఆపరేషన్స్ ప్రొగ్రామ్‌లు అందిస్తున్నారు. కిచెన్ ఆపరేషన్స్‌లో భాగంగా వెస్టర్న్, ఇండియన్ వంటకాలపై తర్ఫీదు ఉంటుంది. బేకరీ, పేస్ట్రీ, కోల్డ్ కిచెన్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. హోటల్ ఆపరేషన్స్ ప్రొగ్రాంలో ఫ్రంట్ ఆఫీస్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, హౌస్ కీపింగ్ విభాగాల్లో ప్రత్యేకమైన శిక్షణ అందిస్తారు. ఏటా అగస్టులో కోర్సు మొదలవుతుంది. కోర్సులో చేరినవారికి ప్రతి నెలా స్టయిపెండ్ చెల్లిస్తారు. వసతి, భోజనం, యూనిఫారం, మెడికల్ ఇన్సూరెన్స్ ఉచితం. మూడేళ్ల కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్నవారికి బ్యాచిలర్ ఆఫ్ టూరిజం స్టడీస్ డిగ్రీని ఇగ్నో ప్రధానం చేస్తుంది. ఒబెరాయ్ గ్రూప్ హోటళ్లలో ఆపరేషన్స్ అసిస్టెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఫిబ్రవరి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు ప్రారంభ సంవత్సరం ఆగస్టు 15 నాటికి 18-20 ఏళ్లలోపు వారు అర్హులు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించాలి. పదో తరగతి ఇంగ్లిష్‌లో 61 శాతం (హౌస్ కీపింగ్ విభాగానికి 51 శాతం) మార్కులు తప్పనిసరి.

వెబ్‌లింక్: http://www.oberoigroup.com/careers/join_us/step.htm

ఓసీఎల్‌డీ

ఒబెరాయ్ సెంటర్ ఆఫ్ లర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఓసీఎల్‌డీ) ద్వారా మేనేజ్‌మెంట్ ట్రెయినీ కోర్సు అందిస్తున్నారు. ఈ కోర్సులో గ్రాడ్యుయేట్లు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. 19-25 ఏళ్లలోపువారు అర్హులు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నవారిని ఎగ్జిక్యూటివ్ హోదాతో ఒబెరాయ్ హోటళ్లలో విధుల్లోకి తీసుకుంటారు. ప్రతి ఏటా జులైలో కోర్సు మొదలవుతుంది. వ్యవధి రెండేళ్లు. పోస్టు గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ప్రొగ్రాం ఇన్ గెస్ట్ సర్వీస్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్, కిచెన్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందిస్తున్నారు. గెస్ట్ సర్వీస్ మేనేజ్‌మెంట్ కోర్సులో భాగంగా అతిథితో ముడిపడి ఉండే ఫుడ్ అండ్ బేవరేజ్, ఫ్రంట్ ఆఫీస్ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఉంటుంది. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్న వారిని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. వీరు కొన్నాళ్లకు ఫుడ్ అండ్ బేవరేజ్ లేదా ఫ్రంట్ ఆఫీస్ విభాగాల్లో మేనేజర్లగా రాణిస్తారు. హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరినవారు శిక్షణ అనంతరం హౌస్ కీపింగ్ ఎగ్జిక్యూటివ్ హోదాతో సేవలందిస్తారు. కొన్నాళ్లకు వీరు ఎగ్జిక్యూటివ్ హౌస్ కీపర్ అవుతారు. కిచెన్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరినవాళ్లు కలినరీ ఆర్ట్స్ (పాకవిద్య)లో ప్రావీణ్యం పొందుతారు. కోర్సు అనంతరం వీరిని కిచెన్ ఎగ్జిక్యూటివ్ గా విధుల్లోకి తీసుకుంటారు. కొన్నాళ్లకు వీరు ఎగ్జిక్యూటివ్ చెఫ్ హోదాతో రాణిస్తారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో యూజీ డిగ్రీ ఉన్నవాళ్లే కిచెన్ కోర్సులో చేరడానికి అర్హులు. ఓసీఎల్డీ సేల్స్ విభాగంలోనూ పీజీ ప్రొగ్రాం అందిస్తోంది. ఈ కోర్సు వ్యవధి 18 నెలలు. వీరిని ఒబెరాయ్ గ్రూప్ సేల్స్ విభాగంలో తీసుకుంటారు. ప్రస్తుతం ఒబెరాయ్ సంస్థల్లో జనరల్ మేనేజర్ హోదాతో సేవలు అందిస్తున్నవారిలో ఎక్కువ మంది ఓసీఎల్డీలో శిక్షణ పొందినవారే.

వెబ్‌లింక్: http://www.oberoigroup.com/careers/join_us/ocld.htm

మరికొన్ని సంస్థలు, పరీక్షలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం), ఔరంగాబాద్ ఆనర్స్ విధానంలో నాలుగేళ్ల బీఏ - హోటల్ మేనేజ్‌మెంట్ / కలినరీ ఆర్ట్స్ కోర్సులు అందిస్తోంది. ఈ సంస్థ హడర్స్ ఫీల్డ్ యూనివర్సిటీ, యూకేతో ఒప్పందం కుదుర్చుకుంది. అభ్యర్థులు ఇండియా/ యూకే కోర్సులు ఎంచుకోవచ్చు. భారత్‌లో అందించే కోర్సులను ఎంచుకుంటే నాలుగేళ్లకూ రూ.18 లక్షల వరకు ఖర్చవుతుంది.

◆ ఇకోలే టలైర్, పుణెలో అంతర్జాతీయ స్థాయిలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందిస్తున్నారు. ఇక్కడ నాలుగేళ్ల హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం, ఏడాది వ్యవధితో అడ్వాన్స్‌డ్ కలినరీ ప్రోగ్రాం అందుబాటులో ఉన్నాయి.

◆ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థకు దేశ వ్యాప్తంగా హైదరాబాద్‌తోపాటు 8 క్యాంపస్‌లున్నాయి. వీటిలో ప్రవేశానికి ఐఐహెచ్‌ఎం ఎలక్ట్రానిక్ కామన్ హాస్పిటాలిటీ అడ్మిషన్ టెస్టు (ఈచాట్) రాయాలి. యూజీ స్థాయి కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

◆ ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ బీహెచ్‌ఎంలో అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు (యూగాట్) నిర్వహిస్తోంది. దీనిద్వారా వైఎస్‌ఆర్ నిథమ్, ఎస్‌ఆర్‌ఎంతోపాటు మరికొన్ని సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది.



'డాన్' గమనం ముగిసింది

పదకొండు సంవత్సరాలపాటు సౌర వ్యవస్థ లోతుల్లోకి వెళ్లి ఎన్నో విశ్వ రహస్యాలను కరతలామలకం చేసిన డాన్ చారిత్రక మిషన్ అర్ధంతరంగా ఆగి పోయింది. రెండు అతిపెద్ద గ్రహశకలాల చుట్టూ పరిభ్రమించిన ఈ వ్యోమనౌక గమనం ఇంధనం అయిపోయిన కారణంగా ఆగిపోయిందని నాసా వెల్లడించింది. 467 మిలియన్ డాలర్ల వ్యయంతో 2007లో డాన్‌ను ప్రయోగించారు. వెస్టా అనే ఓ గ్రహాన్ని, అలాగే మరో సూక్ష్మగ్రహం సెరస్‌ను అధ్యయనం చేయడానికి దీనిని ప్రయోగించారు. అయితే అక్టోబర్ 31, నవంబర్ 1 మధ్య ఈ వ్యోమనౌకతో నాసాకు సంబంధాలు తెగిపోయాయి. డాన్ నుంచి సంకేతాలు ఆగిపోవడానికి కారణాలపై పరిశోధించిన నిపుణులు ఇందులోని హైడ్రాజాయిన్ అనే ఇంధనం అయిపోయిందని నిర్ధారించారు. అర్ధంతరంగా దీని ప్రయాణం ముగిసినప్పటికీ సాంకేతికంగా, ఖగోళపరంగా డాన్ నిరుపమానమైన అంశాలను వెలుగులోకి తెచ్చిందని, ఎన్నో విజయాలకు కేంద్ర బిందువు అయిందని నాసా వెల్లడించింది. వెస్టా, సెరెస్ గ్రహాలకు సంబంధించి డాన్ సేకరించిన వివరాలు మన సౌర వ్యవస్థ ఆవిర్భావ లోతుల్లోకి వెళ్లడానికి, దాని పరిణామక్రమాన్ని నిర్ధారించడానికి ఎంతగానో దోహదం చేశాయని తెలిపింది.

ఆలోచించే సూపర్ కంప్యూటర్

మానవుని మెదడులాగే ఆలోచించే సరికొత్త సూపర్ కంప్యూటర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఈ సూపర్ కంప్యూటర్‌ను బ్రిటన్ మాంచెస్టర్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇటీవలే దీనిని స్విచ్‌ఆన్ చేశారు. మిలియన్-ప్రాసెసర్- న్యూరల్ కోర్ స్పైకింగ్ న్యూరల్ నెట్‌వర్క్ (స్పిన్నకర్) ఆధారంగా పనిచేసే ఈ కంప్యూటర్ సెకనుకు 200 మిలియన్ మిలియన్ల విశ్లేషణలు చేయగలదు. ఇందులో వాడిన ఒక్కో చిప్ 10 కోట్ల ట్రాన్సిస్టర్లు కలిగి ఉంటుంది. ఈ సూపర్ కంప్యూటర్ తయారీకి మొత్తం 30 ఏళ్లు పట్టింది. ఇందులో పరిశోధనకే 20 ఏళ్లు, నిర్మాణానికి మరో పదేళ్లు పట్టడం విశేషం. ఈ సూపర్ కంప్యూటర్‌ను అభివృద్ధి చేసేందుకు మొత్తం రూ.141 కోట్లు ఖర్చయినట్లు పరిశోధకులు తెలిపారు. మానవ మెదడులోని న్యూరాన్స్ లాగే ఈ కంప్యూటర్ స్పందనలు కలిగి ఉంటుందని. ఇలాంటిది ప్రపంచంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. మానవుని మెదడులోని రహస్యాలను ఛేదించి, విశ్లేషించడానికి న్యూరో శాస్త్రవేత్తలకు ఈ సూపర్ కంప్యూటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని వర్సిటీకి చెందిన స్టీవ్ ఫర్బర్ అనే శాస్త్రవేత్త చెప్పారు. అతి తక్కువ శక్తితో రోబోలు కూడా మానవుని వలే మాట్లాడేందుకు, నడిచేందుకు ఈ కంప్యూటర్ దోహదపడుతుందని ఆయన అన్నారు.

భూమికి చందమామలు ముగ్గురు



సౌర కుటుంబంలో ఇప్పటివరకు మన భూమికి న్న ఉపగ్రహం చంద్రుడు ఒక్కడేనని అందరికీ తెలుసు. అయితే మనకు ఉన్నది ముగ్గురు చందమామలు అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పుడున్న చంద్రుడితో పాటు మరో ఇద్దరు చంద్రులు భూమికి నాలుగు లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్నారని హంగేరియన్ ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు. 'లీగ్రేంజ్' పాయింట్ల ఆధారంగా వీటిని పరిశోధకులు కనుగొన్నారు. భూ కక్ష్యలో రెండు వ్యతిరేక దిశల నుంచి సమాన గురుత్వాకర్షణ కలిగి ఉండే చోట్లను స్వీట్ స్పాట్స్ అంటారు. అవే లీగ్రెంజ్ పాయింట్లు. వీటిని ఉపయోగించి భూమి చుట్టూ తిరుగుతున్న కొత్త చంద్రులను పసిగట్టారు.

కొత్త చంద్రుడి వివరాలు..

దుమ్ముతో నిండి ఉండే ఈ చందమామలను 1961లోనే పోలాండ్‌కు చెందిన కాజిమియేజ్ కార్డిలెవ్‌స్కీ అనే శాస్త్రవేత్త గుర్తించారు. అందుకే వీటిని 'కార్డిలెవ్‌స్కీ మేఘాలు' అంటారు.

ఇవి భూమికంటే 9 రెట్లు ఎక్కువ వెడల్పు కలిగి ఉన్నాయి. 15/10 డిగ్రీల వెడల్పుతో అంతరిక్షాన్ని ఆక్రమించాయి.

అంత భారీగా ఉన్నా.. చిన్న చిన్న ధూళి కణాలతో నిండి ఉన్నందున వాటిని ఒక మైక్రోమీటర్‌తో కొలవవచ్చు.

ఈ చంద్రులను సౌరకాంతి తాకినపుడు అవి మనకగా వెలుగుతాయి.

వీటి కక్ష్యలో మార్పులుంటాయ్ !

ఇప్పుడున్న చంద్రుడు భూమికి ఒక నిర్దిష్టమైన కక్ష్యలో తిరుగుతాడు. కానీ, కొత్తగా కనుగొన్న చంద్రులు ఒకే కక్ష్యలో వేల ఏళ్ల పాటు స్థిరంగా ఉండొచ్చు. లేదా వేరే మేఘం కోసం ధూళి కణాలను మార్చుకోవచ్చు. అంటే.. ఒక కక్ష్య నుంచి మరో కక్ష్యలోకి మారుతుందన్నమాట.

బృహస్పతి చుట్టూ డజను చందమామలు

సౌర కుటుంబంలోని అతిపెద్ద గ్రహమైన బృహస్పతి (గురుగ్రహం) చుట్టూ తిరుగుతున్న 12 కొత్త చందమామలను ఖగోళ శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. వాటిలో పదింటి నిర్ధారణను 2018 జూలై 17నే ప్రకటించారు. కొత్తగా గుర్తించిన చందమామల్లో ఒకటి అసాధారణ కక్ష్యలో తిరుగుతోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దాన్ని 'విభిన్నమైనది'గా అభివర్ణించారు.

విశాలాంధ్ర బిజినెస్

212.74 ▲ సెన్సెక్స్ 36,469.43	62.70 ▲ నిఫ్టీ 10,893.65	100 ▲ బంగారం (విజయవాడ) 31,400 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 31,680 ప్రొద్దుటూరు 31,680 22 క్యారెట్లు, 10 గ్రాములు	100 ▲ వెండి (విజయవాడ) 41,800 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,450 ప్రొద్దుటూరు 43,829 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 71.24

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
హీరో మోటార్‌కార్ప్	2,807.25	7.39
మారుతిసుజుకి	6,962.30	4.84
హెచ్‌సీఎల్ టెక్	1,043.85	3.85
ఐషర్ మోటార్స్	20,144.70	3.46
ఏషియన్ పెయింట్స్	1,469.55	3.16

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
వేదాంత	162.15	-17.84
జీ ఎంటర్‌టైన్	354.40	-6.79
ఎస్ బ్యాంక్	185.60	-4.38
ఎస్‌బీఐ	302.70	-3.15
ఐసీఐసీఐ బ్యాంక్	364.90	-2.69

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.08	71.24
యూరో	81.68	81.78
పౌండ్	93.24	93.06
ఆస్ట్రేలియా డాలర్	51.70	51.69
సింగపూర్ డాలర్	52.84	52.81

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,630	33,828
చెన్నై	31,680	33,888
బెంగళూరు	31,200	33,368
ముంబై	32,490	34,748
విజయవాడ	-	34,400
విశాఖపట్నం	31,680	33,800
ప్రొద్దుటూరు	31,680	33,260
ముడి చమురు	61.89	

76 సెషన్లు.. 26 మంది ఆర్థిక మంత్రులు



బడ్జెట్ ప్రసంగాన్ని శ్రద్ధగా వింటున్న సభ్యులు

న్యూఢిల్లీ : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2019-20 సంవత్సరా నికి కేంద్ర బడ్జెట్‌ను కాకుండా ఓట్‌ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టింది. దేశంలో స్వాతం త్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 26 మంది ఆర్థిక మంత్రులు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు 76 బడ్జెట్ సెషన్లు జరిగాయి. బడ్జెట్‌కి సంబంధించి కొన్ని సంప్రదాయాలను పాటిస్తున్నారు. శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు ముగిశాక ఆర్థిక మంత్రి కార్యాలయంలోని బేస్‌మెంట్‌లో ఉన్న ప్రెస్‌లో బడ్జెట్ ప్రతులను ముద్రిస్తారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్ట డానికి వారం ముందుగా ముద్రణ ప్రారంభమవుతుంది. హల్వా తయారీతో బడ్జెట్ ప్రింటింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఆర్థికమంత్రి దాదాపు 100 మంది అధికారులకు, సిబ్బందికి ఈ హల్వా తినిపిస్తారు. ప్రసిద్ధ వ్యక్తులు చెప్పిన సూక్తిని చెప్పిన తరువాత ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. గతంలో మన్మోహన్ సింగ్ తన ప్రసంగానికి ముందు రవీంద్రనాథ్ ఠాగూర్, విక్టర్ హ్యూగో సూక్తులను ఉటంకించగా.. పి చిదంబరం వివేకానంద, తిరరువల్లువారు సూక్తులను ప్రస్తావించారు. వీరికి విరుద్ధంగా ప్రణబ్ ముఖర్జీ కౌటిల్యుడు, షేక్స్పియర్ సూక్తులను ఉటంకించారు. బడ్జెట్‌ను రూపొందించేందుకు దాదాపు ఐదు నెలల సమయం పడుతుంది. గతంలో ఫిబ్రవరి 28న బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. రెండేళ్ల నుంచి మోడీ ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీనే బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఫిబ్రవరి 28న బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఫిబ్రవరి నెలాఖరు వరకూ బడ్జెట్ తయారి ప్రక్రియ కొనసాగేది. కానీ ఇప్పుడు జనవరి చివరి రోజు వరకు మాత్రమే బడ్జెట్ తయారీ కొనసాగుతోంది. కొత్త డేటా ప్రకారం తొలుత కీలక అంశాలకు కేటాయింపులు ముగిసిన తర్వాత ఆర్థిక మంత్రికి అంద జేస్తారు. ఈ వివరాలన్నింటిని మార్పు చేయడానికి వీలులేని నీలం రంగు పేపర్‌లో చేర్చి ఆర్థికమంత్రికి ఇస్తారు. ఆయన దీన్ని పరిశీలించి తిరిగి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. తన దగ్గర ఉంచుకోవడానికి కుదరదు. ఈ నీలం రంగు బడ్జెట్ పేపర్ల సంప్రదాయాన్ని బ్రిటీష్ పార్లమెంటరీ వ్యవస్థ నుంచి తీసుకున్నాం. 1999 వరకు బడ్జెట్‌ను సాయంత్రం 5 గంటలకు ప్రవేశపెట్టేవారు. యశ్వంత్‌సిన్హా ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు 2001 నుంచి బడ్జెట్‌ను ఉదయం 11 గంటలకు ప్రవేశపెట్టే సాంప్రదాయాన్ని ప్రారంభించారు. బడ్జెట్ ప్రసంగం కనీసం ఒక గంటపాటు కొనసాగుతుంది. కానీ 1991లో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఎక్కువ సేపు ప్రసంగించారు. ఆయన ప్రసంగంలో దాదాపు 18,650 పదాలు వాడారు. తరువాత స్థానంలో జైట్లీ నిలిచారు. గత ఏడాది జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో 18,604 పదాలు వాడారు. అతి తక్కువ సమయం బడ్జెట్ ప్రసంగం చేసిన వ్యక్తి హెచ్‌ఎమ్ పాటిల్. 1977లో బడ్జెట్ ప్రసంగంలో భాగంగా పాటిల్ కేవలం 800 పదాలను మాత్రమే వాడారు. పార్లమెంటులో ప్రవేశపెట్టే సమయం వరకూ బడ్జెట్‌కు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తారు. ఫోన్లను ట్యాప్ చేయడం, జామర్స్, స్కానర్స్, రహస్య కెమేరాలను ఉపయోగించడం చేస్తారు. బడ్జెట్ ప్రవేశపెట్టేవరకూ ఎక్కడా ఎటువంటి సమాచారం లీక్ కాకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తారు. 1950 నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. పార్లమెంట్‌లో బడ్జెట్ సమర్పించే వరకూ ఆ శాఖకు సంబంధించిన సిబ్బందిని నార్త్ బ్లాక్ పరిసరాల్లోనే ఉంచుతారు. వారు బయటకు వెళ్లడం, కుటుంబ సభ్యులతో మాట్లాడటం, సెల్ ఫోన్లు వాడటం వంటివి నిషేధం. వారికి వడ్డించే ఆహారాన్ని కూడా పరీక్షిస్తారు. వైద్యులతో పాటు ఇంటిలిజెన్స్ అధికారులు, పోలీసుల భద్రత ఏర్పాటు చేస్తారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఆర్థిక మంత్రి బడ్జెట్ పత్రాలున్న రెడ్ కలర్ లెదర్ బ్యాగ్‌ను పార్లమెంట్ బయట ప్రెస్ ఫోటోకాల్ నిమిత్తం ప్రదర్శిస్తారు. ఈ సంప్రదాయం రాణి విక్టోరియా కాలం నుంచి కొనసాగుతోంది. యశ్వంత్ సిన్హా, ప్రణబ్ ముఖర్జి వాడిన లెదర్ బ్యాగ్‌లు బాగా ప్రాచుర్యం పొందాయి.

బడ్జెట్ కథా కమామిషు..

న్యూఢిల్లీ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొట్టమొదటి బడ్జెట్‌ను 1947 నవంబరు 26న ప్రవేశ పెట్టారు. ఇప్పటి వరకు అత్యధిక బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ నిలిచారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఏకైక మహిళా ఆర్థిక మంత్రి ఇందిరాగాంధీ. మొట్టమొదటి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన తొలి ఆర్థిక మంత్రి ఆర్కే షణ్ముఖం చెట్టి. 1947 నవంబరు 26న ఆయన మొట్టమొదటి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. పది బడ్జెట్‌లను ప్రవేశపెట్టి మొరార్జీ దేశాయ్ ఇప్పటి వరకు అత్యధిక బడ్జెట్లు ప్రవేశపెట్టిన వ్యక్తిగా నిలిచారు. ఆ తర్వాత స్థానాల్లో పి. చిదంబరం(తొమ్మిది), ప్రణబ్ ముఖర్జీ (ఎనిమిది), యశ్వంత్ సిన్హా (ఏడు), యశ్వంత్‌రావు చవాన్ (ఏడు), సీడీ దేశ్‌ముఖ్ (ఏడు), మన్మోహన్ సింగ్ (ఆరు), టీటీ కృష్ణమాచారి (ఆరు) ఉన్నారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఏకైక మహిళా ఆర్థిక మంత్రి ఇందిరా గాంధీ. 1969లో మొరార్జీ దేశాయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయ డంతో ఆ స్థానంలోకి ఇందిర బాధ్యతలు చేపట్టారు. దానితో బడ్జెట్‌ను ఆమె ప్రవేశపెట్టారు. 1998 వరకు బడ్జెట్‌ను ఫిబ్రవరి నెలలోని చివరి పనిదనంలో సాయంత్రం 5 గంట లకు ప్రవేశ పెట్టేవారు. దాంతో బడ్జెట్‌ను బట్టి ధరల్లో మార్పులు చేసుకునేందుకు పన్ను సేకరణ ఏజెన్సీలు, ఇతర బృందాలు రాత్రివేళ్లలో విధులు నిర్వహించేవి. 1999లో అతల్ బిహారీ వాజ్‌పేయ్ ప్రధానిగా, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్పుడు బడ్జెట్ ప్రవేశ పెట్టే సమయంలో మార్పులు జరిగాయి. ఆ సమయంలో యశ్వంత్ సిన్హా ఆర్థిక మంత్రిగా ఉన్నారు. అప్పటినుంచి బడ్జెట్‌ను ఫిబ్రవరి నెలలోని చివరి పనిదినంలో ఉదయం 11 గంటలకు ప్రవేశపెడుతున్నారు. అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రి పదవిలో ఉన్నప్పుడు 2017లో బడ్జెట్ ప్రవేశ తేదీలో మార్పు జరిగింది. ఫిబ్రవరి నెలలోని చివరి పనిదినంలో కాకుండా అదే నెల ఒకటో తేదీనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ఫిబ్రవరి 1వ తేదీనే బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. 2016 వరకు రైల్వే బడ్జెట్‌ను వేరుగా ప్రవేశపెట్టేవారు. 92 ఏళ్ల తర్వాత తొలిసారి 2017లో కేంద్ర బడ్జెట్‌లోనే రైల్వే బడ్జెట్‌నూ కలిపేశారు. అప్పటి నుంచి ఈ ప్రక్రియనే కొనసాగిస్తున్నారు.



అత్యధిక బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్

సాధారణ లాభాలతో ముగిసిన దేశీయ మార్కెట్లు

213పాయింట్లతో సెన్సెక్స్



ముంబై: దేశీయ మార్కెట్లు శుక్రవారం సాధారణ లాభాలతో ముగిశాయి. మధ్యంతర బడ్జెట్ నేపథ్యంలో అమాంతం ఎగసిన సూచీలు ఆ తర్వాత మదుపర్ల లాభాల స్వీకరణ, కీలక రంగాల షేర్లు కుదేలవడంతో అంతే వేగంగా వెనక్కివచ్చాయి. అయితే లాభాలను మాత్రం నిలబెట్టుకోగలిగాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 200 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 10,900మార్క్‌కు చేరువైంది. బడ్జెట్ అంచనాలతో ఈ ఉదయం దేశీయ మార్కెట్లు ఉత్సాహంగా ప్రారంభ మయ్యాయి. సెన్సెక్స్ 150 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడింగ్‌ను ఆరంభించింది. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం అనంతరం ఒక్కసారిగా సూచీలు దూసు కెళ్లాయి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో సెన్సెక్స్ 450 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడవ్వగా.. నిఫ్టీ 10,900 పైన కదలాడింది. అయితే సూచీల జోరు ఎంతోసేపు నిలువలేదు. వేదాంతా, డీహెచ్‌ఎఫ్‌ఎల్ లాంటి దిగ్గజ షేర్లు భారీగా నష్టపోవడం, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు భారీ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 30 పాయింట్ల స్వల్ప లాభంతో ఫ్లాట్‌గా కొనసాగింది. చివరకు ఆటోమొబైల్, ఎనర్జీ, ఫార్మా రంగాల షేర్ల అండతో సూచీలు సాధారణ లాభాలను దక్కించుకు న్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 213 పాయింట్లు లాభపడి 0.59శాతంతో 36,469 వద్ద, నిఫ్టీ 63 పాయింట్ల లాభంతో 0.58శాతంతో 10,894 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.25గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో హీరో మోటార్స్, మారుతి సుజుకీ, ఐషర్ మోటార్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు లాభ పడగా.. వేదాంతా, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, యస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టోయాయి. బడ్జెట్ అంచనాల మేరకు ద్రవ్యలోటు 2018-19 సంవత్సరానికి 3.3శాతంగా నిర్ణయించింది. బిఎస్ఇ ఆటో, కన్జ్యూమర్‌డ్యూరబుల్స్, ఎఫ్ఎమ్‌సిజి, రియాల్టీ సూచీలు 4శాతం పెరిగాయి.

పడిపోయిన రూపాయి విలువ

ముంబై: బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కొద్దిసేపటి ముందు రూపాయి విలువ పతనమైంది. శుక్రవారం ఉదయం ట్రేడింగ్ ఆరంభమయ్యాక నిలకడగా ఉన్న రూపాయి విలువ ఆ తర్వాత 9 పైసలు పతనమైంది. దీంతో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.71.17కు చేరింది. మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్ట నుండటం, ముడి చమురు ధరలు పెరగడం వంటివి ప్రధాన కారణాలుగా నిలిచాయి. బడ్జెట్‌లో భారీ పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందనే అంచనాలతో రూపాయి బలహీనపడింది. గురవారం రూపాయి డాలర్‌తో పోలిస్తే 4పైసలు బలపడి రూ.71.08 వద్ద ముగిసింది. గురువారం మార్కెట్లలో ఎఫ్ఐఐలు భారీ ఎత్తున కొనుగోళ్లు జరిపారు. రూ.3వేల కోట్లకు పైగా విదేశీ పెట్టుబడిదారులు కొనుగోళ్లు జరిపారు.

జనవరిలో రూ.లక్ష కోట్లకు జీఎస్‌టీ వసూళ్లు



న్యూఢిల్లీ: రెండు నెలల తర్వాత వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు బలంగా పుంజుకున్నాయి. జనవరిలో మళ్లీ రూ.లక్ష కోట్ల మైలురాయిని అధిగమించాయి. 'మొత్తం స్థూల జీఎస్‌టీ ఆదాయం రూ.లక్ష కోట్లు దాటింది. డిసెంబరులో ఇవి రూ.94,275 కోట్లుగా ఉన్నాయి. 2017 డిసెంబరులో జీఎస్‌టీ వసూళ్లు రూ.89,825 కోట్లుగా నమోదయ్యాయి' అని ఆర్థిక శాఖ ట్వీట్ చేసింది. ఒక నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్లను దాటడం ఇది మూడోసారి. ఇంతకు ముందు గతేడాది ఏప్రిల్, అక్టోబరులో ఈ స్థాయిని అధిగమించాయి. జీఎస్‌టీ మండలి పన్ను రేట్లను భారీగా తగ్గించినప్పటికీ.. మెరుగైన ఆర్థిక వ్యవస్థ దన్నుగా నిలిచిందని ఆర్థిక మంత్రి పీయూశ్ గోయల్ ట్వీట్ చేశారు. గతేడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.03 లక్షల కోట్లుగా, మే (రూ.94,016 కోట్లు), జూన్ (రూ.95,610 కోట్లు), జులై (రూ.96,483 కోట్లు), ఆగస్టు (రూ.93,960 కోట్లు), సెప్టెంబరు (రూ.94,442 కోట్లు), అక్టోబరు (రూ.1,00,710 కోట్లు), నవంబరు (రూ.97,637 కోట్లు)గా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జనవరి) మధ్య జీఎస్‌టీ వసూళ్ల ద్వారా ప్రభుత్వం రూ.9.71 లక్షల కోట్లు సమీకరించింది. బడ్జెట్‌లో ప్రభుత్వం వార్షిక జీఎస్‌టీ వసూళ్ల లక్ష్యాన్ని రూ.13.48 లక్షల కోట్లుగా నిర్దేశించుకుంది.

నెక్టన్‌తో రాక్‌సాల్ట్ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: విస్తరణ బాటలో ఉన్న అంతర్జాతీయ గేమింగ్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ నెక్టన్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న రాక్‌సాల్ట్ ఇంటరాక్టివ్ సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా నెక్టన్ బ్రాండెడ్ హెచ్‌టిఎంఎల్ 5 గేమ్స్ ప్లాట్‌ఫామ్‌పై రాక్‌సాల్ట్ పనిచేస్తుందని నెక్టన్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ జేన్ ర్యాన్ వెల్లడించారు.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ చేయూత

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలో అతిపెద్ద హౌసింగ్ సంస్థగా పేరొందిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ నేషనల్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బి) నుంచి రూ.175.56 కోట్ల సిఎల్ఎస్ఎస్ సబ్సిడీని అందుకుంది. ఈ మొత్తాన్ని ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంవై) పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సబ్సిడీని కస్టమర్ల రుణ ఖాతాకు జమచేయబడి వారి నెల వారీ చెల్లించాల్సిన ఇఎంఐ మొత్తాన్ని తగ్గిస్తుంది. డిసెంబర్ 31 నాటికి ఆధార్ ప్రభుత్వ సిఎల్ఎస్ఎస్ సబ్సిడీని అందుకుని దాదాపు 10వేల కుటుంబాలకు అందజేసింది.

డాబర్ ఇండియా ఆదాయం రూ.2,274 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.367.21 కోట్ల నికర లాభం ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం రూ.333 కోట్లతో పోల్చితే వృద్ధి 10.26 శాతంగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం 11.88 శాతం వృద్ధితో రూ.2,032.78 కోట్ల నుంచి రూ.2,274.46 కోట్లకు చేరుకుంది. మొత్తం వ్యయాలు రూ.1,616.63 కోట్ల నుంచి రూ.1,815.41 కోట్లకు చేరుకున్నాయి. కన్స్యూమర్ కేర్ వ్యాపారం నుంచి రాబడి 12.66 శాతం వృద్ధితో రూ.1,696.66 కోట్ల నుంచి రూ.1,911.56 కోట్లకు చేరుకుంది. ఆహార వ్యాపారం నుంచి రాబడి 7.55 శాతం పెరిగి రూ.226.60 కోట్లకు చేరింది. కంపెనీ లాభాలు పెరిగిన నేపథ్యంలో గురువారం బీఎసఈలో డాబర్ ఇండియా షేరు ధర 2.88 శాతం వృద్ధితో రూ.443.25 వద్ద ముగిసింది.

తగ్గిన హీరో మోటో లాభం

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో హీరో మోటోకార్ప్ రూ.769.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.805.43 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 4.5 శాతం తక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.7,424.23 కోట్ల నుంచి రూ.8,052.46 కోట్లకు చేరింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.6,296.07 కోట్ల నుంచి 9.81 శాతం పెరిగి రూ.6,914.04 కోట్లకు చేరాయి. అక్టోబరు-డిసెంబరు మధ్యలో కంపెనీ మొత్తం 17,98,905 వాహనాల్ని విక్రయించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ విక్రయించిన 17,09,107 వాహనాలతో పోలిస్తే ఇవి 5.25 శాతం ఎక్కువ. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.55 మధ్యంతర డివిడెండును ఇచ్చేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. బీఎస్ఈలో షేరు 0.12 శాతం లాభంతో రూ.2,612.05 వద్ద ముగిసింది.

ఏప్రిల్ 2 నుంచి గూగుల్ ప్లస్ సేవల నిలిపివేత..!

ముంబై: సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్ గతేడాది డిసెంబర్‌లో తన గూగుల్ ప్లస్ సేవలను నిలిపివేయనున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. కాగా చెప్పినట్లుగానే గూగుల్ ఇకపై గూగుల్ ప్లస్ సేవలను నిలిపివేయనుంది. వచ్చే ఏప్రిల్ 2వ తేదీ నుంచి గూగుల్ ప్లస్ ఇక పనిచేయదు. అలాగే యూజర్లకు చెందిన గూగుల్ ప్లస్ అకౌంట్లు, వారు క్రియేట్ చేసిన పేజీలు, అందులో ఉండే కంటెంట్‌ను కూడా గూగుల్ డిలీట్ చేయనుంది. కానీ తమ సమాచారం కావాలనుకున్న వారు గూగుల్ ప్లస్‌లో నుంచి ఆ డేటాను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని గూగుల్ అందిస్తున్నది. కాకపోతే ఏప్రిల్ 2వ తేదీ వరకు మాత్రమే అందుకు అవకాశం ఉంటుంది. అయితే గూగుల్ ఫొటోస్‌లో బ్యాకప్ అయి ఉన్న ఫొటోలు, వీడియోలు మాత్రం డిలీట్ అవ్వవని గూగుల్ తెలిపింది.

విజ్ఞానం

హెచ్ఐవీ కణాలను లెక్కించే పరికరం



ప్రపంచాన్ని భయపెట్టిస్తున్న హెచ్ఐవీని నయంచేసే మందులను కనుగొనేందుకు చాలా మంది శాస్త్రవేత్తలు అనేక ప్రయో గాలు చేస్తున్నారు. అయితే, ఆ మందులను వాడినప్పుడు హెచ్ఐవీ కణాలు ఏ మేర తగ్గుతున్నాయో తెలుసుకునేందుకు జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు ఒక కొత్త పరికరాన్ని రూపొందించారు. సాధారణంగా హెచ్ఐవీ వైరస్ సోకిన కణజాలాల సమూహాన్ని హెచ్ఐవీ రిజర్వాయర్‌గా పిలుస్తారు. ఇందులోని కణాలు నిద్రాణవ్యవస్థలో ఉంటాయి తప్ప వైరస్‌ను వ్యాపింపజేయలేవు. తాజాగా కనుగొన్న ఈ పరికరం హెచ్ఐవీ రిజర్వాయర్‌లోని కణజాలాల సంఖ్యను ఎప్పటికప్పుడు కచ్చితత్వంతో గుర్తిస్తుందని పరిశోధకులు వెల్లడించారు.

అల్పాహారంతో బరువు తగ్గరు!



ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తీసుకుంటే బరువు తగ్గొచ్చు. అదే అల్పాహారం ఎగ్గొడితే బరువు పెరిగే అవకాశాలెక్కువ. ఇప్పటివరకు పలు అధ్యయనాలు చెప్పిన మాట ఇది. కానీ బరువు పెరుగుదలపై బ్రేక్‌ఫాస్ట్ పెద్దగా ప్రభావమేమీ చూపదని మెల్‌బోర్న్‌కు చెందిన మోనాష్ యూనివర్సిటీ పరిశోధకులు కనుగొన్నారు. ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ చేసే వారు, చేయని వారు తీసుకునే కేలరీలు దాదాపుగా సమానమేనని వారి అధ్యయనంలో తేలింది. అలాగే వారి బరువులో తేడా కూడా కేవలం 400 గ్రాములు మాత్రమేనని వెల్లడించారు.

జ్యువెలరీ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రారంభించిన ఒరాఫో

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: విస్తృతశ్రేణి డిజైనర్ జ్యువెలరీతో జ్యువెలరీ ప్రదర్శన, అమ్మకంను ఒరాఫో ప్రారంభించింది. అన్ని వయసుల భారతీయ మహిళల అభిరుచులకు అనుగుణంగా ఆభరణాలను అందించాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శనను ప్రారంభించినట్లు ఒరాఫో డైరెక్టర్ కళ్యాణ్ రామ్ తెలిపారు. ఒరాఫో ప్రత్యేకతమైన 92.5 స్టెర్లింగ్ సిల్వర్ జ్యువెలరీని అన్ని వెరైటీల ఆభరణాలనటువంటి టెంపుల్ జ్యువెలరీ, ప్రెసియస్ స్టోన్ జ్యువెలరీ, సీజెడ్ స్టడెడ్ జ్యువెలరీ, ఇపోర్టెడ్ సిల్వర్ క్యాజువల్ వేర్, స్వరోవ్స్కీ కలెక్షన్స్‌తో పాటు పురుషుల కలెక్షన్స్, కిడ్స్ కలెక్షన్స్ అందిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరికి అవసరాలకూ తగినట్లుగా అత్యంత అందుబాటు ధరలో ఎక్స్‌క్లూజివ్ బ్రైల్ కలెక్షన్స్ సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. తొలిసారిగా ప్రకాశవంతమైన డైమండ్ కలెక్షన్స్ 'లిటిల్ స్టార్స్ డైమండ్ కలెక్షన్స్'గా పరిచయం చేస్తున్నామన్నారు. వినియోగదారుల కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బొటిక్స్ తెరవున్నామని, త్వరలోనే హైదరాబాద్, విశాఖపట్నంలో మరో రెండు బొటిక్స్ తెరవనున్నట్లు కళ్యాణ్ రామ్ చెప్పారు.



హైటెక్స్‌లో ఆక్వా ఎక్స్ ఇండియా ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆక్వా ఎక్స్ ఇండియా-2019 జాతీయ ఎగ్జిబిషన్‌కు హైదరాబాద్ మరోసారి వేదికైంది. చేపలపిల్లల ఉత్పత్తి, బ్రీడ్ ఎంపిక, ఫిషరీస్ రంగంలో యువకులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా మూడు రోజుల పాటు జరిగే ఆక్వా ఎక్స్‌పోను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తలసాని మాట్లాడుతూ మత్స్యకారులకు చేప పిల్లలను ఉచితంగా ఇవ్వడంతో పాటు 75 శాతం సబ్సిడీతో వాహనాలు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తైన తర్వాత ఫిషరీస్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మత్స్య శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, చేపల పెంపకంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటే మరిన్ని లాభాలు సాధించవచ్చని అన్నారు. ఫిషరీస్ రంగంలోకి రావాలనుకునే యువకులకు ఈ సదస్సులో శిక్షణ ఇస్తున్నామని ఇండియా ఫిషరీస్ సొసైటీ చైర్మెన్ రామచంద్ర రాజు చెప్పారు. ఆక్వా ఎక్స్‌పోకు 60 వేల మంది హాజరు కానున్నారు. వివిధ దేశాల ప్రతినిధులు, ఫిషరీస్ ఎగ్జిబిటర్లు పాల్గొంటారు.

'బీమా'లోకి తపాలా శాఖ

న్యూఢిల్లీ: ఇప్పటికే పేమెంట్ బ్యాంక్ సేవలు ఆరంభించిన ప్రభుత్వరంగ సంస్థ తపాలాశాఖ..తాజాగా జీవిత బీమా రంగంలోకి అడుగుపెట్టబోతున్నది. ఇందుకోసం ప్రత్యేక సంస్థను ఆరంభించనున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల ఏర్పాటుకు సంబంధించి త్వరలో క్యాబినెట్‌ను నోట్ పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. తొలి విడుతలో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని, రెండో విడుతలో పూర్తి స్థాయిలో బీమా పనులను ప్రారంభించనున్నట్లు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ) రెండో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఈ విషయాలు వెల్లడించారు.

స్మార్ట్‌ఫోన్‌లో ఈ ఫీచర్లనూ ఉపయోగించుకోవచ్చు

ఈ రోజుల్లో చాలామంది సగటున నాలుగు గంటల స్మార్ట్‌ఫోన్ మీద కాలం గడుపుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే చాలామంది స్మార్ట్‌ఫోన్‌లో అనవసరమైన విషయాలనే ఎక్కువ సెర్చ్ చేస్తుంటారు. సోషల్ మీడియా వచ్చినప్పటి నుండి ఇది మరింతగా సమయాన్ని వృధా చేస్తోంది. చాలా మంచి ఫీచర్లు ఉన్నా అవి ఎలా ఉపయోగించుకోవాలో తెలియడం లేదు. ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే అవి ఉన్నాయనే విషయం కూడా చాలామందికి తెలియదు. అలాంటి కొన్ని ఫీచర్ల గురించి తెలుసుకుందాం.



కారులో వెళుతున్నప్పుడు

మీరు ఎప్పుడైనా కారులో ప్రయాణం చేస్తున్నప్పుడు రూటు సరిగా తెలియకుంటే గూగుల్ మ్యాప్‌ని ఆశ్రయిస్తుంటారు. అయితే అది చీకటిగా ఉన్న సమయంలో డార్క్ లోనికి వెళుతుంది. ఇలా డార్క్ లోకి వెళ్లినప్పటికీ మీరు వెలుతురు ఉండే విధంగా సెట్ చేసుకోవచ్చు. దీని కోసం మీరు Hudway ని మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే సరిపోతుంది.

బార్ కోడ్స్



మీరు ఎక్కడైనా షాపింగ్ చేసే సమయంలో అక్కడ కనిపించే బార్ కోడ్ వివరాలను మీ మొబైల్ ద్వారా తెలుసుకోవచ్చు. USPS, UPS, and FedEx systemsలో మీరు మీ మొబైల్ స్కాన్ చేసినప్పుడు ఆ వివరాలు మీ మొబైల్ లోకి వస్తాయి. దీంతో పాటు RedLaser యాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు.

టెలిస్కోప్

మీ ఫోన్‌ని టెలిస్కోప్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు. ఫోన్ లెన్స్ నేరుగా టెలిస్కోప్‌కు పెట్టినప్పుడు మీరు ఇమేజ్‌ని క్యాప్చర్ చేస్తుంది.



హార్ట్ రేట్

Instant Heart Rate ఉపయోగించి మీరు మీ హార్ట్ రేట్‌ని తెలుసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండి సిస్టంలలో అందుబాటులో ఉంది.

డిజిటైజ్ నెగిటివ్స్

HELMUT Film Scanner యాప్స్ ఉపయోగించి దీనిని తెలుసుకోవచ్చు.




ఫాంట్స్‌ని కెమెరా ద్వారా..

HELMUT Film Scanner ఉపయోగించి మీరు ఫాంట్స్, ప్లేస్, లాంటి వివరాలను టెక్స్ ద్వారా తెలుసుకోవచ్చు.

వీడియో రికార్డింగ్

ఇది అందరికీ తెలిసిన అంశమే. మీ స్మార్ట్ ఫోన్ ఉపయోగించి ఫోటోలు వీడియోలు తీసుకోవచ్చు.



రూలర్

Ruler App ఉపయోగించి మీరు మీ కెమెరా ద్వారా అన్ని రకాల కొలతలను తెలుసుకోవచ్చు.

థర్మల్ కెమెరా

టీవీ కెమెరాను మీ ఫోన్ కి అటాచ్ చేయడం ద్వారా మీరు థర్మల్ ఇమేజ్‌ని చూడవచ్చు. మీ చుట్టుపక్కల ఏముందో వెంటనే పసిగట్టవచ్చు.

మైక్రోస్కోప్

మీ కెమెరాను ఒక్కోసారి మైక్రోఫోన్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు.

సైబర్ క్రైమ్ నుంచి మీ డేటా కాపాడుకునేందుకు టిప్స్..



మనదేశంలో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సాంకేతికతను ఆధారంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఈ సైబర్ మోసాలు అధికమవడంతో ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరపాలంటే చాలామంది ఆలోచనలో పడుతున్నారు. దాదాపు 24శాతం మంది భారతీయ వినియోగదారులు ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నారని ఒక నివేదిక వెల్లడించింది. అయితే కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వాటికి చెక్ పెట్టొచ్చు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా దిగువన పేర్కొన్న చిట్కాలను పాటించవచ్చు.

లేటెస్ట్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్......

ఇంటర్నెట్ అంటేనే వైరస్ మాల్‌వేర్, స్పామ్, స్పైవేర్ అని పిలుచుకునే వైరస్‌లు కంప్యూటర్‌ను నాశనం చేయడమే కాక వ్యక్తిగత సమాచారాన్నీ దొంగిలిస్తాయి. అందుకే ఎప్పటికప్పుడు లేటెస్ట్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్‌తోపాటు ఆపరేటింగ్ సిస్టమ్‌ను అప్‌డేట్ చేయాలి



సింపుల్ పాస్‌వర్డ్స్ ఎప్పుడూ పెట్టుకోకూడదు......

సింపుల్ పాస్‌వర్డ్స్ ఎప్పుడూ పెట్టుకోకూడదు. అప్పర్, లోయర్ కేస్‌లతోపాటు నెంబర్లు, సింబల్స్ జోడించడం సురక్షితం. ఒకటే పాస్‌వర్డ్ అన్నింటికీ ఉంచడం కాకుండా ప్రతిదానికీ విభిన్నంగా ఎంచుకోవాలి. పాస్‌వర్డ్‌ను సేవ్ చేయకపోవడం ఉత్తమం.

ఈ-మెయిల్స్ జోలికి వెళ్లొద్దు...

కాన్ఫిడెన్షియల్ సమాచారం అడిగే ఈ-మెయిల్స్ జోలికి అస్సలు వెళ్లొద్దు. పేమెంట్ కంపెనీలేవీ మీ వ్యక్తిగత చెల్లింపుల సమాచారం అడుగవు. మీకు నమ్మకం లేని ఈ-మెయిల్స్‌ను అసలు తెరవద్దు. ఫ్లాషీయుఆర్ఎల్స్, బటన్స్ క్లిక్ చేయకండి. ఇన్‌బాక్స్‌లోనే స్పామ్ ఫిల్టర్స్ పెట్టుకోవడం మంచిది.

ఫ్రీవై-ఫై వాడకపోవడం మంచిది...

ఉచిత వై-ఫై టర్మినల్స్ వాడకపోవడం మంచిది. అలాగే పబ్లిక్ ఇంటర్నెట్ కనెక్షన్స్‌తో పాస్‌వర్డ్స్ అప్‌డేట్ చేయొద్దు. బ్యాంకింగ్ లావాదేవీలు చేసేప్పుడు ఒరిజినల్ బ్యాంకింగ్ యాప్స్‌ను మాత్రమే వినియోగించండి.

నమ్మకమైన సోర్స్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్.....


ఆన్‌లైన్‌లో ఫ్రీగా వస్తున్నాయని కాకుండా, నమ్మకమైన సోర్స్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాడ్ బ్లాకింగ్ సాఫ్ట్‌వేర్‌తోపాటు స్పైవేర్ డిటెక్షన్ ప్రోగ్రామ్‌నూ రన్ చేయడం వల్ల ఆన్‌లైన్ మోసాల బారినపడకుండా కాపాడుకోవచ్చు.

ఒకే క్రెడిట్ కార్డు/డెబిట్ కార్డు వినియోగించడం వల్ల.....

ఆన్‌లైన్‌లో ఒకే క్రెడిట్ కార్డు/డెబిట్ కార్డు వినియోగించడం వల్ల నష్టపోయే అవకాశాలు చాలా తక్కువ. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసిన వెంటనే మీ బ్యాంక్, క్రెడిట్/డెబిట్ కార్డు, మర్చంట్ సైట్‌ల నుంచి తప్పనిసరిగా లాగ్‌ఔట్ అవ్వాలి. మీ కంప్యూటర్ లేదా స్మార్ట్ స్మార్ట్‌ఫోన్‌లో బ్యాంకుల పిన్ లేదా పాస్‌వర్డ్స్ సేవ్ చేయకండి.

ఇన్‌బాక్స్‌తో నెట్‌లో వెబ్ పేజీల షేరింగ్ సులువు

జీమెయిల్ ఉంటే చాలు. క్లౌడ్ స్టోరేజీని వాడుకోవచ్చు. మొబైల్‌లో తీసిన ఫొటోలను ఒకచోట సింక్ చేసి సులభంగా షేర్ చేస్తున్నాం. ఇలా ఒకటా... రెండా? ఎన్నో సేవల్ని చిటికెలో యాక్సెస్ చేస్తున్నాం. ఇప్పుడు ఇదే కోవలోకి మరో క్రోమ్ వెబ్ స్టోర్ ఎక్స్‌టెన్షన్ వచ్చి చేరింది. అదే Inbox by Gmail. దీంతో ఇంటర్‌నెట్‌లో వెబ్ పేజీలను సులువుగా షేర్ చేయవచ్చు. బుక్‌మార్క్ మాదిరిగానే లింక్‌లను భద్రంగా జీమెయిల్‌లోనే గుత్తగా పెట్టుకోవచ్చు. మీరు జీమెయిల్ అప్‌డేటెడ్ వెర్షన్ 'ఇన్‌బాక్స్'ని వాడుతుంటే, ఈ ఎక్స్‌టెన్షన్‌ని వాడేందుకు అర్హులు. ముందుగా ఇన్‌బాక్స్‌లోకి లాగిన్ అయ్యి క్రోమ్ వెబ్ స్టోర్‌లోకి వెళ్లి ఎక్స్‌టెన్షన్‌ని క్రోమ్‌కి జత చేయండి. దీంతో అడ్రస్‌బార్ పక్కనే ఇన్‌బాక్స్ ఐకాన్ గుర్తు వస్తుంది. దానిపై క్లిక్ చేస్తే డ్రాప్‌డౌన్ మెనూలో Save to INBOX, SHARE VIA EMAIL ఆప్షన్లు కనిపిస్తాయి. ఇక మీరు క్రోమ్‌లో వెబ్ విహారం చేస్తున్నప్పుడు ఏదైనా వెబ్ పేజీని ఇన్‌బాక్స్‌లో సేవ్ చేయాలంటే... ఆ పేజీని ఓపెన్ చేసి 'సేవ్ టు ఇన్‌బాక్స్'పై క్లిక్ చేస్తే చాలు. ఇన్‌బాక్స్‌లో ట్రిప్స్, ఫైనాన్స్, సోషల్, అప్‌డేట్స్, ప్రోమోస్ జాబితాలోనే Saved పేరుతో ప్రత్యేక విభాగం అదనంగా జత అవుతుంది. సేవ్ చేసిన అన్ని లింక్‌లనూ దాంట్లోకి వెళ్లి బ్రౌజ్ చేసి చూడొచ్చు. ఒకవేళ జాబితా నుంచి లింక్‌లను తొలగించాలంటే లింక్ చివర్లో కనిపించే మూడు చుక్కలపై క్లిక్ చేస్తే డ్రాప్ డౌన్ మెనూ వస్తుంది. దాంట్లోని remove from saved ఆప్షన్‌ని క్లిక్ చేయండి. సరాసరి ఏవైనా వెబ్ లింక్‌లను మెయిల్ నుంచే షేర్ చేయాలంటే అడ్రస్‌బార్‌లోని గుర్తుపై క్లిక్ చేసి 'షేర్ వయా ఈమెయిల్'పై క్లిక్ చేయండి. ఇన్‌బాక్స్‌లో వెబ్ పేజీ టైటిల్, లింక్‌తో కొత్త కంపోజ్ మెయిల్ ఓపెన్ అవుతుంది. ఇంకేముందీ... మెయిల్ అడ్రస్‌లు, విషయాన్ని టైప్ చేసి సెండ్ చేయడమే! మీరు వాడుతున్న అన్ని జీమెయిల్ ఐడీలను ఎక్స్‌టెన్షన్‌కి జత చేసేందుకు Add Account ఆప్షన్ కూడా ఉంది. డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/MnJkMM



కంగనపై ఎటాక్ చేయడం బాధిస్తోంది



దర్శకుడు క్రిష్ తమ సినిమా 'మణికర్ణిక'కు నష్టం కల్గిస్తున్నారని నిర్మాత కమల్ జైన్ అన్నారు. ఆయన తాజాగా జరిగిన మీడియా సమావేశంలో నటి కంగనా రనౌత్‌కు మద్దతుగా మాట్లాడారు. క్రిష్‌పై విమర్శలు గుప్పించారు. 'మణికర్ణిక' సినిమా 70 శాతం షూటింగ్ తనే చేశానని ఇటీవల కంగన అన్న వ్యాఖ్యలపై క్రిష్ స్పందించిన సంగతి తెలిసిందే. ఆమె చెబుతోంది అబద్ధమని, సినిమా ఎడిటింగ్ సమయంలో చాలా మూర?ంగా ప్రవర్తించారని.. మిగిలిన నటీనటుల పాత్రల్ని కట్ చేశారని క్రిష్ అన్నారు. దీనిపై కొన్ని రోజులుగా పెద్ద చర్చే నడుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా కమల్ జైన్ మాట్లాడుతూ.. "క్రిష్ తను చేయని పనికి కూడా క్రెడిట్ అడగడం చాలా బాధాకరం. స్టూడియో, నేను కలిసి క్రెడిట్ ఎవరికి ఇవ్వాలనే విషయాన్ని నిర్ణయించాం. సినిమా మొదటి నుంచి తుది వరకు కష్టపడ్డ కంగనను అందరూ ఎటాక్ చేయడం బాధిస్తోంది. కంగన ఏ నిర్ణయం తీసుకున్నా.. ప్రొడక్షన్ టీంను సంప్రదించే తీసుకున్నారు. సినిమా ప్రశంసలు అందుకుని, బాక్సాఫీసు వద్ద విజయం సాధించిన తర్వాత క్రిష్ మీడియా ముందుకు వచ్చారు. మా సినిమాకు నష్టం కల్గించడానికి ఆయన ఇలా చేస్తున్నారు. ఆయన మాట్లాడేది నిజమైతే, ఆధారాలు ఉంటే ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకుని నిరూపించుకోకూడదు. క్రిష్‌కు చెప్పకుండా మేం ఏమీ చేయలేదు. అలాంటిది ఇప్పుడు ఆయన ఈ విషయాన్ని రచ్చ చేయడం బాధాకరం" అని పేర్కొన్నారు. ఇదే వివాదం గురించి చిత్రానికి కథ అందించిన ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఇటీవల స్పందించారు. "మణికర్ణిక' సినిమా నా సినీ కెరీర్‌లో చాలా ముఖ్యమైంది. కాబట్టి ఈ సినిమాను వివాదాలు చుట్టుముట్టడం నాకు ఏ మాత్రం సంతోషం కాదు. ఈ వివాదం ఇక్కడితో ఆగిపోవాలని, సినిమా చక్కగా ఆడాలని ఆశిస్తున్నా. క్రిష్, కంగన ఇద్దరూ సమానంగా కష్టపడ్డారు" అని ఆయన చెప్పారు.

నాపై కోపంగా ఉన్నారా? ఆధారాలు కావాలి : రష్మిక

'ఛలో' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించిన రష్మిక ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'గీత గోవిందం', 'దేవదాస్' చిత్రాలతో గత ఏడాది మంచి హిట్లు అందుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'డియర్ కామ్రేడ్'లో నటిస్తు న్నారు. నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల తెరకెక్కించనున్న 'భీష్మ' చిత్రంలో నటించను న్నారు. మరోపక్క ఆమె 'యజమాన', 'పొగరు' అనే కన్నడ చిత్రాల్లోనూ కథానాయిక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఈ మధ్య రష్మిక వరుసగా తెలుగు సినిమాలనే ఎంచుకుంటున్నారని, కన్నడ చిత్రాలకు సంతకం చేయడం లేదని ఓ వెబ్‌సైట్ రాసింది. 'రష్మిక విషయంలో అప్‌సెట్ అయిన కన్నడ చిత్ర పరిశ్రమ' అనే శీర్షికతో వార్తను ప్రచురించింది. దీన్ని చూసిన రష్మిక ఆ వెబ్‌సైట్‌ను తిరిగి ప్రశ్నించారు. తన సొంత చిత్ర పరిశ్రమ తనపై కోపంగా ఉండటం ఏంటని అన్నారు. ఎవరు కోపంగా ఉన్నారో చెప్పాలని అడిగారు. 'ఎవరు ఇలా అన్నారు? (వార్తను ఉద్దేశించి). ఇలా అడుగుతున్నానని నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి.. కానీ తెలుసుకోవాలని నాకు ఆతృతగా ఉంది. నాకు నేరుగా మెసేజ్ చేయండి. సాధారణంగా నేను ఇలాంటివి పట్టించుకోను. ఎందుకంటే నా చిత్ర పరిశ్రమ గురించి మీరు ఇలా రాయడం, వారు నాపై కోపంగా ఉన్నారని చెప్పడంలో అర్థం లేదు. నేను దీన్ని నమ్మను. నాకు ఆధారాలు కావాలి. ఇవ్వండి.. నాకు నేరుగా మెసేజ్ చేయండి' అంటూ కొంటెగా నవ్వుతున్న ఎమోజీని రష్మిక ట్వీట్ చేశారు.





ఎన్టీఆర్ శాసించాడు : వర్మ



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ప్రేక్షకులలో ఆసక్తి కలిగేలా స్టేట్మెంట్స్ ఇస్తున్నాడు. ఇప్పటివరకూ క్రిష్ - నందమూరి బాలకృష్ణ చేపట్టిన ఎన్టీఆర్ బయోపిక్‌ను పరోక్షంగా టార్గెట్ చేసిన వర్మ ఈసారి మాత్రం డైరెక్ట్‌గా ఎటాక్ మొదలు పెట్టాడు. తానే తెరకెక్కిస్తున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్' ట్రైలర్ ఎప్పుడు రిలీజ్ చేయాలన్న విషయాన్ని స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ తనకు శాసించారని ట్వీట్ చేశాడు. .'లక్ష్మీస్ ఎన్టీఆర్' థియట్రికల్ ట్రైలర్ ఎప్పుడు రిలీజ్ చేయబోయేది 'ఎన్టీఆర్ మహానాయకుడు' రిలీజ్ డేట్‌ను ప్రకటించటంపై ఆధారపడి ఉంది. మహానాయకుడు సినిమా రిలీజ్ డేట్ ప్రకటించినప్పుడే ట్రైలర్ రిలీజ్ చేయాల్సిందిగా స్వర్గం నుంచి ఎన్టీఆర్ నాకు సందేశం ఇచ్చారు. ఎన్టీఆర్ ఆయన సొంత కొడుకు కథానాయకుడును కాకుండా భార్య లక్ష్మీస్ ఎన్టీఆర్‌ను మాత్రమే ఆశీర్వదిస్తారు అనటానికి కథానాయకుడు రిజల్టే నిదర్శనం.' అంటూ ట్వీట్ చేశాడు.అసలే 'కథానాయకుడు' పరాజయంతో తలపట్టుకుని కూర్చున్న ఎన్టీఆర్ బయోపిక్ టీమ్‌కు వర్మ చెమటలు పట్టించేలా ఉన్నాడు. ఈ దాడి వల్ల 'లక్షీస్ ఎన్టీఆర్' సూపర్ హిట్ అవుతుందో లేదో తెలీదు గానీ 'మహానాయకుడు' మీద మరింతగా నెగెటివిటీ స్ప్రెడ్ అవ్వడం మాత్రం ఖాయమనిపిస్తోంది.

నెట్టింట్లో మనోజ్ హల్‌చల్



దశాబ్ద కాలంగా సినిమాల్లో నటిస్తూన్నా..మనోజ్‌కు ఇంతవరకూ మంచి సాలిడ్ సక్సెస్ పడలేదు. దాంతో మనోజ్ సినిమాల సంఖ్య తగ్గించాడు. ఈమధ్య కాలంలో అసలు కొత్త సినిమాలే మొదలు పెట్టడం లేదు. రాజకీయాలు - సమాజ సేవ అంటూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నాడు. పలు విషయాలపై ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయాలను చెప్పే మంచు మనోజ్ తాజాగా ఒక ట్వీట్ చేసి దాన్ని డిలీట్ చేయడంతో సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. కియా మోటర్స్ సంస్థ అనంతపురం జిల్లాలో తమ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మొదటి కారును తయారు చేయడం గర్వకారణంగా ఉందని, కియా మోటర్స్‌ను ఏపీకి తీసుకు వచ్చినందుకు ఏపీ ప్రభుత్వాన్ని అభినందిస్తూ మనోజ్ ట్వీట్ చేశాడు. అయితే కొన్ని నిమిషాలకే ఆ ట్వీట్‌ను డిలీట్ చేశాడు. అప్పటికే కొందరు దాన్ని స్క్రీన్ షాట్ తీసుకుని పెట్టారు. ఆ స్క్రీన్ షాట్ పోస్ట్ చేసి - మనోజ్‌ను ట్యాగ్ చేస్తూ ఈ పోస్ట్‌ను డిలీట్ చేయడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. దాంతో మనోజ్ స్పందిస్తూ , ఆ పోస్ట్ డిలీట్ అయిన విషయం ఇప్పుడే తన దృష్టికి వచ్చిందని, ఎలా డిలీట్ అయ్యిందో తనకు తెలియదు అన్నాడు. అయినా నన్ను బెదిరించే వాడు ఎవడు అంటూ మరో ట్వీట్ చేశాడు. రెండవ సారి చేసిన ట్వీట్‌ను కూడా మనోజ్ డిలీట్ చేశాడు. ఇలా వరుసగా మనోజ్ ట్వీట్స్ డిలీట్ చేయడంతో సోషల్ మీడియాలో రకరకాలుగా కామెంట్స్ వచ్చాయి. దాంతో మరింత ఫ్రస్టేట్ అయిన మనోజ్ నా ఇష్టం వచ్చినట్లుగా చేస్తా అన్నట్లుగా ట్వీట్ చేశాడు. మనోజ్ ఇంతగా ఫ్రస్టేషన్‌కు ఎందుకు గురవుతున్నాడో అంటూ కొందరు చెవులు కొరుక్కుంటున్నారు. అతి త్వరలో ఒక సంచలన విషయాన్ని చెప్తానంటూ చివరగా మనోజ్ చెప్పడం అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఎఫ్ 3 ఇప్పుడే కాదు : దిల్‌రాజు

ఎఫ్ 2' చిత్రం సక్సెస్‌ను ఆనందిస్తున్న దిల్ రాజు వరుసగా చిత్రాల నిర్మాణం చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఈ సమయంలోనే 'ఎఫ్ 2' చిత్రానికి సీక్వెల్‌గా 'ఎఫ్ 3' తీయనున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్ 3పై దిల్‌రాజు క్లారిటీ ఇచ్చాడు. ఎఫ్ 3 ఇప్పుడే కాదు.అది 2021వ సంవత్సరం సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతుందని చెప్పారు. ప్రస్తుతానికి ఆ సినిమాకు సంబంధించిన పనులేమీ రగడం లేదని స్పష్టంచేశారు. చిన్న స్టోరీ లైన్ మాత్రం అనుకున్నట్లుగా పేర్కొన్నాడు. ఆ చిత్రంలో కూడా వెంకటేష్, వరుణ్ తేజ్‌లు మాత్రం తప్పకుండా ఉంటారని చెప్పారు. వారిద్దరితో పాటు మరో హీరో కూడా ఎఫ్3 లో ఉంటాడని ఆ హీరో ఎవరనే విషయం ఇప్పుడే చెప్పలేనంటూ మూడవ హీరో విషయమై దిల్ రాజు సస్పెన్స్‌లో పెట్టాడు. దిల్‌రాజు అఫిషియల్‌గా అనౌన్స్ చేయకున్నా కూడా ఎఫ్ 3లో ఆ మూడవ హీరో రవితేజ అంటూ ఎక్కువ శాతం సినీ జనాలు అంచనా వేస్తున్నారు.

కోలీవుడ్ బయోపిక్‌లో ప్రభుదేవా !



ప్రసుతం చిత్ర పరిశ్రమలో బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తోంది. కోలీవుడ్‌లో ఎంజీఆర్, జయలలితల బయోపిక్‌లు నిర్మాణంలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా వాటి సరసన ప్రముఖ తమిళనటుడు దివంగత చంద్రబాబు బయోపిక్ చేరనుంది. దర్శకుడు రాజేశ్వర్ తెరకెక్కించనున్న ఈ బయోపిక్‌లో చంద్రబాబు పాత్రలో డ్యాన్సింగ్ కింగ్ ప్రభుదేవా నటించడానికి రెడీ అవుతున్నాడని సమాచారం. దీనికి 'జేపీ ది లెజండ్ ఆఫ్ చంద్రబాబు' అనే పేరును నిర్ణయించారు. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలువడనున్నాయి. 1950-60లలో ఆటా, పాటా, నటనతో అదరగొట్టిన నటుడు చంద్రబాబు. అప్పట్లో చంద్రబాబు ఉంటే ఆ చిత్రం హిట్టే అన్నంతగా పేరు తెచ్చుకున్నారు. 'శభాష్ మీనా' అనే చిత్రంలో నటించినందుకుగాను శివాజీగణేశన్ కంటే ఒక్క రూపాయి అధికంగా పారితోషికం తీసుకున్న నటుడిగా పేరుపొందారు.

స్పందించే గుణం ఉండాలి : సిరివెన్నెల



సినీపరిశ్రమకు ఎంతో మంది వస్తారు వెళుతుంటారు.సర్దుబాటుతనం ఇక్కడ ఇంపార్టెంట్ అని నేను అనుకుంటాను, అలానే పనిచేశానని సిరివెన్నెల సీతారామశాస్త్రి అన్నారు. ఇంతకాలానికి తనకు పద్మశ్రీ వచ్చినందుకు మొదట తాను ఎంతో ఆశ్చర్యపోయానని, అయితే పద్మశ్రీ ఇవ్వండని బతిమాలుకోలేదని చెప్పారు. సినీ సాహిత్యమనే వ్యవసాయంలో తనకు లభించిన ఫలసాయం పద్మశ్రీ అని పేర్కొన్నారు. హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్లో ఏర్పాటు చేసిన ధన్యవాద కార్యక్రమంలో సిరివెన్నెల తనదైన శైలిలో పైవిధంగా స్పందించారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, కేంద్రం తనకు పద్మశ్రీ పురస్కారాన్ని మాత్రమే ప్రకటించింది.'సినీకవి అంటే నేతి బీరకాయ అని ఇంతకుముందు అనుకునేవారు, అప్పట్లో జాలిగా చూస్తుండే వారు. కానీ సినిమా కవే గొప్ప కవి. మామూలు కవి మూడొస్తే రాసుకుంటాడు. జోల పాటలు రాసుకుంటాడు. కానీ సినిమా పాట అలా కాదు. ఏ సందర్భం వచ్చినా స్పందించి రాసే గుణం ఉండాలి...' అని అన్నారు. నేటి ట్రెండ్‌లో పాట తీరుతెన్నుల్ని వివరిస్తూ, ఈ మధ్య హిట్టయిన సినిమాల్లో అస్సలు పాట గుర్తు ఉండటం లేదు. గుర్తుండనివి ఎందుకు తెరకెక్కించడం? అని సిరివెన్నెల అన్నారు.

అసంఘటిత కార్మికులకు రూ.3 వేల పింఛన్

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి శ్రమయోగి బంధన్ పేరుతో అసంఘటిత కార్మికులకు పింఛన్ ఇస్తామని, 60 ఏళ్లుపైబడిన వారికి ఏటా రూ.3 వేలు పింఛన్ వచ్చేలా పథకాన్ని రూపొందిస్తున్నట్లు ఆర్థికమంత్రి పియూష్ గోయల్ వివరించారు. నెలకు రూ. 100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత రూ. 3 వేల పింఛన్ చెల్లిస్తామన్నారు. ఈ పథకం ద్వారా అసంఘటిత రంగంలోని 10 కోట్ల మంది కార్మికులకు ఈ పథకం వర్తించనుందని తెలిపారు.



విద్యకు పదిశాతం పెంపు

న్యూఢిల్లీ : విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం రూ.93,847.64 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది పదిశాతం అధికం. ఉన్నత విద్యకు రూ.37,461.01 కోట్లు కేటాయించగా పాఠశాల విద్యకు రూ. 56,386.63 కోట్లు కేటాయించింది. గతేడాది అప్పటి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ విద్యారంగానికి రూ.85,010 కోట్లు కేటాయించారు. కేంద్ర ఆర్థికమంత్రి పియూష్ గోయల్ శుక్రవారం మధ్యంతర బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించారు. పరిశోధన, అన్వేషణ కోసం గత బడ్జెట్‌లో రూ.350.23 కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.608.87 కోట్లు కేటాయించారు. రెండు పూర్తిస్థాయి స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)లను సవాల్‌గా తీసుకొని నిర్మించాలని ప్రతిపాదించినట్లు గోయల్ చెప్పారు. ఐఐటీ, ఎన్ఐటీలలో స్వయంప్రతిపత్తిగల పాఠశాలలు మరో 18 ఏర్పాటునకు ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. నాణ్యమైన విద్యకు సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. ఇక నుంచి తరగతి గదుల్లో బ్లాక్‌బోర్డుల స్థానె డిజిటల్ బోర్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

ఎన్నికల బడ్జెట్

మహిళా సాధికారతకు రూ. 1330 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో భాగంగా మహిళా సాధికారత, రక్షణకు రూ. 1330 కోట్లు కేటాయించినట్లు మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.174 కోట్లు అధికంగా కేటాయించినట్లు వెల్లడించారు. ఉజ్వల యోజన కింద ఇప్పటికే 6 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. మిగతా లబ్ధిదారులందరికి వచ్చే ఏడాది పూర్తి నాటికి ఉచిత గ్యాస్ కనెక్షన్ అందజేస్తామన్నారు. ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం కింద ప్రయోజనం పొందిన లబ్ధిదారులలో 60 శాతం మంది మహిళలేనని మంత్రి తెలిపారు.

అందరికీ మేలు : మోడీ



న్యూఢిల్లీ : మధ్యంతర బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉందని, ఏ ఒక్కరినీ వదలలేదని ప్రధాని నరేంద్రమోడీ చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత భారతదేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి ఈ బడ్జెట్ ఓ ట్రైలరు మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఆర్థికమంత్రి పియూష్ గోయల్ పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మోడీ దీనిపై స్పందించారు. ప్రజలకు సాధికారత కల్పించేలా బడ్జెట్ ఉందని ప్రధాని చెప్పారు. ఈ బడ్జెట్ వల్ల 12 కోట్లకు పైగా రైతులు, మూడు కోట్ల మధ్యతరగతి కుటుంబాలు, అసంఘటితరంలో పనిచేస్తున్న 30-40 కోట్లమంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని మోడీ అన్నారు. తన ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా దారిద్ర్యం రికార్డుస్థాయిలో తగ్గిందని గొప్పలు చెప్పుకున్నారు. 130 కోట్ల జనాభా గల నవభారత లక్ష్యం నెరవేరేలా ఈ బడ్జెట్‌ను రూపొందించామని అన్నారు.

ఐటీ పరిమితి రూ.5లక్షలకు పెంపు

- కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి అమలు
- ఇక ఎఫ్‌డీలపై టీడీఎస్ రూ.40వేలు
- రెండు ఇళ్లపై పెట్టుబడులు పెట్టొచ్చు



న్యూఢిల్లీ : గతేడాది వలె ఈ ఏడాదీ పన్ను శ్లాబులు మారలేదు. అయితే, ఆదాయపు పన్ను పరిమితిని రూ.5లక్షలకు పెంచినట్లు మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. వార్షిక ఆదాయం రూ.5లక్షల వరకు ఉన్న వారు ఇకపై ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేదని అన్నారు. ఇప్పటివరకు ఇస్తున్న పన్ను మినహాయింపును రెట్టింపు చేసినట్టు తెలిపారు. గృహరుణాలు, ఇంటి అద్దెలు, ఇన్సురెన్స్‌లు కలిపి మొత్తం రూ.6.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికీ పన్ను ఉండదని వెల్లడించారు. ఏదైనా రీతిలో తమ సొమ్మును ఆదా చేసే వారికి ఈ వెసులుబాటు ఉంటుందన్నారు. నెలవారీ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేలకు పెంచామని చెప్పారు. పొదుపు ఖాతాలపై టీడీఎస్‌ను రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంచామన్నారు. నెలకు రూ.50 వేల జీతం వరకు టీడీఎస్ ఉండదని, సొంతిల్లు అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయంపై రూ.2.50 లక్షల వరకు పన్నులేదని మంత్రి గోయల్ తెలిపారు. కొత్తగా ప్రకటించిన రిబేట్‌తో సుమారు మూడు కోట్ల మంది పన్నుదారులు లబ్ధి పొందుతారన్నారు. రూ.5 లక్షల శ్లాబ్ నిర్ణయాన్ని కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్టు తెలిపారు. ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 54 కింద రెండు ఇళ్లపై పెట్టుబడులు పెట్టవచ్చు అని, దీనికి సంబంధించి రూ.2 కోట్ల వరకు మూలధన లబ్ధి (కేపిటల్స్ గెయిన్స్) నుంచి మినహాయింపు ఉంటుందని అన్నారు. జీవిత కాలంలో ఇది ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేశారు. రెండో గృహానికి కూడా అద్దె చెల్లించే వారికి ఆ మేరకు ఆదాయపు పన్ను మినహాయిస్తామన్నారు. పేదలకు ఇళ్ల పథకం కింద 2020లోపు రిజిస్టర్ చేసుకొన్న గృహ ప్రాజెక్టులకు పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. పన్ను వ్యవస్థను పూర్తిగా కంప్యూటరీకరిస్తామని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు, పన్ను అధికారులకు మధ్య ఎలాంటి సంబంధం లేకుండా చేస్తామని మంత్రి గోయల్ తెలిపారు.

రైల్వేకు రూ.64,587 కోట్లు..

- చార్జీల పెంపు లేదు
- వసతుల కల్పనకు రూ.3.422 కోట్లు



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2017-18 సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వే రంగానికి రూ.లక్షా48వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ ఏడాది తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి పియూష్ గోయల్ రైల్వే రంగానికి బడ్జెటరీ సపోర్టు కింద రూ.64,587కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అదే సమయంలో రైల్వేకు అత్యధికంగా పెట్టుబడి వ్యయాన్ని రూ.1.58లక్షలకోట్లుగా కేటాయించామన్నారు. ప్యాసింజర్ చార్జీలు, సరకు రవాణా చార్జీలు పెరగవని మంత్రి వెల్లడించారు. 2019-20కిగాను రెవెన్యూ బడ్జెట్ కింద రూ.2,72,705.68 కోట్లుగా అంచనా ఉంది. 2018-19 బడ్జెట్ కంటే ఇది రూ.22,854.67కోట్లు ఎక్కువ. కాగా, బడ్జెట్‌లో కొత్త లైన్ల నిర్మాణానికి రూ.7,255 కోట్లు, గేజ్ కన్వర్షన్లకు రూ.2,200 కోట్లు, డబులింగ్‌కు రూ.700 కోట్లు, రోలింగ్ స్టాక్‌కు రూ.6,114.82కోట్లు, సిగ్నలింగ్ & టెలికాం కోసం రూ.1,750 కోట్ల మేర నిధులు కేటాయించారు. రైల్వే ప్రయాణికుల కోసం సౌకర్యాల కల్పనకు రూ.3,422 కోట్లను కేటాయించామని మంత్రి చెప్పారు. మిజోరాం, మేఘాలయా రాష్ట్రాలను రైల్వేతో అనుసంధానం చేశామని, దేశవ్యాప్తంగా కాపలారహిత క్రాసింగులను దాదాపుగా తొలగించామని చెప్పారు. మేకిన్ ఇండియాకు మరింత దోహదం చేసేలా వేగం, సేవ, భద్రతకు హామీనిచ్చే విధంగా వందేమాతరం ఎక్స్‌ప్రెస్ రూపొందిం దని, ఈ ఘనత మన ఇంజినీర్లకే చెందుతుందని అన్నారు. ప్రస్తుత వార్షిక సంవత్సరానికి సంబంధించి ఆపరేటింగ్ నిష్పత్తి మెరుగుపడి 96.2శాతానికి చేరిందని; వచ్చే వార్షిక సంవత్సరంలో దీనిని 95శాతం చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈశాన్య భారత మౌలికరంగాభివృద్ధికి చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చినట్టు మంత్రి గోయల్ తెలిపారు.

సడక్ యోజనకు రూ.19వేల కోట్లు



న్యూఢిల్లీ : రోడ్డు రవాణాపైనా ప్రధానంగా దృష్టిసారించినట్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సమయంలో ఆర్థికమంత్రి పియూష్ గోయల్ తెలిపారు. రోజుకు 27కి.మీలు చొప్పున రోడ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రహదారులను నిర్మించామని అన్నారు. గ్రామాల్లోనూ రోడ్ల అనుసంధానం జరుగుతోందని, మొత్తం 17.84 నివాసాలలో 15.8లక్షలను పీఎంజీవైసీ కింద పక్కారోడ్లతో అనుసంధానించామన్నారు. 2019-20 బడ్జెట్‌లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోచన (పీఎంజీఎస్‌వై) కోసం రూ.19వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. సాగర్‌మాల కింద పోర్టులు సరుకు రవాణా జరుగుతోందని, ఈశాన్య రాష్ట్రాలకు బ్రహ్మపుత్ర ద్వారా సరుకు రవాణా అవుతోందని తెలిపారు.

'ఓటుకు నోటు'.. కాంగ్రెస్

న్యూఢిల్లీ : నరేంద్రమోడీ ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభకు సమర్పించిన బడ్జెట్‌పై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ఇది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాదని, అకౌంట్ ఫర్ ఓట్స్ బడ్జెట్ అని విమర్శించింది. ఇది కేవలం ఎన్నికల బడ్జెట్ అని, ఓట్ల కోసమే వరాల బడ్జెట్ ప్రవేశపెట్టారని నిందించింది. రైతులకు నెలకు కేవలం రూ.500 ఇస్తామని ప్రకటించడం సిగ్గుగా ఉందని వ్యాఖ్యానించింది. మధ్యతరగతిని, రైతులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించింది. ఐదేళ్ల కాలంలో తాను సాధించిన విజయాల గురించి చెప్పకుండా ఓట్ల కోసం ముందస్తుగా డబ్బులిస్తున్నారని పేర్కొన్నది. ఇది ఓటుకు నోటు అనడంలో ఎలాంటి అనుమానం లేదని అభిప్రాయపడింది.

రోజుకు 17 రూపాయలా? : రాహుల్



దేశంలో అన్నం పెట్టే రైతన్నకు రోజుకు 17 రూపాయల కూలి ఇస్తారా అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిశితంగా విమర్శించారు. గడచిన ఐదేళ్లుగా మోడీ ప్రభుత్వం రైతుల జీవితాలను ధ్వంసం చేసిందని నిందించారు. మోడీ ప్రభుత్వం తన మధ్యంతర బడ్జెట్‌లో రోజుకు రూ.17 ప్రకటించి రైతులను ఘోరంగా అవమానించిందని అన్నారు. డియర్ నమో..ఐదేళ్లుగా మీరు చూపిస్తున్న అసహనం, అహంకారం మన రైతుల జీవితాలను విచ్ఛిన్నం చేశాయి. అన్నదాతకు రోజుకు రూ.17 ప్రకటించి అవమానిస్తావా? అని నిలదీశారు.

అకౌంట్స్ ఫర్ ఓట్ : చిదంబరం



'ఇది ఓట్ ఆన్ అకౌంట్ కాదు...అకౌంట్స్ ఫర్ ఓట్స్' అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం విమర్శించారు. ఆర్థికమంత్రి పియూష్ గోయల్ మధ్యంతర బడ్జెట్ ప్రసంగం పూర్తయిన వెంటనే చిదంబరం దీనిపై ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'దేశ వనరులపై పేదలకే మొదటి హక్కు అనే కాంగ్రెస్ నినాదం, డిక్లరేషన్‌ను కాపీ కొట్టినందుకు తాత్కాలిక ఆర్థికమంత్రికి ధన్యవాదాలు' అని చిదంబరం పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధరపై ప్రభుత్వం హామీ ఇస్తూ చేసిన ప్రకటనకు చిదంబరం పైవిధంగా స్పందించారు. 'నేను హెచ్చరించినట్టుగానే 2018-19కి సంబంధించి ద్రవ్యలోటు లక్ష్యాన్ని ప్రభుత్వం అందుకోలేకపోయింది. సీఏడీ 2.5 శాతం అనేది కూడా ఇబ్బందికరమే'నని వ్యాఖ్యానించారు.

ఇది ఓటుకు నోటు : ఖర్గే



కేంద్ర బడ్జెట్ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలా ఉందని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే విమర్శించారు. పియూష్ గోయల్ ప్రకటించిన వరాలు లోక్‌సభ ఎన్నికలకు ముందు ఓటర్లకు లంచమివ్వడమేనని ఘాటుగా నిందించారు. 'ఆరోజు సభకు సమర్పించిన బడ్జెట్‌ను బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోగా నేను భావిస్తున్నా. ఎన్నికల కోసమే ఈ వరాలు ప్రకటించారు. నేను నేరుగా బీజేపీపై ఆరోపణలు చేస్తున్నాను. ఇది ముమ్మాటికీ ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడమే'నని ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత ఖర్గే పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం సమర్పించిన బడ్జెట్ కేవలం ఎన్నికల వరాలేనని ఖర్గే చెప్పారు. ఈ ఏడాది మే వరకు మాత్రమే బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, ఆ తర్వాత ఆ హామీలు నెరవేరేవి కాదని తెలిపారు. నాలుగున్నరేళ్లలో తామేమి చేసిందీ చెప్పకుండా కేవలం వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వరాలు ప్రకటించారని విమర్శించారు. ఎన్ని హామీలు అమలు చేసిందీ చెప్పలేదన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరి ఖాతాలు రూ.15 లక్షలు వేస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఇప్పుడిచ్చిన హామీలు అలాంటివేనన్నారు.

నెలకు ఐదువందలా? : అహ్మద్ పటేల్



రైతులు, మధ్యతరగతిని మోడీ ప్రభుత్వం పూర్తిగా మోసగించిందని మరో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అహ్మద్ పటేల్ విమర్శించారు. 'మోడీ ప్రభుత్వం రూ.15 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చింది. ఇప్పుడు సొంతభూమి గల రైతులకు నెలకు రూ.500 మాత్రమే ఇస్తానంటుంది. నేరపూరితమైన పెద్దనోట్ల రద్దును అమలు చేయడం వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. దీనికితోడు జీఎస్టీ అమలు రైతులు, చిన్న, మధ్యతరగతి వ్యాపారులను కోలుకోలేని దెబ్బతీసింది. కేంద్రం ఆప్పుడు ప్రకటించిన రూ.500 పల్లీల వంటివే'నని అహ్మద్ పటేల్ ట్వీట్ చేశారు. మధ్యతరగతికి ఊరట కలిగించేలా ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని నిందించారు. మధ్యతరగతిని ప్రభుత్వం పూర్తిగా మోసగించింది. వారి కోసం ఈ బడ్జెట్‌లో ఏమీ ఇవ్వలేదు. మరో వైపు..రూ.8లక్షల ఆదాయం గలవారు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలంటూ మోడీ సర్కారు నీతులు వల్లిస్తోంది. మరి వారికి కనీసం పన్ను మినహాయింపు కూడా ఎందుకు ఇవ్వలేదని పటేల్ సూటిగా ప్రశ్నించారు.

పీఎంకేవై ఓ ఫ్యాంటసీ : థరూర్



కేంద్ర మధ్యంతర బడ్జెట్‌ను ఓ గారడీ బడ్జెట్‌గా కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అభివర్ణించారు. ఇది పూర్తిగా అసంతృప్తికి గురిచేసిందన్నారు. ఉత్తుత్తి హామీలు వాస్తవాలకు మద్దతుగా ఉండలేవని వ్యాఖ్యానించారు. మధ్యతరగతికి ఆదాయపన్నులో కొంత ఊరట కలిగించినప్పటికీ పీఎం కిసాన్ యోజన ఓ ఫ్యాంటసీ అని కొట్టిపారేశారు. సొంత భూమి ఉన్న రైతుకు నెలకు రూ. 500 ఎందుకు పనికొస్తాయని సూటిగా ప్రశ్నించారు.

ఈ బడ్జెట్‌కు విలువ లేదు : మమత



కోల్‌కతా :త్వరలో గద్దెదిగుతున్నందున ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు విలువలేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. 'ఈ బడ్జెట్‌ను ఎవరు అమలుచేస్తారు? వచ్చే కొత్త ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను అమలు చేస్తుందా? ఎన్నికల ముందు సాధారణంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడతారు' అని మమత చెప్పారు. పశ్చిమబెంగాల్ పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందని ఆరోపించారు. నాలుగేళ్లుగా ఇలాంటి పథకాలు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఇది కచ్చితంగా ఎన్నికల తాయిలమేనని నిందించారు. కేంద్రం మరో చిట్‌ఫండ్ కంపెనీలా తయారైందని అన్నారు.

5.45 లక్షల ఓడీఎఫ్ గ్రామాలు

న్యూఢిల్లీ: గ్రామాల్లో 98శాతానికిపైగా పారిశుద్ధ్య కార్యక్రమాలను స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పూర్తి చేసినట్టు ఆర్థికమంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఇప్పటి వరకు 5.45లక్షల గ్రామాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్)గా తీర్చిదిద్దామన్నారు.

గ్రాట్యుటీ పరిమితి రూ.20లక్షలు



న్యూఢిల్లీ : గ్రాట్యుటీ పరిమితిని రూ.20 లక్షలకు, కార్మిక ప్రమాద బీమా మొత్తం రూ.1.50 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచామని మంత్రి గోయల్ అన్నారు. బోనస్ పరిమితి రూ.21వేలకు పెంచుతున్నామని చెప్పారు. ఉపాధి అవకాశాలు మెరుగుపరడటంతో ఈపీఎఫ్‌వో సభ్యులు పెరిగారని మంత్రి తెలిపారు. ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కార్మికులు, ఉద్యోగులకు అందేలా పనిచేస్తున్నామన్నారు. ఎన్‌పీఎస్ విధానంలో ప్రభుత్వ వాటా 14 శాతానికి పెంచినట్టు మంత్రి గోయల్ తెలిపారు.

రక్షణ రంగానికి రూ.3లక్షల కోట్లు



న్యూఢిల్లీ : రక్షణ రంగానికి రూ.3 లక్షల కోట్లు కేటాయించినట్టు మంత్రి గోయల్ తెలిపారు. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2017-18 సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ.2.95లక్షల కోట్లు కేటాయించారు. అయితే ప్రస్తుతం ఈ రంగానికి కేటాయింపు స్వల్పంగా పెరుగగా అవసరమైతే అదనంగా నిధులు కేటాయిస్తామని గోయల్ ప్రకటించారు. సైనికుల వేతనాల పెంపు, ప్రత్యేక అలవెన్సులు ఇస్తామని అన్నారు. ఒకే ర్యాంకు ఒకటే పింఛన్‌కు రూ.35వేలు కేటాయించినట్టు తెలిపారు.

లక్ష కోట్లు దాటిన హోం శాఖ బడ్జెట్



న్యూఢిల్లీ : కేంద్ర హోం మంత్రిత్వశాఖ బడ్జెట్ మొదటిసారిగా రూ. లక్ష కోట్లను దాటింది. భద్రతా దళాలకు సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలను పెంచాల్సిన ఆవశ్యకతను ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ నొక్కిచెప్పింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి హోం శాఖ బడ్జెట్ రూ. 1,03,000 కోట్లు దాటింది. 2019-20 సంవత్స రానికి హోం శాఖకు రూ.1,03,927 కేటాయించారు. 2018-19లో రూ. 99,034 కోట్లను మాత్రమే ఇచ్చారు. ఆ ఏడాది కన్నా ప్రస్తుత సంవత్సరం బడ్జెట్ 4.9 శాతం అధికమని బడ్జెట్ పేపర్లు తెలిపాయి. దేశ రాజధానిలో శాంతి, భద్రతలను చూసే ఢిల్లీ పోలీసులకు రూ. 7,496.91 కోట్లను, సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 2,000 కోట్లను కేటాయించారు. భారత్-పాక్, చైనా-భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు అధికంగా ఉన్న నేపథ్యంలో మౌలిక సదుపాయాలు పెంచాలని నిర్ణయించారు. భారత్-పాకిస్థాన్, భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో గస్తీ నిర్వహించే సరిహద్దు భద్రతా దళాలకు వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ. 19,647.59 కోట్లు కేటాయించారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ. 18,585.96 కోట్లు మాత్రమే ఇచ్చారు. మహిళల భద్రత కోసం నిర్భయ నిధికి రూ. 50 కోట్లను కేటాయించారు.

బ్యాంకుల బలోపేతానికి 2.6లక్షల కోట్లు

కార్పొరేట్ డిఫాల్టర్ల నుంచి రూ. 3 లక్షల కోట్ల రుణ వసూళ్లు



న్యూఢిల్లీ : స్వచ్ఛమైన బ్యాంకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో భాగంగా ఆర్థికమంత్రి పియూష్ గోయల్ చెప్పారు. 2.6 లక్షల కోట్లతో బ్యాంకుల బలోపేతం చేశామన్నారు. ఎన్‌పీఏ రుణాల రికవరీ కోసం స్నేహపూర్వక వ్యవస్థను రూపొందించామని, బ్యాంకులు మళ్లీ పునరుత్తేజం పొందేట్లు చేశామని అన్నారు. కార్పొరేట్ రుణ ఎగవేతదారుల నుంచి రూ.3 లక్షల కోట్ల రుణ వసూళ్లు చేసినట్లు చెప్పారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలు ఆర్బీఐ ఫ్రేమ్‌వర్క్ పీసీఏ నుంచి తొలగించినట్టు తెలిపారు. మిగతా బ్యాంకులు ఇదే బాటలో పయనించి పీసీఏ నుంచి బయటకు వస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు.

కిసాన్ సమ్మాన్ నిధికి రూ.75 వేల కోట్లు



న్యూఢిల్లీ : రైతు సాయం కోసం రూ.75 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్టు మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. పశుసంవర్థక, మత్స్యశాఖ రైతులకు 2శాతం వడ్డీ రాయితీ కల్పిస్తామన్నారు. చిన్న, సన్నకారు రైతుల కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టి తద్వారా ఏడాదికి రూ. 6వేల సాయం అందిస్తామని చెప్పారు. ఐదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతారని అన్నారు. రాష్ట్రప్రభుత్వాలకు సంబంధం లేకుండా ఈ నగదు నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తామని, మూడు విడతల్లో మొత్తం సాయం అందిస్తామన్నారు. తొలి విడతగా తక్షణమే రూ.2వేల సాయం అందిస్తామని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డుల కింద రుణాలిస్తామని, రైతు పెట్టుబడి సాయం 2018, డిసెంబరు నుంచే అమలవుతుందని వెల్లడించారు. పాడిపరిశ్రమ రుణాలు సకాలంలో చెల్లించే వారికి అదనపు మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తామని మంత్రి తెలిపారు.

తగ్గిన ద్రవ్యోల్బణం

వార్షిక లోటు 3.4శాతం



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే భారతదేశం ఉజ్వల ప్రదేశంగా ఉందని, ఐదేళ్లలో జీడీపీ శరవేగంగా వృద్ధిని సాధించిందని ఆర్థికమంత్రి పియూష్ గోయల్ అన్నారు. శుక్రవారం 2019-20 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆయన భారత్ జీడీపీ రేసులో దూసుకెళుతోందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లోనే శరవేగంగా వృద్ధి సాధించే ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉందని అన్నారు. ఈ ఏడాది జీడీపీ వార్షిక లోటు 3.4శాతంగా ఉన్నట్టు గోయల్ తెలిపారు. ఐదేళ్లల్లో 239 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారత్‌కు వచ్చాయన్నారు. ఆంక్షలను సడలింపు ఇందుకు దోహదపడిందని అన్నారు. జీఎస్టీతో పాటు మరిన్ని సంస్కరణలు చేపట్టడంతో దేశంలో వ్యవస్థాగత మార్పులు వచ్చాయని చెప్పారు. రెండు అంకెల ద్రవ్యోల్బణాన్ని నియంత్రించి సగటున 4.6శాతానికి తగ్గించామని గోయల్ తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించి ఉండకపోతే నిత్యావసరాలపై 35-40 శాతం ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి వచ్చేదన్నారు. యూపీఏ హయాంలో 10.1శాతం ద్రవ్యోల్బణం నమోదైందని గుర్తుచేశారు. '2009-14 మధ్యకాలంలో ఆహార ద్రవ్యోల్బణం పెరిగింది. ఆ పెంపునకు మేం అడ్డుకట్ట వేశాం. ద్రవ్యోల్బణాన్ని 4.6శాతానికి తగ్గించగలిగాం' అని తెలిపారు. 2018, డిసెంబరులో అత్యల్పంగా 2.19శాతంగా ద్రవ్యోల్బణం నమోదైనట్టు మంత్రి గోయల్ గుర్తుచేశారు.

2025 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి అవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులకు మొత్తం 1.53కోట్ల ఇళ్లను కట్టించామని మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. 2025 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలకు 143 కోట్ల ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేసినట్లు తెలిపారు. 22 పంటలకు కనీస మద్దతు ధరను 1.5 రెట్లు పెంచినట్లు చెప్పారు. ఉజ్వల పథకం ద్వారా 6కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఏడాది 8కోట్ల కుటుంబాలకు కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

ఇళ్ల కొనుగోలుదారులకు జీఎస్టీ మినహాయింపు

ఇళ్ల కొనుగోలుదారులకు జీఎస్టీ(వస్తు, సేవల పన్ను) మినహాయింపుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదికను జీఎస్టీ మండలి ముందు ప్రవేశపెట్టి నిర్ణయిస్తామన్నారు. ఈ ఏడాది జనవరి వరకు జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్లకు చేరిందన్నారు. సినిమా టికెట్లపై జీఎస్టీని 12 శాతానికి తగ్గించామన్నారు. ప్రస్తుతం నెలకు రూ.97,100 కోట్లు పన్ను వసూళ్లు అవుతున్నాయని తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రాల పన్ను వసూళ్లు సాలీనా 14 శాతం పెరిగాయని చెప్పారు.

గో సంరక్షణకు కమిషన్

న్యూఢిల్లీ: రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు ప్రస్తుత బడ్జెట్లో నిధులు కేటాయింపు పెంచినట్లు మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.750కోట్ల మేర నిధులు కేటాయించినట్లు వివరించారు. ఆవుల సంరక్షణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 9 ప్రాంతాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ. 76,800 కోట్లు

న్యూఢిల్లీ : మధ్యంతర బడ్జెట్‌ను ఎన్నికల సన్నాహక బడ్జెట్‌గా కేంద్ర ప్రభుత్వం రుపొందించింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించిన ప్రభుత్వం ఈ రంగానికి రూ.76.800 కోట్లను కేటాయించింది. ఈ బడ్జెట్‌లో ప్రణాళిక వ్యయం రూ.3.36 లక్షల కోట్లుగా పేర్కొన్న ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ ప్రభుత్వం వ్యయం రూ.13.3 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించారు. పన్ను మినహాయింపులతో పట్టణ ప్రాంత ప్రజలను, వేతన జీవులను ఆకట్టుకున్నట్టే గ్రామీణ రంగంలో రైతులకు ఊరట ఇచ్చేలా నగదు సాయం పథకాన్ని కేంద్రం ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయించి దళితులను, అత్యంత వెనుకబడిన వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.

మహిమగల కాయిన్‌తో మోసగించిన ముఠా అరెస్ట్



విశాలాంధ్ర - విజయనగరం క్రైం : విజయనగరం రూరల్ పోలీసు స్టేషను పరిధిలో మహిమలు గల శ్రీరామ పట్టాభిషేకం కాయిన్‌ను చూపి, నగదు దోచుకున్న అయిదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు విజయనగరం డీఎస్పీ డి.సూర్యశ్రావణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా ఆగనంపూడికి చెందిన (ఎ1) ప్రధాన నిందితుడు గవర వరహా వెంకట రామకృష్ణ, విశాఖపట్నం చినగదిలికి చెందిన కొరగంజి పైడిరాజులు రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తుంటారు. వీరిద్దరికి రియల్ ఎస్టేటు లావాదేవీల్లో పరిచయం అయిన జానకీరాం, తులసీ ఆనందరావులకు తమకు తెలిసిన వ్యక్తుల వద్ద 1818 సంవత్సరానికి చెందిన శ్రీరాముని పట్టాభిషేకం ముద్రణతోగల మహిమగల కాయిన్ ఉందని, ఆ కాయిన్‌ను కార్పొరేట్ సంస్థలు లేదా ఇతర వ్యక్తులకు విక్రయించినట్లయితే కోట్ల రూపాయల లాభం వస్తుందని నమ్మించారు. వారి మాటలను నమ్మిన ఫిర్యాదు దారులు ఒప్పందం ప్రకారం లక్షరూపాయలను ముందుగా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. కాయిన్‌ను పరీక్షించి, మరో 11 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారు. ఇందులో భాగంగా విజయనగరం జమ్ముకు చెందిన (ఎ3) పత్తిక సంజీవరావు అలియాస్ సింహాచలం అలియాస్ డేవిడ్, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న (ఎ4) పత్తిక సుబ్బారావు అలియాస్ మోహన్‌రావులు మహిమగల కాయిన్ తీసుకొని ముందు అనుకున్న ప్రకారం ద్వారపూడి గ్రామానికి వెళ్ళే మార్గంలో ఫిర్యాదుదారులు జానకీరాం, తులసీ ఆనందరావులను (ఎ1) రామకృష్ణ (ఎ2) పైడిరాజుల సమక్షంలో కలిశారు. ఫిర్యాదుదారులు తమ వద్ద ఉన్న రూ. 11 లక్షలను సంజీవరావు, సుబ్బారావులకు ఇచ్చారు. అదే సమయంలో విజయనగరం సీసీఎస్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న (ఎ5) సిరిపురపు రాజు ఘటనా స్థలికి చేరుకోగా, నిందితులు భయంతో కాయిన్, డబ్బుతో పారిపోయినట్లుగా ప్రణాళిక రూపొందించారు. అనంతరం ఫిర్యాదుదారులు (ఎ1) రామకృష్ణ (ఎ2) కొరగంజి పైడిరాజులను ప్రశ్నించగా, భయపడవద్దని డబ్బులు లేదా మహిమ గల కాయిన్ గాని ఇప్పిస్తామని నమ్మించారు. అయితే ఎప్పటికీ వారు ఇవ్వకపోవడంతో ఫోన్లు చేశారు. ఫోన్లు స్విచాఫ్ చేసి ఉండటంతో మోసపోయామని భావించిన వారు విజయనగరం రూరల్ పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ కేసును విజయనగరం రూరల్ ఎస్ఐ ఫకృద్దీన్ నమోదు చేయడంతో రూరల్ సీఐ రమేష్ దర్యాప్తు చేపట్టారని డీఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, కేవలం కొద్ది రోజుల్లోనే మోసానికి పాల్పడిన ముఠా సభ్యులు ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును ఇంకా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాల్సి ఉందని, ఈ కేసుతో మరి కొంతమందికి సంబంధం ఉన్నట్లు భావిస్తున్నామని, ప్రస్తుతం వారంతా పరారీలో ఉన్నారని తెలిపారు. విచారణ పూర్తి చేసి ఈ కేసుతో ప్రమేయం ఉన్న వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు. నిందితుల నుంచి రూ. 7,32,400 నగదు, తొమ్మిది సెల్ ఫోనులు, కాయిన్, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేసిన సీఐ రమేష్, ఎస్‌బి సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఫకృద్దీన్, సిబ్బందిని డీఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్ అభినందించారు.



మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : వాడబలిజ, జాలారి మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చుతూ ఈ అఖరు అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని ఏపీ మత్స్యకారుల ఎస్టీ సాధన సమితి నాయకులు చింతపల్లి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 974 కి.మీ. సముద్రతీర ప్రాంతంలోని తొమ్మిది కోస్తా జిల్లాల్లో 684 మత్స్యకార గ్రామాలు ఉన్నాయన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువ మంది వాడబలిజ కులస్తులు మత్స్యకారులు ఉన్నారన్నారు. ప్రమాదకర వృత్తి చేపలవేటతో సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్నది వాడబలిజ, జాలారి మత్స్యకారులేనన్నారు. వీరిని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంతో కాలం నుండి ప్రభుత్వాలను కోరుతున్నా ఫలితం కానరావడం లేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ మత్స్యకారులను ఎస్టీల్లో చేరుస్తామని నమ్మించి మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో సీఎంఎఫ్ఆర్ఐ నివేదిక ప్రకారం మత్స్యకారులు వెనుకబడిన వారిగా 2011 గణాంకాలు చెప్తున్నాయన్నారు. ఇటీవల మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై త్రిసభ్య కమిటీ వేసినా ఆచరణ లేదన్నారు. ఈ ప్రభుత్వ చివరి అసెంబ్లీ సమావేశాల్లో అయినా బిల్లును ఆమోదించి తీర్మానం చేయాలన్నారు. బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ రాష్ట్ర మత్స్యకార ఎస్టీ సాధన సమితి కృష్ణా జిల్లా కమిటీ అధ్యక్షులు నరసింహారావు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

వంతెన మరమ్మతులపై రాజకీయం వద్దు



విశాలాంధ్ర - ఆమదాలవలస : రైల్వే కాలినడక వంతెన మరమ్మతులపై రాజకీయం తగదని రైల్వే డివిజనల్ మేనేజర్ ముఖుల్ చరణ్‌మాథుర్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస రైల్వేస్టేషన్ ఆవరణలో రూ.6 కోట్లతో చేపట్టిన గూడ్స్‌షెడ్‌కు శుక్రవారం డీఆర్ఎం ప్రారంభోత్సవం చేశారు. డీఆర్ఎం రాక నేపథ్యంలో వైసీపీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు వార్డుల ప్రజలు రైల్వే ప్లాట్‌ఫాంపై బైఠాయించారు. ఈ సందర్భంగా సమస్యను డీఆర్ఎంకు తమ్మినేని వివరిస్తూ ఐదు వార్డుల ప్రజానీకం రాకపోకలు సాగిస్తున్న రహదారిని ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా మూసివేశారన్నారు. ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులను డీఆర్ఎంకు వివరించిన తమ్మినేని ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. డీఆర్ఎం స్పందిస్తూ మూడు నెలల్లో వంతెన మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు. రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కార్యాలయం, నాలుగు ప్లాట్‌ఫారాలు పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, కౌన్సిలర్ అజంతా కుమారి, పరివర్తన ట్రస్ట్ ప్రతినిధి చింతాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సౌత్‌జోన్ టీటీ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : చెన్నైలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్‌టెన్నిస్ మహిళల చాంపియన్‌షిప్‌కు ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మహిళల జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తి ప్రకటించారు. బి.వెంకటలక్ష్మీ పద్మావతి (డాక్టర్ ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల, విజయవాడ), కె.ప్రగతి (ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విశాఖపట్నం), బి.జ్యోతిక, జి.కృష్ణప్రియ (పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, చినఅవుటుపల్లి), వి.వినతిసాయి సుభానికా (విష్ణుడెంటల్ కళాశాల, భీమవరం). స్టాండ్ బైగా బి.పూర్ణిమా ప్రసన్నలక్ష్మి (విష్ణుడెంటల్ కళాశాల, భీమవరం).

త్వరలో రాష్ట్రంలోనే బాలామృతం తయారీ



విశాలాంధ్ర - కె.కోటపాడు : చిన్నారులకు అందించే బాలామృతం తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఐసీడీఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఏఈ రాబర్ట్స్ తెలిపారు. ఇప్పటివరకు వంద కోట్లు వెచ్చించి తెలంగాణ రాష్ట్రంనుంచి బాలామృతం దిగుమతి చేసుకుంటున్నా మని తెలిపారు. విశాఖ జిల్లా కె.కోటపాడు మండలం లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పనితీరును శుక్రవారం పరిశీలించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లా డారు. అంగన్వాడీ కార్యకర్తల నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపడుతు న్నట్టు చెప్పారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 60 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సుమారు 13 వేల అంగన్వాడీ కేంద్రాలున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో విశాఖ జిల్లాలో అంగ న్వాడీ నూతన భవనాలకు రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నారని, మిగిలిన జిల్లాల్లో ఏడున్నర లక్షలు మాత్రమే కేటాయిస్తున్నట్టు తెలిపారు. విశాఖ జిల్లాలోని ప్రతి కేంద్రంలో న్యూట్రిగార్డెన్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. న్యూట్రీ గార్డెన్స్ వల్ల కేంద్రాలకు మంచి ఆదాయ వనరులుగా ఉంటుందని అన్నారు. మహిళల్లో రక్తహీనత ఉన్న వారికి బాల సంజీవని అందిస్తున్నామని, అలాగే ఏజెన్సీ 11 మండలాలతో పాటు మైదాన ప్రాంతాలైన వి.మాడుగుల, గొలుగొండ, నాతవరం మండలాల్లో ఫుడ్ బాస్కెట్‌లను పైలట్ ప్రాజెక్టుగా అందిస్తున్నామని అన్నారు. కాన్వెంట్‌లకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఇందుకోసం ప్రతి ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తల నైపుణ్యతపై నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. గతంలో ప్రతి వెయ్యి మందికి ఒక అంగన్వాడీ కేంద్రం ఉండేదని, ప్రస్తుతం 500 లోపు కుటుంబాలుంటే ఒక కేంద్రం మంజూరు చేస్తున్నామని అన్నారు. అలాగే 150 కుటుంబాలుంటే మినీ అంగన్వాడీ కేంద్రం మంజూరు చేస్తున్నామని అన్నారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు, ప్రాజెక్టు సూపర్‌వైజర్లతో ప్రత్యేకంగా సమావేశమై కేంద్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగానే ఉన్నాం..

- పాక్ బందీ కుటుంబాలకు లేఖలు
- లేఖలన్నీ ఒకే దస్తూరితో..
- మత్స్యకార కుటుంబాల్లో సంతోషం

పాకిస్తాన్ కోస్టుగార్డులకు చిక్కిన మత్స్యకారుల క్షేమ సమాచారం రెండు నెలల తర్వాత కుటుంబసభ్యులకు తెలిసింది. ఎక్కడ ఉన్నారో తెలిసినా, ఎలా ఉన్నారో తెలియక తల్లడిల్లుతున్న కుటుంబాల్లో గుండెభారం దిగింది. గతేడాది నవంబరు 27వ తేదీన గుజరాత్‌లో పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన మత్స్యకారుల కనీస సమాచారం లేదు. ఎంతోమంది పరామర్శించినా, ప్రభుత్వం చేయూత ఇచ్చినా బాధితుల గుండె కోత ఆగలేదు. శుక్రవారం పాక్ నుంచి లేఖలు చేరడంతో ఆనందానికి అవధులు లేవు.

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : శ్రీకాకుళం జిల్లా మత్స్యకార గ్రామాల్లో శుక్రవారం సంతోషం తాండవించింది. పాక్ బందీల బాధిత కుటుంబసభ్యుల ముఖాల్లో ఆనందం విరబూసింది. పాక్ కోస్ట్‌గార్డులకు ఈ ప్రాంత మత్స్యకారులు చిక్కిన నాటి నుంచి వారి గురించి నేటికీ ఎటువంటి సమాచారం లేక మానసికంగా కృంగిపోయారు. ఇంతలో తామంతా బాగానే ఉన్నామంటూ లేఖలు రావడంతో ఆనందం కనిపించింది. గతేడాది నవంబర్ నెలలో గుజరాత్ రాష్ట్రంలోని వీరావల్ అరేబియా సముద్రంలో చేపలు వేటాడుతూ పాక్ కోస్ట్‌గార్డులకు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 22 మంది మత్స్యకారులు చిక్కిన విషయం పాఠకులకు తెలిసిందే. అప్పటి నుంచి ఎలాంటి క్షేమ సమాచారం లేదు. 22 మంది ఒకే రూములో ఉంటున్నామని, బాగానే ఉన్నామంటూ ఉత్తరాలు రావడంతో సంబరపడ్డారు. పరాయి దేశంలో ఎటువంటి చిత్రహింసలకు గురవుతున్నారోనని బాధపడుతున్న మనసులకు ఈఉత్తరాలు ఊరట కలిగించాయి.

ఉత్తరాల సారాంశం

పాక్ బందీల నుంచి వచ్చిన ఉత్తరాల సారాంశం మొత్తం ఒకేలా ఉంది. ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు, రేషన్ కార్డులను గుజరాత్‌లోని వారి బోటు షేట్‌లకు అందజేయండి. రాజకీయ నాయకులను కలిసి ముఖ్యమంత్రి ద్వారా ఆ దేశంతో సంప్రదించి త్వరగా విడిపించేలా చూడండి. తామంతా క్షేమంగా ఉన్నాం. ఎటువంటి భయం అవసరంలేదు. కొత్తమత్స్యలేశం గ్రామానికి చెందిన సూరాడ ముగతమ్మ భర్త అప్పారావు, ఇద్దరు కళ్యాణ్, కిశోర్ బందీలుగా ఉన్నారు. ముగతమ్మకు భర్త అప్పారావు రాసిన ఉత్తరంలో 22 మంది ఒకే గదిలో ఉన్నట్టు ఉంది. గ్రామంలోని విషయాలతో ఉత్తరాలు రాయలంటూ పాకిస్తాన్‌లో తమ చిరునామాను ఉత్తరంలో రాశారు. బందీల కుటుంబ సభ్యులందరికీ ఒకే దస్తూరితో ఉత్తరాలు చేరాయి.



లేఖలు చూపిస్తున్న కుటుంబ సభ్యులు

కోస్ట్ గార్డులకు చిక్కిన మత్స్యకారులు వీరే

మూడు బోట్లలో 22 మంది మత్స్యకారులు పాక్ కోస్ట్ గార్డులకు చిక్కారు. ఆయా బోట్లలో ఎవరెవరు ఉన్నారన్నది లేఖలో ఇలా తెలిపారు. అన్నపూర్ణ పేరు బోటులో కొత్తమత్స్యలేశం గ్రామానికి చెందిన సూరాడ అప్పారావు, సూరాడ కళ్యాణ్, కోనాడ వెంకటేష్,(బడివానిపేట), బిమ్మాలి నారాయణపురం (పసుపులంక, తూర్పుగోదావరి) మల్లాడి సత్యం (పులంక, తూర్పుగోదావరి), పెంట మణి (ముద్దాడ), దుండంగి సూర్యనారాయణ అలియాస్ మాట్లు (దమ్మలవీధి, శ్రీకాకుళం) కోస్ట్‌గార్డులకు చిక్కిన సమాచారం ఉత్తరంలో ఉంది. కుసుం అనే పేరుతో ఉన్న బోటులో కొత్త మత్స్యలేశం గ్రామానికి చెందిన గనగళ్ల రామారావు, సూరాడ కిశోర్, డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మైలపల్లి సన్యాసి, మైలపల్లి రాంబాబు, కేశంరాజు చీకటి గురుమూర్తి (శివాజీ దిబ్బలపాలెం), ఎస్.సుమంత్ (అస్సాం), బర్రి బవిరోడు (తెప్పలవలస) కోస్ట్‌గార్డులకు చిక్కారు.

కాజల్ పేరు బోటులో కేశం ఎర్రయ్య, (డి.మత్స్యలేశం), బడివానిపేటకు చెందిన బడి అప్పన్న, వాసుపల్లి శామ్యూల్, తిప్పలవలసకు చెందిన నక్క అప్పన్న, నక్క నర్సింగ్, నక్క ధనరాజ్, తోటపల్లి ముక్కాంకు చెందిన మైలపల్లి గురువులు పాక్ గార్డులకు చిక్కారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త జయరామ్ హత్య

- కృష్ణాజిల్లా ఐతవరం వద్ద కారులో మృతదేహం
- తలపై బలమైన గాయం, ముఖంపై రక్తపు మరకలు
- ఎక్స్‌ప్రెస్ టీవీ ఛానల్ ఎండీగా సుపరిచితులు
- అమెరికాలోనూ వ్యాపార సంస్థలు



విశాలాంధ్ర - నందిగామ : విజయవాడకు చెందిన కోస్టల్ బ్యాంకు డైరెక్టరు, ప్రముఖ పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ శుక్రవారం తెల్లవారుజామున కృష్ణాజిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో హత్యకు గురయ్యారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై సిప్ట్ కారులో ప్రయాణిస్తూ ఐతవరం శివారులో రోడ్డు పక్క కందకంలోకి వెళ్ళినట్లు సమాచారం. జాతీయ రహదారి పక్కన కందకంలో కారు దిగి ఉందని, ఒక వ్యక్తి మరణించి ఉన్నట్టు రహదారి భద్రతా సిబ్బంది ద్వారా తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. మృతుడు పారిశ్రామికవేత్త చిగురు పాటి జయరామ్‌గా పోలీసులు నిర్ధారించారు. కారు వెనుక సీటులో మృతదేహం పడిన తీరు, తలపై గాయాలు ఉండటంతో జయరామ్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని ముఖంపై రక్తం మరకలు, కారులో రెండు బీరు బాటిల్స్, మరో రెండు లిక్కరు బాటిల్స్, వాటర్ బాటిల్స్‌తోపాటు రెండు సూట్ కేసులు ఉన్నాయి. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన కారు నడిపిన డ్రైవరు ఎవరు, విజయ వాడలో జయరామ్ ఎవరెవరిని కలిశారన్న విషయాలు తెలియాల్సి ఉంది. గుంటూరు జిల్లా తెనాలిలో ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన జయరామ్ అంచెలంచెలుగా కోస్టల్ బ్యాంకు డైరెక్టరుగా, ఎక్స్‌ప్రెస్ టీవీ ఎండీగా సుపరిచితులు. ఆమెరికాలోని ఓ బ్యాంకు లో కూడా ఆయన భాగస్వామిగా ఉన్నట్లు తెలిసింది. ఔషధాలు, అద్దాల తయారీ కేంద్రాలు ఉన్నట్టు తెలుస్తోంది. జయరామ్‌తో పాటు భార్య పిల్లలు అమెరికాలోని ఫ్లోరిడాలో నివాసం ఉంటున్నారు. వ్యాపార లావాదేవీల్లో విభేదాల వల్ల ఎవరైనా ఈ దారుణానికి పాల్పడ్డారా అనేది తెలియాల్సి ఉంది. కుటుంబ కలహాలు ఉన్నట్లు సమాచారం. నందిగామ డీఎస్పీ పీఎస్పీ బోస్ విలేకరులతో మాట్లాడుతూ ఆమెరికాలో నివాసం ఉంటున్న జయరామ్ గత నెలలో హైదరాబాద్ వచ్చారని, బుధవారం మధ్యాహ్నం ఇంటి నుండి విజయవాడ వెళ్తున్నట్లు అందరికి చెప్పి బయలుదేరారన్నారు. అప్పటి నుండి ఎవరికీ అందుబాటులో లేరన్నారు. గురువారం సాయంత్రం విజయవాడలోని కోస్టల్ బ్యాంకు మేనేజర్‌కి ఫోన్ చేసి తాను వస్తున్నానని, బస ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిసిందన్నారు. ఈ కారు ప్రమాదానికి గురికా లేదని, జయరామ్ మృతదేహం డ్రైవరు సీటు వెనుక భాగంలో పడి ఉందని, తలపై గాయాలు ఉన్నందున హత్యగా భావిస్తున్నామన్నారు. ఘటనా స్థలాన్ని చేరుకున్న తర్వాత తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లాలోని వివిధ టోల్‌గేట్ల వద్ద సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించామన్నారు. పతంగి టోల్‌గేటు వద్ద తెల్లని ఫుల్ హ్యాండ్స్ ధరించిన వ్యక్తి డ్రైవర్ సీటు నుంచి టోల్‌గేటు కట్టినట్లు కనిపించిందన్నారు. చిల్లకల్లు టోల్‌గేటు వద్ద డ్రైవరు సీటులో కూర్చొన్న వ్యక్తి దృశ్యాలు అస్పష్టంగా ఉన్నాయని, వీటి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశామన్నారు. జయరామ్ మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జయరామ్ బంధువులకు సమాచారం అందించారు. జయరామ్ కారు డ్రైవరు సతీష్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. జయరామ్ హత్య జరిగిన ప్రదేశాన్ని కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. కేసు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

కొండపల్లికోటలో సాంకేతిక హంగులు

విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : రాష్ట్ర రాజధాని ప్రాంతంలోని కొండపల్లికోటను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత సుందర పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్టు రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ తెలిపారు. కృష్ణాజిల్లా కొండపల్లి కోటలో శుక్రవారం వాణీమోహన్ విలేకరులతో మాట్లాడుతూ కొండపల్లి కోటలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంటున్న రాజుల ఫొటో గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందన్నారు. రాజుల ఫొటోపై స్మార్ట్ ఫోన్ ఉంచితే ఆ రాజు పరిపాలించిన కాలం, ప్రత్యేకతలు ఆయన మాటలలోనే వినిపిస్తాయన్నారు. కొండపల్లి బొమ్మలపై మొబైల్ ఫోన్ ఉంచితే బొమ్మలు నాట్యం చేస్తాయన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం దక్షిణ భారతదేశంలో తొలిసారి కోటలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్మెంటెడ్ రియాలిటీ ఆబ్జెక్టివ్ సాంకేతిక పరిజ్ఞానంతో ఇది సాధ్యమయ్యిందన్నారు. గత ఏడాది నుంచి రూ.10 కోట్లతో కోటలో చేపట్టిన పునరుద్ధరణ పనులను ఈ నెల 3, 4 తేదీల్లో కొండపల్లి ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారన్నారు. పునరుద్ధరణ పనులతో కొండపల్లి కోట అత్యంత సుందరంగా దర్శనమిస్తుందన్నారు. కేంద్ర ఆర్కియాలజీ శాఖ నిబంధనల ప్రకారం సిమెంట్, ఇటుక వాడకుండా సహజసిద్ధమైన కలబంద, సున్నం, కరక్కాయలు, గోగునారతో పనులు చేశామన్నారు. గజశాల, దర్బార్ హాల్, రంగమహల్, రాయల్ క్వార్టర్స్, దివాన్-ఇ-ఖాస్, మార్కెట్ యార్డ్, ధాన్యాగారం, జైల్ ఖానా, తోప్ ఖానా, అత్త, కోడళ్ల చెరువులు, హనుమాన్ మండపం పనులను దశల వారీగా చేపట్టనున్నట్టు చెప్పారు. క్రీ.శ. 11వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు కొండపల్లి కోటను కాకతీయులు, రెడ్డిరాజులు, కృష్ణదేవరాయలు, మొగల్స్, కులీ కుతుబ్ షాహీలు, బ్రిటిష్ వాళ్లు మిలటరీ స్థావరంగా వినియోగించుకున్నారన్నారు. కృష్ణానది పక్కన ఉండటం, మచిలీపట్నం పోర్టుకు దగ్గర కావడంతో ఈ కోట ప్రముఖ వాణిజ్య కేంద్రంగా విలసిల్లడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ ప్రదర్శన ద్వారా రోజుకు రెండు షోలు 30 నిమిషాలపాటు 300 నుంచి 400 మంది కూర్చుని వీక్షించేలా కొండపల్లికోట చరిత్రను ప్రదర్శిస్తామన్నారు. రాబోయే రోజుల్లో కోటను సందర్శించే పర్యాటకులకు రవాణా సౌకర్యాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. కొండపల్లి కోటలో నిర్వహించనున్న యువజన సర్వీసులశాఖ అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో 16 రాష్ట్రాలు, ఆరు దేశాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రాక్ క్లైంబింగ్, రోప్ క్లైంబింగ్‌కు కోట అనుకూలంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 3, 4 తేదీల్లో కొండపల్లి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కొండపల్లి కోటలో క్యాంటీన్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ స్థాయి ప్రయాణాలతో విజయవాడలో రూపుదిద్దుకున్న బాపూజీ మ్యూజియం రెండు, మూడు నెలల్లో ప్రారంభమవుతుందన్నారు.డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

5న హిందూ ఫాసిస్టుదాడుల వ్యతిరేక సదస్సు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : కేంద్రంలో ఆర్ఎస్ఎస్ భావజలంతో బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రాచీన భారత సంస్కృతి, దేశభక్తి పేర్లతో మోదీ ప్రభుత్వ సహకారంతో సంఘ్‌పరివార్ శక్తులు హేతువాదులపై, సాహిత్యవేత్తలపై, జర్నలిస్టులపై దాడులకు తెగబడుతున్నాయన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక, ఆర్థిక అసమానతలు, సామ్రాజ్యవాద దోపిడీ, బడా పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలకు ఊడిగం చేస్తూ దోచుకుంటున్న పాలకులు ప్రజల దృష్టిని మళ్ళించడానికి పథకం ప్రకారం ఇలాంటి దాడులు కొనసాగిస్తున్నారన్నారు. నోట్లరద్దు, జీఎస్టీ, రక్షణరంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రమాదకర సంకేతాలన్నారు. ఈ చర్యలను ఖండిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, కవులు, రచయితలు, కళాకారులు, న్యాయవాదులపై నిర్బంధాలు ప్రయోగిస్తున్నారు.. ఈ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. పీడీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



100 ఎకరాల అరటి తోటలకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ఏపుగా పెరిగి చేతికొచ్చిన అరటి తోట అకాల వర్షంతో నేల కూలడంతో కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండల రైతులు గగ్గోలు పెడుతున్నారు. నేడో రేపో అరటి గెలలు అమ్ముకుంటామని ఆనందపడిన రైతుల కుటుంబాలకు నిరాశ మిగిల్చింది. తయారైన గెలలతో కళకళలాడుతున్న చెట్లు వర్షానికి ఎక్కడికక్కడ విరిగి నేలపై పడ్డాయి. ఏడాది పొడవునా కంటికి రెప్పలా కాపాడిన అరటిపంట దెబ్బతినడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండల పరిధిలోని మదనంతపురం, అబ్దుల్లాపురం గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మదనంతపురం గ్రామ రైతులు బి. వెంకట్రాముడు, ఎ. మల్లారెడ్డి, వై. లక్ష్మీకాంతరెడ్డి, రంగప్ప, చిన్నరంగప్ప, చెక్క చిన్నపుల్లన్న, మద్దిలేటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బలమైన గాలులు లేకపోయినా వర్షానికి భూమి తడిసిపోయి గెలల బరువుతో ఉన్న చెట్లు వేళ్ళతో సహా విరిగి పడ్డాయి. అరటికి మార్కెట్‌లో ధర బాగుండడంతో అప్పులు తీరుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. బాధిత రైతులను ఆదుకోవాలని మదనంతపురం, అబ్దుల్లా గ్రామాల అరటి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సర్వేల గుబులు

- ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న నేతల్లో అలజడి
- సీటు వస్తుందో లేదోననే బెంగ

విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో తాజా సర్వేలు గుబులు పుట్టిస్తున్నాయి. కోరుకున్న టికెట్ వస్తుందో లేదోనన్న భయం వెంటాడుతోంది. ఈసారి టికెట్ రాదని, వేరే వారి పేరు పరిశీలిస్తున్నారన్న ప్రచారాలు ఆయా నేతలను ఆందోళనలకు గురిచేస్తున్నాయి. ప్రధాన పార్టీల అధిష్ఠానాలు, కీలక నేతలు చేయిస్తున్న సర్వేల ఆధారంగానే సీట్లు కేటాయిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. పైరవీలకు, ఒత్తిడులకు లొంగకుండా గెలిచేవారికే సీటు అని పార్టీ అధినేతలు వ్యాఖ్యానించడంతో సీటు ఆశిస్తున్న వారిలో బెంగ ఎక్కువైంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నందున సీటు కోసం అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైసీపీ, జనసేన పార్టీల అధినేతలు ప్రత్యేక సర్వేలు చేయించుకుంటున్నారు. ఈసారి అధికారమే లక్ష్యంగా అభ్యర్థుల కోసం వెతుకుతున్నారు. జిల్లాల వారీ సర్వేల ఆధారంగా ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని టికెట్లు కేటాయిస్తారని ఆయా పార్టీల నేతలు చెబుతున్నారు. టీడీపీ ఇప్పటికే రెండుసార్లు సర్వేలు చేయించినట్లు సమాచారం. గతంలో మాదిరిగా నేతల పలుకుబడి, డబ్బు, నాయకుల సిఫార్సుల ప్రకారం కాకుండా ప్రజల్లో వారికున్న సాన్నిహిత్యంతోపాటు డబ్బు ఖర్చు పెట్టగలిగే వ్యక్తుల కోసం జల్లెడ పట్టినట్టు వినికిడి. టీడీపీ సర్వే లక్ష్యం అదే అయితే జగ్గంపేట, రామచంద్రపురం, మండపేట ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, తోట త్రిమూర్తులు, వేగుళ్ళ జోగేశ్వరరావులకే సీట్లు దక్కే అవకాశాలు ఉన్నాయని అధికార పార్టీ నేతలే అంటున్నారు. వీరితోపాటు రెండో విడతలో పెద్దాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, పిఠాపురం ఎమ్మెల్యే వర్మ, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజోలు ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావుకు మాత్రమే సీట్లు దక్కుతాయని ప్రచారం జరుగుతోంది. మిగిలిన స్థానాల్లో కొత్తవారికి అవకాశం వస్తుందని ప్రచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు సర్వేల ఆధారంగా సీట్లు ఇవ్వాల్సివస్తే తొలుత తుని నియోజకవర్గంలో యనమల కృష్ణుడిని మార్చితే అమలు జరిగినట్లు భావిస్తామని టీడీపీ ముఖ్య నేత ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. అధినేత సర్వేల ప్రకారం జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కేవలం పది మందికే సీట్లు దక్కుతాయని భావిస్తున్నారు. మరో తొమ్మిది స్థానాల్లో కొత్తవారికి అవకాశం ఇస్తారని అంటున్నారు. వైసీపీలో కోఆర్డినేటర్ల మార్పుల నేపథ్యంలో వారికి సీటు ఇచ్చే అవకాశం లేదని తేలిపోయింది. పెద్దాపురం, మండపేట, కాకినాడ వంటి కొన్ని నియోజకవర్గాల్లో కొత్త వ్యక్తులకే సీట్లు ఇవ్వనున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా నియోజకవర్గాల్లో ప్రజాభిప్రాయం సేకరిస్తున్నట్లు తెలిసింది. దానికి అనుగుణంగానే సీట్లు కేటాయిస్తారని పార్టీల నేతలు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు అభ్యర్థుల గుణగణాలు, ఆర్థిక బలం, ప్రజాభిప్రాయం మేరకే సీట్లు కేటాయిస్తాయని ప్రచారం జరుగుతోంది.

గతంలోనూ ఇలాగే...

ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కీలక ప్రకటనలు

న్యూఢిల్లీ : ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో సాధారణంగా సార్వత్రిక ఎన్నికలలోపు ప్రభుత్వ ఖర్చులకు సంబంధించిన కేటాయింపులు మాత్రమే ఉంటాయి. కానీ, ఈ సంప్రదాయాన్ని ఉల్లంఘించి కొన్ని సందర్భాలలో కీలక ప్రకటనలు జరిగాయి. తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఓటర్లనే లక్ష్యంగా చేసుకుని వరాల జల్లును కురిపించారు. ఇది ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ అయినప్పటికీ వ్యవసాయ రంగానికి, మరికొన్ని రంగాలకు మేలు జరిగేలా కేటాయింపులను ప్రకటించారు. ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకోవడం వంటివి గతంలో కూడా జరిగాయి. ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం 2014-15 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కీలక ప్రకటనలు చేశారు. అప్పటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సాధారణ బడ్జెట్ వరకు వేచి చూడలేమని, పరోక్ష పన్నుల విధానంలో పలు మార్పులు చేస్తున్నట్లు ప్రకటించారు. దానివల్ల ఆటోమొబైల్స్, మొబైల్ ఫోన్స్, ఇండస్ట్రియల్ ఆయిల్స్‌పై సుంకాలు తగ్గాయి. బియ్యం లోడ్ చేయడం, దించడం, ప్యాకింగ్, నిల్వ చేయడంపై సేవా పన్ను మినహాయించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా రక్షణ బలగాల కోసం 'ఒకే ర్యాంకు ఒకే పింఛను' సూత్రాన్ని అంగీకరించారు. చిదంబరానికి ముందు కూడా ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కీలక మార్పులు చేసిన ఆర్థిక మంత్రులు ఉన్నారు. 2009-10 ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ కూడా కొన్ని కీలక ప్రకటనలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులలో వాణిజ్య బ్యాంకు రుణాలను 60శాతం వరకు రీఫైనాన్స్ చేయడానికి ప్రతిపాదనలు చేశారు.

ఇది మౌలిక రంగంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులకు సంబంధించింది. అంతకంటే ముందు 2004-05 ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో నాటి ఆర్థిక మంత్రి జశ్వంత్ సింగ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మూల వేతనంలో 50శాతం డీఏను కలపాలని ప్రతిపాదించారు. వ్యవసాయ ఆదాయ బీమా పథకం 20 జిల్లాల నుంచి 100 జిల్లాలకు విస్తరింపజేస్తున్నట్లు ప్రకటించారు.



కేంద్ర ప్రభుత్వ ఖర్చులు

INTERIM BUDGET 2019-20

2019-20 బడ్జెట్‌లో అంచనాలు (రూ.కోట్లలో)

హెడ్స్		హెడ్స్	
పెన్షన్లు	1,74,300	ఇంటరెస్ట్	6,65,061
రక్షణ రంగం	3,05,296	ఐటీ మరియు టెలికాం	21,549
ప్రధాన సబ్సిడీల కోసం	2,96,684	ప్లానింగ్ మరియు స్టాటస్టిక్స్	5,594
వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు	1,49,981	గ్రామీణాభివృద్ధికి	1,38,962
వాణిజ్యం మరియు పరిశ్రమలకు	27,660	సాంకేతిక శాఖకు	26,237
ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం	3,000	సాంఘిక సంక్షేమ శాఖకు	49,337
విద్యకు	93,848	ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్‌కు	1,17,285
ఇంధన రంగానికి	44,101	రాష్ట్రాల బదిలీలకు	1,66,883
విదేశీ వ్యవహారాల శాఖకు	16,062	రవాణా వ్యవస్థకు	1,56,187
ఆర్థిక శాఖకు	19,812	కేంద్ర పాలిత ప్రాంతాలకు	15,042
ఆరోగ్య రంగానికి	63,538	పట్టణాభివృద్ధికి	48,032
హోంశాఖకు	1,03,927	ఇతర రంగాలకు	75,822
		మొత్తం	27,84,200

పెరగని 'ఉపాధి'

రూ.60 వేల కోట్లు కేటాయింపు - గతేడాది రూ.55 వేల కోట్లు


సవరించిన అంచనాలకంటే 1.80 శాతం తక్కువ

న్యూఢిల్లీ : వామపక్షాలు, వ్యవసాయ కార్మికులు పోరాడి సాధించుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంపై (ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్) కేంద్రం చిన్న చూపు చూస్తోంది. పేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులపాటు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ పథకానికి ఏటా నిధుల కేటాయింపులో మోడీ సర్కార్ భారీగా కోత పెడుతోంది. నాలుగేళ్ల కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులను ఎన్‌డీఏ తగ్గస్తూ వస్తోంది. గతేడాది ఉపాధి హామీ పథకానికి రూ.55 వేల కోట్లను కేటాయించగా, సవరించిన అంచనాల ప్రకారం అది రూ.61,084 కోట్లకు పెరిగింది. 2019-20 మధ్యంతర బడ్జెట్‌లో ఉపాధికి కేవలం రూ.60 వేల కోట్లనే ఇన్‌చార్జి ఆర్థికశాఖ మంత్రి పీయూష్ గోయల్ కేటాయించారు. గతేడాదితో పోల్చితే ఇది 1.80 శాతం తక్కువకావటం గమనార్హం. గోయల్ మాత్రం తన ప్రసంగంలో ఉపాధి నిధులను తొమ్మిదిశాతం పెంచామని గొప్పగా పేర్కొనటం శోచనీయం. ఏటా గతేడాది సవరించిన అంచనాలనే బడ్జెట్‌లో కేటాయిస్తుండగా, ఈ ఏడాది మాత్రం ఏకంగా రూ.వెయ్యి కోట్లను తగ్గించేయటం శోచనీయం. ఇప్పటికే ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించని పరిస్థితి నెలకొంది. ఉపాధి పథకం నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మంది పేదలు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలసపోతున్నారు. ఉపాధిని బాగా ఉపయోగించుకుంటున్న రాష్ట్రాలకు నిధులను తొక్కిపెడుతుండగా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం ఏటా 150 రోజుల పనిదినాలు కల్పిస్తున్నారు. ప్రగతి నివేదికలో ఉపాధిని గొప్పగా చెప్పుకున్న ఎన్‌డీఏ ప్రభుత్వం కేటాయింపుల్లో అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవటం శోచనీయం.

ఉపాధి పథకానికి కేటాయింపు ఇలా..

సంవత్సరం	కేటాయింపు (రూ.కోట్లలో)	సవరించినవి (రూ.కోట్లలో)
2016-17	38,500	47,499
2017-18	48,000	55,000
2018-19	55,000	61,084
2019-20	60,000	--





ఖర్చుల వివరాలు పైసల్లో..

రూపాయి ఇలా..


న్యూఢిల్లీ : ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయిలో కూడా 70 పైసలు ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నుంచే వస్తోంది. పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాట కోసం ప్రభుత్వం 23 పైసలు వెచ్చిస్తోంది. ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం పార్లమెంట్‌కు సమర్పించిన 2019-20 ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయిలో కూడా 21 పైసలు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూలు నుంచే వస్తోంది. ఇదే అతిపెద్ద ఆదాయ వనరుగా ఉన్నది. రుణాలు, ఇతర బాధ్యతల నుంచి వసూళ్లు 19 పైసలు కాగా, కేంద్ర ఎక్సైజ్ సుంకాల నుంచి 7 పైసలు సమకూరుతోంది. పెట్టుబడుల ఉపసంహరణ వంటి పన్నుఏతర ఆదాయం ద్వారా 8 పైసలు సంపాదించాలని ప్రభుత్వం భావిస్తోంది, రుణేతర పెట్టుబడుల వసూళ్ల ద్వారా 3 పైసలు సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అదేవిధంగా, కార్పొరేట్ పన్ను ద్వారా పన్ను వసూళ్లను 21 పైసలుగా ప్రభుత్వం నిర్ధారించింది. ఆదాయపు పన్ను 17 పైసలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కస్టమ్స్ సుంకం ద్వారా 4 పైసలు సంపాదించాలని ప్రభుత్వం భావిస్తోంది. వ్యయాలకు సంబంధించి పన్నులు, సుంకాలలో రాష్ట్రాల వాట చెల్లింపు కోసం 23 పైసలు ఖర్చుచేస్తోంది. పన్నుల చెల్లింపు కోసం 18 పైసలు ఖర్చుచేస్తోంది. కేంద్ర రంగ పథకాల కోసం 12 పైసలు వెచ్చించనున్నది. కేంద్రం నిర్వహించే పథకాల కోసం 9 పైసలు ఖర్చుచేస్తుంది. ఆర్థిక కమిషన్, ఇతర బదిలీల కోసం 8 పైసలు ఖర్చు అవుతుంది. సబ్సిడీలు, పెన్షన్‌ల కోసం వరుసగా 9 పైసలు, 5 పైసలు ఖర్చు చేస్తారు. ఇతర వ్యయాల కోసం 8 పైసలు వెచ్చిస్తుంది. రక్షణ శాఖకు సంబంధించి వ్యయాన్ని గత ఏడాది 9 పైసల నుంచి ఈ ఏడాది 8 పైసలకు తగ్గించింది.

సినీ నిర్మాణాలకు సింగిల్ విండో అనుమతులు

న్యూఢిల్లీ : సినీ నిర్మాణానికి సింగిల్ విండో అనుమతులిస్తామనీ, సినిమా టికెట్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గిస్తామని 2019 ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఆయన భారతీయ చలన చిత్ర పరిశ్రమ గురించి ప్రస్తావించారు. వినోదాత్మక రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. పైరసీని అంతమొందించేందుకు సినిమాటోగ్రఫీ యాక్ట్ కింద సింగిల్ విండో క్లియరెన్స్, యాంటీ క్యామ్‌కార్డింగ్ ప్రొవిజన్ ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ సింగిల్ విండో క్లియరెన్స్ ప్రక్రియ విదేశీ చిత్రాలకు మాత్రమే ఉందనీ ఇప్పుడు భారతీయ చిత్రాలకు కూడా దీన్ని వర్తింపజేయడంతో చిత్ర పరిశ్రమకు ఊరట లభిస్తుందని చెప్పారు. ఇటీవల విడుదలైన 'ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్స్' సినిమాను తాను చూశానని, సినిమాలో ఫన్ మాత్రమే కాకుండా జోష్ కూడా ఉందని పీయూష్ పేర్కొన్నారు. సింగిల్ విండో క్లియరెన్స్ ద్వారా ఇతర ప్రదేశాల్లో చిత్రీకరణ జరపడానికి త్వరగా అనుమతి లభించే వెసులుబాటు ఉందని చెప్పారు. సినిమా టికెట్లపై జీఎస్టీని తగ్గించారు. రూ.100 టికెట్లపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించారు. రూ.100 మించిన టికెట్ల ధరపై 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. ఇటీవల చిత్ర పరిశ్రమకు సంబంధించిన అంశాలపై బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో వినోదాత్మక రంగానికి బడ్జెట్‌లో పై వాటిని కేటాయించారు.

టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు

టెలికాంరంగంలో విప్లవాత్మక మార్పులకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని బడ్జెట్ ప్రసంగంలో గోయల్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో డేటా వాయిస్ కాల్స్ సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. 24 గంటల్లో ఐటీఆర్ ప్రాసెస్, రిఫండ్ పూర్తి చేస్తామని తెలిపారు.



50కోట్ల మందికి వైద్య సదుపాయాలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య రక్షణ పథకమైన ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఇప్పటి వరకు 10 లక్షల మంది రోగులు వైద్యం చేయించుకున్నారని మంత్రి గోయల్ తెలిపారు. జన ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే మందులు విక్రయిస్తున్నామని చెప్పారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు దేశంలో 21 ఎయిమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. 22వ ఎయిమ్స్ హర్యానా రాష్ట్రంలో నిర్మితమవుతోందని తెలిపారు.

చరిత్ర సృష్టించిన బడ్జెట్: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ : మధ్యంతర బడ్జెట్‌ను చరిత్రాత్మకమైనదిగా కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కొనియాడారు. ఇది ఆర్థికవ్యవస్థను పరిపుష్టం చేయడమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తుందని వ్యాఖ్యానించారు. ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీనిపై రాజ్‌నాథ్‌సింగ్ పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడారు. ఆదాయపన్ను పరిమితిని రూ.5 లక్షలు అంటే రెట్టింపు చేయడం, స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేలకు పెంచడం, బ్యాంకు డిపాజిట్లు, అద్దెల నుంచి ఆదాయపన్నులో రాయితీ కల్పించడం సహా మధ్యతరగతికి మేలు చేసే ఎన్నో ప్రతిపాదనలు తీసుకొచ్చామన్నారు. దేశం ఆర్థికంగా పటిష్టవంతం కావాలని తమ ప్రభుత్వం కోరుకుంటున్నదని, అదే బడ్జెట్ లక్ష్యమని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాలకు ఈ బడ్జెట్ మేలు చేకూరుస్తుందని అన్నారు.

ప్రతిపక్షాలపై సర్జికల్ స్ట్రైక్ : కేంద్రమంత్రులు

మధ్యంతర బడ్జెట్‌ను ప్రతిపక్షాలపై సర్జికల్ స్ట్రైక్‌గా కేంద్రమంత్రులు రామ్ విలాస్ పాశ్వాన్, ఆర్‌కే సింగ్ అభివర్ణించారు. ఇది రెండో మెరుపుదాడి. సరిహద్దుల్లో మన సైనికులు బుల్లెట్లతో చేసిన యుద్ధం మొదటి సర్జికల్ స్ట్రైక్ అని పేర్కొన్నారు. ఇది బ్యాలెట్ స్ట్రైక్ అని వ్యాఖ్యానించారు. బడ్జెట్‌ను ప్రతిపక్షాలు స్వాగతిస్తాయని సింగ్ చెప్పుకొచ్చారు. కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి మహేష్ శర్మ స్పందిస్తూ సామాన్యులు, సేవారంగం వారికి ఈ బడ్జెట్ ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. పేదలకూ ఇది ఉపయోగకరమని అన్నారు.

'స్వామినాథన్' సిఫార్సులకు తిలోదకాలు

రైతులకు గిట్టుబాటు ధర కల్పనలో 'మోడీ' విఫలం

ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు ప్రభుత్వాలు తిలోదకాలిస్తూ..రైతాంగాన్ని నిలువునా మోసగిస్తున్నాయని ఆల్ ఇండియా కిసాన్‌సభ (ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య విమర్శించారు. ముంబయిలో కొనసాగుతున్న ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో శుక్రవారం ఆయన ప్రసంగించారు. వ్యవసాయంపై క్రమేపీ పెట్టుబడిభారం పెరిగి, పంటలకు గిట్టుబాటు ధరల్లేక అప్పులఊబిలో రైతులు కూరుకుపోతున్నారని విశ్లేషించారు. దీనికి పరిష్కారంగా..రైతుల పెట్టుబడి, శ్రమ, కౌలు, దిగుమతి, ఆదాయాలలో 60శాతం పెంచి ధరలను నిర్ణయించాలని డిమాండు చేశారు. రైతులకు నష్టమొస్తే 60శాతం చెల్లించాలని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని స్వామినాథన్ కమిషన్ స్పష్టంగా పేర్కొందన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రైతుల శ్రమను, కౌలును పరిగణలోకి తీసుకోకుండా మోడీ సర్కారు ఇష్టానుసారంగా ధరలను నిర్ణయిస్తోందని దుయ్యబట్టారు. బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల నుంచి రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండు చేశారు.



మోడీ మోసపూరిత బడ్జెట్టును రైతులు వ్యతిరేఖించాలి : కేవీవీ ప్రసాద్

ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ నివేదికను ప్రవేశపెట్టి మాట్లాడారు. మోడీ మోసపూరిత బడ్జెట్టును రైతులంతా వ్యతిరేఖించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్టులో ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి కిస్సాన్ సమ్మాన్ నిధి' అంతా మోసపూరితమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు వ్యసాయాన్ని లాభసాటిగా మార్చుతానని, ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోడీ హామీలిచ్చారని గుర్తుచేశారు. ఈయన ఐదేళ్ల పాలనలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను, ధరల స్థిరీకరణనిధిని ఏర్పాటులో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కరువు, తుపాన్ల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకుగాను ఎక్కడా శాశ్వత చర్యలు చేపట్టలేదని చెప్పారు. రెండేళ్లుగా దేశంలో కొనసాగుతున్న రైతాంగ ఉద్యమాలతో మోడీ సర్కారు బెంబేలెత్తుతోందని, దీంతో ఎన్నికల్లో డబ్బులు ఎరగావేసి ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు రుణవిముక్తి కల్పించలేదని దుయ్యబట్టారు. ఐదేళ్లలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని వివరించారు. కరువు నివారణకు శాశ్వత పరిష్కారం చూపలేదని, నీటిపారుదల ప్రాజెక్టులు నిర్దిష్టకాల వ్యవధిలో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఈ సమావేశంలో ఏపీ నుంచి రైతు సంఘాల నాయకులు కాటమయ్య, యలమందారావు, సీతారామయ్య, చంద్ర, విద్యాధరరావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టంలో అంశాలు కేంద్రం అమలు చేయాలి : కత్తి

విశాలాంధ్ర- అమరావతి : ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని ప్రతి అంశాన్ని తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శాసన మండలి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014పై చర్చ జరుగుతున్న సమయంలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా కేంద్రమిచ్చిన హామీలు అమలు చేయకపోవడం సమంజసం కాదన్నారు. కేంద్రం నిరంకుశ వైఖరి అవలంబించటంతో ప్రజలు ఈ విధంగా రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేయవలసి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాలు పటిష్టంగా ఉంటేనే దేశం పటిష్టంగా ఉంటుందని అన్నారు. రాష్ట్రంపై చిన్న చూపు తగదని, తక్షణమే చట్టంలో ఉన్న అంశాలు అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రజలు సైతం అదే అడుగుతున్నారని చెప్పారు. పోలవరం, రాజధాని నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు.

కేంద్రంపై 'సుప్రీం' అసహనం

సీబీఐ చీఫ్‌ను నియమించకపోవడంపై ఆగ్రహం

న్యూఢిల్లీ : సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ)కు ఇప్పటి వరకూ చీఫ్‌ను నియమించకపోవడంతో కేంద్రంపై సుప్రీం కోర్టు శుక్రవారం అసహనాన్ని ప్రదర్శించింది. సుదీర్ఘకాలం తాత్కాలిక డైరెక్టర్‌ను నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ అరుణ్ మిశ్రా, నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం దీనిపై వ్యాఖ్యానిస్తూ సీబీఐ డైరెక్టర్ పోస్టు సున్నితమైనదని, దీనిపై తక్షణమే కేంద్రం నిర్ణయం తీసుకుని, రెగ్యులర్ డైరెక్టర్‌ను నియమించాలని ఆదేశించింది. ప్రధానమంత్రితో కూడిన హైపర్ కమిటీ శుక్రవారం సమావేశమై కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేసే నిర్ణయం తీసుకున్నట్లు అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కోర్టుకు విన్నవించారు. అంతేకాకుండా తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం నాగేశ్వరరావును నియమించే ముందు కోర్టు అనుమతులు కూడా తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వేణుగోపాల్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం కేసును ఫిబ్రవరి 6వ తేదీని వాయిదా వేసింది. సీబీఐకి తాత్కాలిక డైరెక్టరును నియమించడంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. విచారణ సమయంలో కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కొత్తగా నియమితులయ్యే సీబీఐ చీఫ్ సీబీఐలో జరిగే వ్యవహారాలపై కన్నేసి ఉంచాలని, ముఖ్యంగా సీబీఐ చీఫ్‌గా రెండురోజులు పనిచేసిన అలోక్ కుమార్ వర్మ వ్యవహారంలో మరింత కఠినంగా ఉండాలని ఆదేశించింది. చివరిగా హైపవర్ కమిటీ సమావేశం జనవరి 24న జరిగింది. అయితే ఈ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు. దీని తాలూకా మినిట్స్ రిపోర్ట్‌ను అటార్నీ జనరల్ సీల్డ్ కవర్‌లో ధర్మాసనానికి అందజేశారు. ఈ సందర్భంగా స్వతంత్ర సంస్థ తరఫున వాదిస్తున్న లాయర్ ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ... సీబీఐ చీఫ్ నియామకంలో ఎంత పారదర్శకత ఉందన్న విషయాన్ని సుప్రీం కోర్టు కూడా తెలుసుకోవాలని ఆయన కోరారు. దీనికి స్పందించిన ధర్మాసనం 'మీకేం కావాలి.. వెంటనే నియామకం జరగాలి. అంతేకదా.. అయితే అక్కడే ఆగండి. ముందు నియామకం కానివ్వండి. నియామక ప్రక్రియ పారదర్శకతతో జరగలేదని మీకు అనిపిస్తే.. తప్పకుండా కోర్టును ఆశ్రయించు' అని పేర్కొంది. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమించడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం గురువారం జస్టిస్ అరుణ్ మిశ్రాతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. అంతకుముందు ఈ కేసును తాను కూడా విచారణ చేయలేనని జస్టిస్ ఎన్వీ రమణ తప్పుకున్న విషయం తెలిసిందే. ఈ కారణంగానే సుప్రీం కోర్టు వేరే ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

డీఎస్పీ కేసుపై సీబీఐ వివరణ కోరిన సుప్రీం

సీబీఐ డీఎస్పీగా పని చేసిన ఏకే బస్సీని పోర్టు బ్లేయర్ బదిలీ చేయడంపై దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. దీనిపై తక్షణమే స్పందించి వివరణ ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. ఆరు వారాల్లోపు సరైన వివరణ ఇవ్వాలని చీఫ్ జస్టిస్ రంజన్ గగోయ్, సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసం ఆదేశాలు జారీ చేసింది. బస్సీ తరఫున సీనియర్ అడ్వకేట్ రాజీవ్ ధావన్ వాదించారు. సీబీఐలో జరిగిన పాలనతీరును ఈ కేసు ప్రతిబింబిస్తోందని ధావన్ తెలిపారు. అంతేకాకుండా ఇది విచారణపై కూడా ప్రభావం చూపిందన్నారు.

హోదా, విభజన అంశాల అమల్లో కేంద్రం వివక్షపూరిత వైఖరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు విషయంలో కేంద్రప్రభుత్వ వివక్ష పూరిత తీరు పట్ల శాసనసభ తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ తీర్మానించింది. అసెంబ్లీలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుపై లఘు చర్చ జరిగింది. ఈచర్చలో సీఎం చంద్రబాబుతో సహా మొత్తం 16 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం రవాణాశాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు విభజన అంశాల అమల్లో కేంద్ర తీరును నిరసిస్తూ తీర్మానం ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కో-ఆపరేటివ్ ఫెడరల్ వ్యవస్థలో కేంద్రానికి అన్ని రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి పట్ల బాధ్యత ఉంది. మరీ ముఖ్యంగా ఏపీ ప్రజల అభీష్టానికి విరుద్ధంగా, అన్యాయంగా విభజన జరిగి కష్టాల్లో ఉన్న నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పట్ల ఆ బాధ్యత మరింత ఎక్కువ ఉండాల్సింది పోయి కేంద్రం అందుకు భిన్నంగా వివక్షపూరిత ధోరణిలో వ్యవహరించడం దుర్మార్గంగా ఈ శాసనసభ భావిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇప్పటివరకు దీనిపై శాసనసభ నాలుగుసార్లు తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, ప్రస్తుతం 5వసారి తీర్మానం చేస్తున్నా మని మంత్రి తెలిపారు. ఇకనైనా చట్టంలో వున్న అంశాలను అమలు చేసి తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శాసనసభ తీర్మానించింది.

డీఏ పెంపు ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: (ఆర్టీసీ) ఉద్యోగులకు ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి పెరగాల్సిన దినసరి భత్యం (డీఏ) ఉత్తర్వులను సంస్థ వైస్ చైర్మన్, ఎండీ ఎన్.వి. సురేంద్రబాబు శుక్రవారం జారీ చేశారు. దీంతో ఉద్యోగులకు ప్రస్తుతం వస్తున్న డీఏ 37.20 నుంచి 40.85 శాతానికి పెరుగుతుంది. తద్వారా 3.65 శాతం పెరుగుదల నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ డీఏ ఫిబ్రవరి వేతనంతో కలిపి మార్చి ఒకటో తేదీన చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి నెలకు సంబంధించిన బకాయిలను కూడా మార్చి నెల వేతనంలో కలుపుతామన్నారు. సంస్థ ఎండీ తీసుకుంటున్న కార్మిక సంక్షేమ చర్యలో భాగంగా ఎప్పటి డీఏను అప్పుడే ప్రకటించి సాధ్యమైనంత వరకూ బకాయిలు నిలుపుదల లేకుండా అమలు చేస్తునట్లు తెలిపారు.

విశాలాంధ్ర

క్రీడలు



కివీస్ అలవోక విజయం

- 3వ వన్డేలో 8 వికెట్ల తేడాతో గెలుపు
- భారత క్లీన్‌స్వీప్ ఆశలపై నీళ్లు
- 2-1తో సిరీస్ టీమిండియా సొంతం

హామిల్టన్: భారత మహిళల సిరీస్ స్వీప్ ఆశలపై న్యూజిలాండ్ మహిళల క్రికెట్ జట్టు నీళ్లు జల్లింది. మూడు వన్డేల సిరీస్‌లోని ఆఖరి వన్డేలో టీమిండియాపై అలవోక విజయం సాధించిన కివీస్, భారత ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను మిథాలీ సేన క్లీన్‌స్వీప్ చేయకుండా కివీస్ జట్టు విజయవంతంగా అడ్డుకుంది. వరుసగా తొలి రెండు వన్డేలను గెలిచి ఇప్పటికే వన్డే సిరీస్‌ను చేజిక్కించుకున్న టీమిండియా చివరి వన్డేలో అన్ని విభాగాల్లో పూర్తిగా విఫలమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత మహిళలు నిర్ధేశించిన 150 పరుగుల సునాయస లక్ష్యాన్ని ఆతిథ్య జట్టు 29.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తి చేసింది. కివీస్ స్టార్ బ్యాట్స్‌వుమన్ సజై బేట్స్ (57 పరుగులు 64 బంతుల్లో 8ఫోర్లు, 1 సిక్సర్), సారథి సాటర్‌వెయిట్ (66 నాటౌట్ 74 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్సర్)లు అర్ధసెంచరీలు సాధించి విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక చివరి వన్డేలో టీమిండియాను స్వల్పస్కోర్‌కే కట్టడి చేయడంతో కీలకపాత్ర పోషించిన కివీస్ బౌలర్ పీటర్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'.. సిరీస్‌లో బ్యాటింగ్‌లో రాణించిన స్మృతి మంధనాకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు గెలుచుకున్నారు. పిచ్ బౌలింగ్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్ ఎంచుకోగా, కివీస్ బౌలర్లు అన్నా పీటర్సన్(4/21), తహుహు (3/28) ధాటికి భారత జట్టు 149 పరుగులకే ఆలౌటైంది. తొలి రెండు వన్డేల్లో అదరొట్టిన స్మృతి మంధన(1), రోడ్రిగ్స్(12), మిథాలీ(9)లు ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో 39 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి టీమిండియా కష్టాల్లో పడింది. ఈ క్రమంలో దీప్తి శర్మ(52) హర్మన్ ప్రీత్ కౌర్(24) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. నాలుగో వికెట్‌కు 48 పరుగులు జోడించిన అనంతరం హర్మన్‌ను పీటర్సన్ పెవిలియన్‌కు చేర్చింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. జట్టును దీప్తి శర్మ జట్టు ఆదుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న అనంతరం దీప్తి శర్మ కూడా పీటర్సన్ బౌలింగ్‌లోనే వెనుదిరిగింది. చివర్లో హేమలత(13), గోస్వామి(12) పరుగులు చేయడంతో టీమిండియా గౌరవప్రదమైన స్కోర్‌ను సాధించగలిగింది. కివీస్ బౌలర్లలో పీటర్సన్ నాలుగు, లీ తహుహు మూడు, కెర్ర్ 2 కెట్లతో టీమిండియా పతనాన్ని శాసించారు.

మిథాలీ డబుల్



హామిల్టన్ : ఇదేంటి.. మూడో వన్డేలో టీమిండియా ఓడిపోతే.. మిథాలీ డబుల్ ఏంటా అనుకుంటున్నారా.. అదేనండీ.. భారత మహిళల కెప్టెన్ మిథాలీరాజ్ ఏకంగా 200 మ్యాచ్‌లు ఆడేసింది. క్రికెట్‌పై వంద పేజీల పుస్తకం రాస్తే 80 వరకు ఆమె గురించే రాయల్సి ఉంటుంది. క్రికెటర్‌గా ఆమె ప్రస్థానం మహిళల క్రికెట్ పురోగమనం సమాంతరంగా సాగుతాయి. చిన్న వయసులోనే ఆటలో అరంగేట్రం చేసి ఎవరికీ సాధ్యం కాని ఘనతలు అందుకుంది. తాజాగా మరే క్రికెటర్ సాధించని ఓ రికార్డు సృష్టించింది. మహిళల క్రికెట్ ప్రపంచ చరిత్రలో ఈ ఘనత సాధించింది కేవలం మిథాలీ ఒక్కరే. న్యూజిలాండ్‌తో జరిగిన చివరి మ్యాచ్ ఆమెకు 200వ వన్డే. 36 ఏళ్ల మిథాలీ 51.33 సగటుతో 6622 పరుగులు చేసింది. 19 ఏళ్లకే వన్డే క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. చిరస్మరణీయ వన్డేలో మాత్రం భారీ స్కోరు చేయడంలో విఫలమైంది. 28 బంతుల్లో 9 పరుగులే చేసింది. ఇంకో విషయం ఏంటంటే భారత్ ఇప్పటి వరకు 263 వన్డేలు ఆడితే అందులో 200 మ్యాచుల్లో మిథాలీ ప్రాతినిధ్యం వహించింది. 200వ మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ, వీవీఎస్ లక్ష్మణ్ ఆమెను అభినందించారు.

నిష్క్రమణ అంచున భారత్

- ఇటలీ చేతిలో 0-2 తేడాతో వెనుకంజ
- డేవిస్ కప్ క్వాలిఫయర్స్



కోల్‌కతా : డేవిస్ కప్ 2019 క్వాలిఫికేషన్‌లో భారత్ నిష్క్రమణ అంచులో నిలబడింది. కోల్‌కతాలోని సౌత్ క్లబ్ లో వేదికగా భారత్-ఇటలీ మధ్య జరుగుతున్న క్వాలిఫైయింగ్ పోరులో తొలిరోజు భారత్ ఇటలీ చేతిలో 0-2 తేడాతో వెనుకబడింది. భారత్ రెండు సింగిల్స్ మ్యాచుల్లోనూ ఓటిమిపాలైంది. దీంతో శనివారం జరుగనున్న డబుల్స్ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితిలో నిలిచింది. తొలి సింగిల్స్ మ్యాచ్‌లో భారత యువ సంచలనం రామ్‌కుమార్ రామనాథన్ ఆండ్రియస్ సిప్పీ చేతిలో 6-4, 6-2 తేడాతో ఓడిపోయాడు. తొలి సెట్‌లో రామ్ ఆధిక్యంలో ఉన్నా కీలక సమయాల్లో బ్రేక్ పాయింట్లు సాధించడంలో విఫలం కావడంతో పుంజుకున్న సిప్పీ 6-4తో సెట్‌ను గెలుచుకున్నాడు. రెండో సెట్ సిప్పీ ఏకపక్షంగా సొంతం చేసుకున్నాడు. రెండో మ్యాచ్‌లో భారత నెంబర్ వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్‌ను మట్టేఓ బెర్రెట్టిని 6-4, 6-3 తేడాతో ఓడించాడు. శనివారం డబుల్స్ మ్యాచ్‌లో రోహన్ బోపన్న-దివిజ్ శరణ్‌ల జోడీ ఇటలీ సింగిల్స్ టాప్ ఆటగాడు మార్కో సిచ్చినాటో-సిమోనీ జోడీతో తలపడనుంది.



క్రీడాపద్దుపై కాస్త కనికరం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఈసారి క్రీడా పద్దుపై కాస్త కనికరం చూపించింది. 2019-2020కిగాను రూ.214.20 కోట్లను అదనంగా కేటాయించింది. క్రీడాకారులకు ప్రోత్సాహకాలను పెంచింది. కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడలకు రూ.2216.92 కోట్లు కేటాయించారు. గతేడాది ఇది 2002.72 కోట్లు కావడం గమనార్హం. దీనివల్ల భారత క్రీడా ప్రాధికార కేంద్రాలు (సాయ్), జాతీయ క్రీడా అభివృద్ధి నిధి (ఎన్ఎస్‌డీఫ్)కి కేటాయింపులు పెరిగాయి. శాయ్‌కి అదనంగా రూ.55 కోట్లు కేటాయించారు. దీంతో ఈ పద్దు రూ.395 కోట్ల నుంచి రూ.450 కోట్లకు పెరిగింది. ఎన్‌డీఎస్ఎఫ్‌కు కేటాయింపులు రూ.2 కోట్ల నుంచి రూ.70 కోట్లకు పెంచారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలను రూ.63 కోట్ల నుంచి రూ.89 కోట్లకు పెంచారు. జాతీయ క్రీడా సమాఖ్య కేటాయింపుల్లో మార్పులేమీ లేవు. రూ.245 కోట్ల నుంచి రూ.245.13 కోట్లకు సరిపెట్టారు. క్రీడాకారులకు పురస్కారాలు ఇచ్చేందుకు అదనంగా రూ.94.07 కోట్లను ప్రకటించారు. ఈ పద్దు రూ.316.93 కోట్ల నుంచి రూ.411 కోట్లకు పెరిగింది. ఖేలో ఇండియా పద్దు సైతం రూ.50 కోట్లు పెరిగి రూ.601 కోట్లకు చేరింది.

విశాఖలో 27న భారత్ - ఆస్ట్రేలియా టీ-20

నేటి నుంచి ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

విశాలాంధ్ర-విశాఖ సిటీబ్యూరో : విశాఖపట్నం ఏడీఏ-వీడీసీఏ పోతినమల్లయ్యపాలెం క్రికెట్ స్టేడియంలో ఈనెల 27న భారత్, ఆస్ట్రేలియా మధ్య రెండవ టీ20 క్రికెట్ మ్యాచ్ జరగనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, మీడియా రిలేషన్స్ మేనేజర్ సీఆర్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటికి సంబంధించి ఈ నెల 2వ తేదీ నుండి ఆన్‌లైన్ ద్వారా టికెట్ల విక్రయాలు జరగనున్నట్టు చెప్పారు. ఈ టికెట్ల ధరలు రూ.500, రూ.1200, రూ.1600, రూ.2000, రూ.4000, రూ.5000 ఉంటుందని, కావలసినవారు www.eventsnow.com వెబ్‌సైట్ నుండి పొందవచ్చని పేర్కొన్నారు.

మా బెంచ్ బలంగా ఉంది : ఎమ్మెస్కే



న్యూఢిల్లీ : భారత జట్టు బలం వారి రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లని చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. విదేశీ సిరీసుల్లో రాణిస్తున్న జట్టుపై అభిప్రాయాన్ని తెలుపుతూ 'ప్రస్తుత భారత జట్టు గొప్పతనం వారి బెంచ్ ఆటగాళ్లు. మా బెంచ్ బలంగా ఉంది. నాణ్యమైన ఆటగాళ్లు మా రిజర్వు సొంతం. సీనియర్ ఆటగాళ్లు గాయాలపాలైనా రిజర్వు ఆటగాళ్ల ప్రతిభ వల్ల జట్టు ఆటతీరులో లోపం కనబడటం లేదు. దేశవాళీ మ్యాచులో ఆటగాళ్లు రాణించడంతో సెలక్టర్లకు కొత్త కుర్రాళ్లను తరుచుగా ఆడించడానికి వీలు ఉంటుంది. అందుకే దేశవాళీ మ్యాచులకు ఎక్కువగా సెలక్టర్లు హాజరవుతున్నారు. ప్రపంచ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన కొన్ని దేశాలు ఇప్పుడు కీలక ఆటగాళ్లు తప్పుకోవడంతో నాణ్యమైన రిజర్వు ఆటగాళ్లు లేక రాణించలేకపోతున్నాయి. అందుకే భారత రిజర్వు బెంచ్‌ను రాబోయే తరాల కోసం బలంగా తయారు చేస్తున్నాం. సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ మధ్య అవగాహన బాగుంది. ఇండియా-ఏ, అండర్-19ల నుంచి యువ ఆటగాళ్లను అందించడంలో కోచ్ రాహుల్ ద్రావిడ్ పాత్ర ఎంతో ఉంది. భారత కోచ్ రవిశాస్త్రి, ద్రావిడ్ ఇంకా సెలక్టర్లు జాతీయ జట్టులో యువ ఆటగాళ్ల కూర్పుపై చర్చిస్తుంటాం' అని అన్నాడు.

కోహ్లిసేనను ఓడించడం కష్టం



ముంబై : ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టును ఓడించడం చాలా కష్టమని ఐసీసీ సీఈవో డేవిడ్ రిచర్డ్‌సన్ అన్నాడు. ప్రస్తుత టీమిండియా దుర్భేద్యంగా కనిపిస్తోందని పేర్కొన్నాడు. ప్రపంచకప్ ట్రోఫీ ఆవిష్కరణ కోసం భారత్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడాడు. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ జట్లు సైతం పటిష్ఠంగా కనిపిస్తున్నాయని డేవ్ పేర్కొన్నారు. ఇంగ్లండ్‌లో జరిగే ఈ ప్రపంచకప్‌లో 1992లో మాదిరిగా రౌండ్ రాబిన్ పద్ధతిని అనుసరిస్తున్న సంగతి తెలిసిందే. 'ప్రపంచ విజేత ఎవరో ఊహించడం కష్టం. నిజం చెప్పాలంటే భారత్ అత్యద్భుతంగా ఆడుతోంది. చాలా ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా సైతం అదరగొడుతోంది. ఈ మధ్య కాలంలో టీమిండియాలో మెరుగుదలను చూస్తుంటే ఆ జట్టును ఓడించడం చాలా కష్టంగా అనిపిస్తోంది' అని రిచర్డ్‌సన్ తెలిపారు. ఆస్ట్రేలియాలో 2020లో నిర్వహించే టీ20 ప్రపంచకప్‌లో స్నేక్ పద్ధతిని అనుసరించడంతో లీగ్ దశలో భారత్, పాక్ తలపడే అవకాశం రాలేదని డేవ్ అన్నాడు. ర్యాంకుల ప్రకారం వరుసగా ఒక్కో జట్టును రెండు గ్రూపుల్లో అమర్చాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. బహుశా ఈ రెండు జట్లు సెమీస్ లేదా ఫైనల్లో తలపడే అవకాశం ఉంటుందన్నాడు.

ఆస్ట్రేలియా భారీ స్కోరు

బర్న్స్, హెడ్ శతకాలు

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా-శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా ఓపెనర్ బర్న్స్ (172 నాటౌట్), మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ ట్రావిస్ హెడ్ (161) భారీ శతకాలు చేయడంతో.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 384 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా 28 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ హ్యారిస్ (11), ఖవాజా(0), లబస్‌చేన్(6) వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో ఓపెనర్ బర్న్స్‌కు జత కలిసిన హెడ్ ఇన్నింగ్స్‌ను ముందుకు కొనసాగించారు. తొలుత నెమ్మదిగా ఆడిన ఇద్దరూ క్రమంగా జోరు పెంచారు. ఈ క్రమంలో ఇద్దరూ శతకాలు పూర్తి చేశారు. హెడ్ 21 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 161 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔట్ కాగా, బర్న్స్ 172 పరగులతో డబుల్ సెంచరీ వైపు కొనసాగుతున్నాడు.

ఈవీఎంలపై ఈసీని కలుస్తాం

- రూ.6వేలతో రైతును అవమానిస్తున్నారు
- రాహుల్‌గాంధీ విమర్శ
- ఎన్డీయే యేతర పక్షాల భేటీ
- భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- హాజరైన చంద్రబాబు, పవార్ తదితరులు



సమావేశానికి హాజరైన కనిమొళి, శరద్ యాదవ్, శరద్ పవార్, రాహుల్, చంద్రబాబు, డి.రాజా తదితరులు

న్యూఢిల్లీ : నాలుగున్నరేళ్ల కాలంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆరోపణలు గుప్పించారు. రైతులకు సాయం పేరుతో ఏడాదికి రూ.6వేలు చొప్పున ఇస్తానంటూ కేంద్రం సన్నాయి నొక్కులు నొక్కుతుందని మండిపడ్డారు. ఏడాదికి ఆరువేలంటే రైతుకు రోజుకు రూ.17 వస్తుందన్నారు. ఇది రైతులను పూర్తిగా అవమానించడమేనని విమర్శించారు. ఈవీఎంలపై సందేహాలున్నాయని రాహుల్ చెప్పారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని అన్నారు. సోమవారం ఎన్నికల సంఘం అధికారులను కలిసి ఈవీఎంలపై తమ అభిప్రాయాలు చెబుతామని తెలిపారు. ఈవీఎంలకు సంబంధించిన డాక్యుమెంట్‌ను ఎన్నికల సంఘానికి అందజేస్తామన్నారు. ఈవీఎంలపై రాజకీయ పక్షాలతో పాటు ప్రజలకు సైతం అనేక అనుమానాలున్నాయని వివరించారు. భవిష్యత్ కార్యాచరణపై ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 'సేవ్ ది నేషన్-సేవ్ డెమోక్రసీ' పేరుతో ఎన్డీయే యేతర పక్షాలు శుక్రవారం సమావేశమయ్యాయి.

భేటీకి హాజరైన విపక్ష నేతలు

రాహుల్‌గాంధీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, డెరక్ ఒబ్రెయిన్, కనిమొళి, శరద్ యాదవ్, శరద్ పవార్, ఏకే ఆంటోని, అహ్మద్ పటేల్, రాంగోపాల్ యాదవ్, కోదండరామ్ సహా వివిధ పార్టీల నేతలు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మోడీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని దుయ్యబట్టారు. ఎన్డీయే పాలనలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. రాఫెల్ యుద్ధ విమానాల కోనుగోలు ఒప్పందం ద్వారా రూ.30వేల కోట్లు అనిల్ అంబానీకి నేరుగా లబ్ధి చేకూర్చారన్నారు.

నల్ల చొక్కాతో చంద్రబాబు

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన రాష్ట్ర బంద్‌కు సంఘీభావంగా శుక్రవారం సీఎం చంద్రబాబు నల్ల చొక్కా ధరించి అసెంబ్లీకి హాజరయ్యారు. విభజన హక్కుల సాధన కోసం కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీఎం కార్యాచరణ ప్రకటించారు. విభజన చట్టం అమలులో కేంద్రం మొండిచేయి చూపడమే కాకుండా పార్లమెంటులో ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఒకటో తేదీన నిరసన దినంగా పాటించాలని చంద్ర బాబు పిలుపునిచ్చారు. మంత్రులు, ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు నల్లదుస్తులు ధరించి రావాలన్నారు. దీంతో పలువురు సభ్యులు నల్ల చొక్కాలు ధరించగా, మహిళలు నలుపు రంగు చీరలతో సభకు హాజరయ్యారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు' అంశంపై లఘుచర్చలో చంద్ర బాబు బీజేపీ తీరును ఎండగట్టిన ఆయన తర్వాత అదే దుస్తులతో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.



యనమల మనస్సాక్షికి తెలుసు: విష్ణుకుమార్‌రాజు

రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు నలుపు చొక్కా వేసుకొచ్చేవారని, కేంద్రం న్యాయంగా నిధులు ఇస్తున్నం దునే ఆయన సాధారణ దుస్తులతో వచ్చారని బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఎంత చేసిందో యనమల మనస్సాక్షికి తెలుసు అన్నారు. 'అతితక్కువ సమయంలో రాష్ట్రంలో రాజకీయాలు మారిపోయాయి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆవిర్భవించిన టీడీపీ అదే పార్టీలో కలసి పయనిస్తుంటే ప్రజలు ఆశ్చర్యపోతున్నారు, టీడీపీ నేతలు రకరకాల డ్రామాలు, రకరకాల దుస్తులు వేస్తున్నారు' అని ఎద్దేవా చేశారు. ఎంతో శుభప్రదమైన పసుపు రంగు దుస్తులు కాకుండా నలుపు రంగువి వేసి పసుపుకు అన్యాయం చేశారన్నారు. కొందరు తప్ప అందరూ నల్లధనంతో నిండిపోయారని ఘాటుగా విమర్శించారు. దీంతో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కాలవ శ్రీనివా సులు, దేవినేని ఉమాతో పాటు పలువురు సభ్యులు విష్ణుకుమార్‌రాజుపై ముప్పేటదాడికి దిగారు. ఆకుల ఎందుకు రాజీనామా చేశారో చెప్పాలని వారు డిమాండు చేయడంతో టీడీపీకి మేడా మల్లికార్జునరెడ్డి ఎందుకు రాజీనామా చేశారో అధికారపార్టీ చెప్పాలని బీజేపీ పక్షనేత ఎదురు ప్రశ్నించారు.



గుంటూరులో ఆందోళన చేస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్ కుమార్ తదితరులు



కర్నూలులో సీపీఐ నాయకులను అరెస్టు చేసి వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు



విశాఖపట్నంలో ఆందోళన చేస్తున్న జేవీఎస్ఎన్ మూర్తి తదితరులు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.